www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★




చర్చల పునరుద్ధరణకు
ఇరాన్ ఏడు షరతులు
స్వయంకృతాపరాధాల ఊబిలో ట్రంప్
బయటపడాలంటే షరతులు ఒప్పుకోవడమే మార్గం
ఇరాన్ సుప్రీం కౌన్సిల్ కార్యదర్శి రెజాయీ హెచ్చరిక
08

సంపుటి 09, సంచిక: 291 | సోమవారం | 21 -09-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

వరంగల్ మామునూరు

## ఎయిర్‌పోర్టుకు టెండర్లు

- రూ.213.59 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మాణం
- ఇప్పటికే భూసేకరణ పూర్తి, డిపిఆర్ సిద్ధం
- నెరవేరనున్న ఓరుగల్లు ప్రజల చిరకాల స్వప్నం




ప్రజాపక్షం/హనుమకొండ

చారిత్రక ఓరుగల్లు నగర ప్రజల చిరకాల స్వప్నమైన మామునూరు ఎయిర్‌పోర్టు పనులలో వేగం పెరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఎయిర్ పోర్ట్ నిర్మాణాన్ని చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న కారణంగా వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే భూసేకరణ పూర్తి చేసి, డిపిఆర్ సిద్ధం చేయగా, నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ కూడా మొదలైంది.ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కీలక ప్రకటన చేసింది. ఎయిర్‌పోర్టు పునరుద్ధరణలో భాగంగా రూ.213.59 కోట్ల భారీ అంచనా వ్యయంతో చేపట్టనున్న తరువాయి 8లో

దళితుల భూములకు

# సంపూర్ణ రక్షణ

- దళితులు, గిరిజన భూముల్లో అంగుళం కూడా ప్రభుత్వం తీసుకోదు
- ఎవరూ ఆందోళన చెందొద్దు
- భూములపై ప్రజాహక్కుల నమోదు, వివాదాల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి భరోసా
- కావాలనే కొందరు భయాందోళనలను సృష్టిస్తూ విషప్రచారం చేస్తున్నారని మండిపాటు



ప్రజాపక్షం/హైదరాబాద్

దళితులు, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజా ప్రభుత్వ విధానం కాదని, వారి అంగుళం భూమిని కూడా ప్రభుత్వం తీసుకోదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం దళితుల భూములకు సంపూర్ణ రక్షణగా నిలుస్తుందని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో రెండున్నర సంవత్సరాల క్రితం దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల ప్రజల ఆశీస్సులతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని మంత్రి తెలిపారు. సామాజిక న్యాయం, పేదల సంక్షేమం, అణగారిన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ పేదలు, దళితులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వాలేనన్నారు. భూ సంస్కరణలు, భూ పంపిణీ కార్యక్రమాల ద్వారా భూమిలేని దళితులకు భూములు ఇచ్చి వాటిపై హక్కులు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఉందన్నారు. తెలంగాణ ప్రాంతంలో ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో దళితులకు సుమారు 25 లక్షల ఎకరాల భూములను పంపిణీ చేశామని, పోడు భూముల విషయంలో గిరిజనులకు సుమారు రెండు లక్షల ఎకరాలపై హక్కులు కల్పించిన ఘనత కూడా కాంగ్రెస్కే దక్కుతుందని తెలిపారు. భూమిలేని వారికి భూమి, హక్కులు లేని వారికి హక్కులు కల్పించడమే కాంగ్రెస్ విధానమన్నారు. దళిత, గిరిజనుల భూ హక్కులను పరిరక్షిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ అధికారంలోకి వస్తే దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చి, ఆ తర్వాత ఆ వాగ్దానాన్ని అమలు చేయలేదని విమర్శించారు. అలాంటి హామీలను ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

**దళితులు, గిరిజనుల భూ హక్కులను మరింత పటిష్టం చేయడమే లక్ష్యం**

రెవెన్యూ శాఖ మంత్రిగా, ముఖ్యమంత్రి తరఫున దళిత కుటుంబాలకు తరువాయి 12లో



# భారత్‌కు అగ్ని పరీక్ష

నవంబరు నుండి వచ్చే ఏడాది వరకూ సూపర్ ఎల్‌నినో

- దేశ సహజ వ్యవస్థలపై వినాశకర ప్రభావం
- ఉపఖండంలో తీవ్ర వేడి, కరువు, కార్చిచ్చు పరిస్థితులు
- రైతులు, మత్స్యకారులు, గొర్రెలకాపరులకు చేటు
- పండ్ల ఉత్పత్తులు, జంతు ప్రవృత్తిలో తీవ్ర మార్పులు
- జీవ వైవిధ్యంపై తీవ్ర ప్రభావం
- దేశ భవిష్యత్ రక్షణకు అనుభవాలను అధ్యయనం చేయాలి
- క్షేత్రస్థాయి నిపుణులకు 188 మంది శాస్త్రవేత్తల పిలుపు

**న్యూఢిల్లీ :** సూపర్ ఎల్‌నినో ప్రభావాలకు సిద్ధంగా ఉండాలని భారతదేశానికి చెందిన 188 మంది శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు పిలుపు ఇచ్చారు.గడచిన మే నెలలో ఎల్‌నినో ప్రారంభమైంది. ఇది సూపర్ ఎల్‌నినోస్థాయికి ఎదిగింది. భారత్ సహా ప్రధానంగా ఉత్తరార్థగోళంలో తీవ్ర ప్రభావం చూపిస్తుంది. భారత్‌పై,దేశ ప్రకృతి సంపదపై ఈ సూపర్ ఎల్‌నినో వినాశకరమైన ప్రభావం చూపిస్తుంది.పండ్ల ఉత్పత్తులు,జంతు ప్రవృత్తిపై ప్రభావం వినాశకరంగా కనిపిస్తుంది.ఈ ఏడాది నవంబరు నుండి వచ్చే సంవత్సరం వరకూ ఈ ప్రభావం ఉంటుంది. ఈ మేరకు ఒక విజ్ఞాపనపై శాస్త్రవేత్తలు సంతకాలు చేశారు. దేశంలోని తోటి పరిశోధకులు, క్షేత్రస్థాయా నిపుణులు ఈ ప్రభావాలపై పర్యవేక్షణలకు సిద్ధంకావాలని కోరుతూ, ఈ సూపర్ ఎల్‌నినో దేశంలోని సహజ వ్యవస్థలపై తీవ్రమైన ప్రభావం చూపించగలదని వారు హెచ్చరించారు. అతి తీవ్రమైన వాతావరణ పరిణామాలు, ప్రకృతిని,దాని అనుబంధ సామాజిక వ్యవస్థలను ఎలా తీవ్రస్థాయిలో దెబ్బ తీస్తాయో బాగా అర్థం చేసుకోవడానికి మరింత పటిష్టమైన పరిశోధనలు,పర్యవేక్షణలకు సమాయత్తం తరువాయి 8లో

ఆదిలాబాద్ జెయుఎ

## పనులు వేగవంతం

- కేంద్ర రక్షణ, పౌర విమానాశ్రయ శాఖల నోడల్ అధికారుల నియామకం
- కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలోని ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత 'జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ (జెయుఎ), ఎయిర్‌ఫోర్స్ శిక్షణ కేంద్రాన్ని సత్వరమే అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. కేంద్ర రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖల నుంచి వేర్వేరుగా నోడల్ అధికారులను నియమించినట్లు కేంద్ర బొగ్గు, గను ల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఎక్స్ వేదికగా వెల్లడించారు. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ, పౌర విమానయాన మం త్రిత్వ శాఖలతో తాను జరిపిన నిరంతర చర్చలు, సంప్రదింపుల ఫలితంగానే ఈ పురోగతి సాధ్యమైందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ రెండు కేంద్ర శాఖల నోడల్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తారని తెలిపారు.

**భారీ మౌలిక వసతుల కల్పన..**

రక్షణ శాఖ పరిధిలో ట్రైనర్ తరువాయి 12లో



బిసిల హక్కుల కోసం

# దేశవ్యాప్త ఐక్య పోరాటం

- 2027 జనగణనలో ఒబిసి కాలమ్ చేర్చాలి
- 50 శాతం రిజర్వేషన్ పరిమితిపై కేంద్రం పునరాలోచించాలి
- జాతీయ ఒబిసి సదస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్

బిసిల హక్కులు, సామాజిక న్యాయం కోసం దేశవ్యాప్తంగా ఐక్య పోరాటం అవసరమని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. 2027లో నిర్వహించనున్న జనాభా లెక్కల్లో ఒబిసిలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. బిసిల జనాభాను శాస్త్రీయంగా లెక్కించినప్పుడే జనాభా ప్రాతిపదికన వారికి న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బేగంపేటలోని హోటల్ టూరిజం ప్లాజాలో ఆదివారం 'ఒబిసి జనాభా గణనపై కేంద్ర ప్రభుత్వ తరువాయి 8లో

నిజాం కంటే

## కెసిఆర్ కుటుంబ ఆస్తులే ఎక్కువ!

- పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో వందల ఎకరాలు ఎలా సమకూరాయి?
- 2004, 2009 అఫిడవిట్‌లలో లేని భూములు ఇప్పుడు ఎలా వచ్చాయి?
- భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంపి డాక్టర్ మల్లు రవి నిలదీత
- రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లో హరీశ్‌రావు, రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లను పరిశీలించిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు



ప్రజాపక్షం/రంగారెడ్డి

తెలంగాణలో భూములు, ఫాంహౌస్‌ల వ్యవహారంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం మరింత ముదురుతోంది. గత మూడు రోజులుగా కాంగ్రెస్ ప్రతినిధి బృందం మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు భూముల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డికి సంబంధించినవిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫాంహౌస్ ప్రాంతాలను తరువాయి 8లో

కరోనా కంటే
ప్రమాదకరమైనది క్యాన్సర్
03




విశాల ప్రజా వేదిక ఏర్పాటుకు

# కమ్యూనిస్టుల ఐక్యత బాసటగా నిలవాలి

వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్య వేదిక ప్రథమ సదస్సులో వామపక్ష పార్టీలు, సామాజికవేత్తలు, మేధావుల పిలుపు




ప్రజాపక్షం/హైదరాబాద్

కమ్యూనిస్టుల ఐక్యత, విశాల ప్రజా వేదిక ఏర్పాటుకు బాసటగా నిలవాలని పలువురు వామపక్ష పార్టీలు, సామాజికవేత్తలు, మేధావులు పిలుపునిచ్చారు. వామపక్ష పార్టీలు ఐక్యత లక్ష్యంగా వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్య వేదిక (యుఎల్‌డి) ప్రథమ సదస్సు ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. యుఎల్‌డి కన్వీనర్ జస్టిస్ బి.చంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా, తరువాయి 8లో

# రష్యాపై భీకర దాడి

- పోలింగ్ వేళ వెయ్యి డ్రోన్లతో విరుచుకుపడిన ఉక్రేన్
- ఇద్దరు మృతి : దెబ్బతిన్న చమురుశుద్ధి కేంద్రం
- యూరోపియన్ యూనియన్ ఆందోళన



**మాస్కో:** రష్యాలో పార్లమెంటు దిగువసభ డ్యూమాకు చివరిరోజైన మూడోరోజు ఆదివారం ఎన్నికల పోలింగ్ ప్రక్రియ జరుగుతున్న సమయంలో ఉక్రేన్ భీకర దాడులకు దిగింది. దాదాపు 1000కు పైగా డ్రోన్లతో మాస్కో సహా పలు ప్రాంతాలపై ఉక్రేన్ విరుచుకుపడింది. ఈ దాడుల్లో ఇద్దరు మరణించారు. అనేకమంది గాయపడ్డారు. ఆదివారం తెల్లవారకముందే జరిగిన ఈ దాడులవల్ల మాస్కో ప్రాంతంలో ఇద్దరు మరణించగా ఆరుగురు గాయపడారని గవర్నర్ ఆండ్రీ వోరోబ్యేవ్ చెప్పారు.మాస్కోవైపు దూసుకువస్తున్న 450 డ్రోన్లను రక్షణ బలగాలు కూల్చివేశాయని మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్ చెప్పారు. మాస్కో గగనతలంపై రాత్రివేళ ఆకాశంలో పేలుళ్ళు సంభవించాయి. మండుతున్న గిడ్డంగి ఎర్రగా నల్లటి పొగలు కక్కుతున్న దృశ్యాలు వీడియోల్లో కనిపించాయి. ఎన్నికల పోలింగ్‌కు ఆటంకం కలిగించే ఉద్దేశంతో మాస్కో ప్రధాన రహదారిలో ఉన్న ఒక భవనంపై డ్రోన్ దాడులు జరిగాయని సోబ్యానిన్ చెప్పారు. ఒక చమురు శుద్ధి కర్మాగారం కూడా ఈ దాడుల్లో బాగా దెబ్బతిన్నదని, మాస్కోపై గతంలో ఏనాడూ ఇలాంటి భారీ దాడులు జరగలేదని అన్నారు. ఒక వైపు రష్యాలో మూడోరోజు ఓటింగ్ జరుగుతున్న సమయంలో ఈ దాడులు జరిగాయి. ఇది దేశానికి సవాలుగా మారింది. రష్యా ఆక్రమించిన ఉక్రేన్‌లోని నాలుగు ప్రాంతాలలో మొదటిసారి ఎన్నికలు నిర్వహిస్తున్న సమయంలో ఉక్రేన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ భూభాగాలలో ఎన్నికలను, వారిని రష్యా దిగువసభలో సభ్యులుగా చేసుకునే ప్రక్రియను వ్యతిరేకించింది. యుద్ధ యంత్రాంగానికి తరువాయి 12లో



బంగాళాఖాతంలో

## బలపడుతున్న అల్పపీడనం

- నేడు వాయుగుండంగా మారే అవకాశం

**రాష్ట్రంలో వారం రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు : ఐఎండి**

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉత్తర అండమాన్ సముద్రం, దానికి ఆనుకుని ఉన్న తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతోంది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఈనెల 21న వాయుగుండంగా, 22న తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తరువాయి 12లో

# ఆధునిక తెలుగు సాహిత్యంలో గురజాడది స్థిరమైన అడుగుజాడ



తెలుగు సాహిత్యంలో ఆధునికతను కేవలం కొత్త ప్రక్రియల ప్రవేశంగా కాకుండా, జీవితాన్ని చూసే కొత్త దృష్టిగా స్థాపించిన రచయితల్లో గురజాడ అప్పారావు అగ్రగణ్యుడు. 1862 సెప్టెంబర్ 21న జన్మించి, 1915 నవంబర్ 30న మరణించిన గురజాడ జీవితం సుమారు 53 సంవత్సరాలే. కానీ ఆ స్వల్ప కాలంలో ఆయన తెలుగు భాష, సాహిత్యం, రంగస్థలం, సామాజిక ఆలోచన, జాతీయ చైతన్యం వంటి అనేక రంగాలపై శాశ్వతమైన ప్రభావం చూపాడు. విజయనగరం ఆయన విద్యాభ్యాసానికి, ఉద్యోగ జీవితానికి, సాహిత్య వికాసానికి ప్రధాన కేంద్రంగా నిలిచింది. మహారాజా ఆనంద గజపతితో ఆయనకు ఏర్పడిన పరిచయం తరువాతి జీవితంలో కీలకమైంది. విజయనగరం సంస్థానంలో శాసన పరిశోధకుడిగా పనిచేయడంతో పాటు, ఎంఆర్ కళాశాలలో అధ్యాపకుడిగా కూడా పనిచేశాడు. 1911లో మద్రాసు విశ్వవిద్యాలయం బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో సభ్యుడయ్యాడు. 1913లో విశ్వవిద్యాలయం ఆయనను ఫెలోగా గౌరవించింది. గురజాడ పుట్టిన తేదీ విషయంలో ఒకప్పుడు రెండు తేదీలు ప్రచారంలో ఉన్నాయి. 1861 నవంబర్ 30 అని కొందరంటే, కాదు, 1862 సెప్టెంబర్ 21 అని మరి కొందరి వాదన. అయితే ఆయన వారసులు 1862 సెప్టెంబర్ 21నే జన్మదినంగా అంగీకరించారని లభ్యమైన జీవితచరిత్ర ఆధారాలు సూచిస్తున్నాయి. గుజరాడకు ఆంగ్ల సాహిత్యంపై గాఢమైన పట్టు ఉండేది. 'సారంగధర' వంటి ఆంగ్ల రచనలతో ఆయన తొలినాళ్లలోనే రచయితగా గుర్తింపు పొందాడు. తరువాత తెలుగు ఆయన సృజనకు ప్రధాన భాషగా మారింది. 'కన్యాశుల్కం', 'ముత్యాల సరాలు', 'నీలగిరి పాటలు', 'పూర్ణమ్మ', 'లవణరాజు కల', 'మనీషి', 'కాసులు', 'కొండుభట్టీయం', 'బిల్హణీయం' వంటి రచనలు ఆయన సాహిత్య పరిధిని తెలియజేస్తాయి. 'ముత్యాల సరాలు' తెలుగు కవిత్వంలో కొత్త లయను, కొత్త భాషా స్వరాన్ని ముందుకు తెచ్చింది. సంప్రదాయ ఛందోబద్ధతకు భిన్నంగా ప్రజల మాటకు దగ్గరైన కవితా వ్యక్తీకరణకు అది మార్గం వేసింది. అయితే గురజాడను కేవలం కవి లేదా నాటకకర్తగా నిర్వచించడం ఆయన ప్రాధాన్యాన్ని తగ్గించడమే అవుతుంది. ఆయన అసలు విశిష్టత సాహిత్యాన్ని జీవితంతో అనుసంధానించడంలో ఉంది. సమాజంలో కనిపించే అన్యాయాన్ని దూరం నుంచి పరిశీలించి వ్యాఖ్యానించలేదు. దానిని పాత్రలుగా, సంభాషణలుగా, వ్యంగ్యంగా, కవిత్వంగా సాహిత్యంలోకి తీసుకొచ్చాడు. అందువల్ల ఆయన రచనలు ఒక కాలానికి సంబంధించిన చారిత్రక పత్రాలుగానే కాకుండా, సామాజిక మనస్తత్వాన్ని అర్థం చేసుకునే ఆధారాలుగా కూడా నిలిచాయి.

గురజాడ పేరు వినగానే ముందుగా గుర్తుకు వచ్చేది 'కన్యాశుల్కం'. ఈ నాటకానికి తొలి రూపం 1892లో రంగస్థలంపైకి వచ్చింది. 1897లో అది పుస్తకరూపంలో వెలువడింది. తెలుగు రంగస్థల చరిత్రలో సామాజిక సమస్యలను ఆధునిక దృష్టితో నేరుగా పరిశీలించిన ముఖ్యమైన తొలి నాటకాల్లో ఇది ఒకటి. 'కన్యాశుల్కం' అనే పదమే ఆ కాలంలోని ఒక దురాచారాన్ని సూచిస్తుంది. వివాహ సమయంలో వధువు కుటుంబం వరుడికి కట్నం ఇచ్చే పద్ధతికి భిన్నంగా, కొన్ని వర్గాల్లో వరుడు వధువు కుటుంబానికి డబ్బు చెల్లించే ఆచారం ఉండేది. ఈ ఆచారం చివరకు బాలికను ఒక సామాజిక వస్తువుగా మార్చే స్థితికి చేరింది. వయసు మళ్లిన పురుషులు చిన్న వయసున్న బాలికలను వివాహం చేసుకోవడం, ఆర్థిక లావాదేవీల కోసం బాల్యాన్ని తాకట్టు పెట్టడం, ఆ వివాహాల తరువాత బాలవితంతువుల సంఖ్య పెరగడం వంటి సమస్యలు ఆ కాలపు సమాజంలో తీవ్రంగా కనిపించేవి. గురజాడ ఈ వ్యవస్థను ఉపన్యాసం ద్వారా కాకుండా, నాటకీయ వ్యంగ్యం ద్వారా సమాజం ముందుంచాడు. అయితే, ఈ నాటకంలోని గొప్పతనం దాని సామాజిక అంశానికి మాత్రమే పరిమితం కాలేదు. ఆ ఘనత పాత్రల నిర్మాణంలో ఉంది. గిరీశం వంటి పాత్ర ద్వారా విద్య, సంస్కరణ, ఆధునికత వంటి పదాలను స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకునే కపట మేధావి స్వభావాన్ని ఆయన వ్యంగ్యంగా చూపించాడు. మరోవైపు మధురవాణి పాత్రను కేవలం వేశ్య అనే సామాజిక గుర్తింపులో బంధించకుండా, ఆ పాత్రకు తెలివి, పరిశీలన, మానవత్వం, నిర్ణయశక్తి ఇచ్చాడు. ఆ కాలపు నైతిక ప్రమాణాలను తలకిందులు చేసే విధంగా ఈ పాత్రను నిర్మించడం గురజాడ సామాజిక దృష్టిలోని సంక్లిష్టతను వెల్లడిస్తుంది. వ్యక్తి వృత్తి లేదా సామాజిక గుర్తింపు కంటే అతని ప్రవర్తన, మానవత్వం, నైతికతకు ప్రాధాన్యం ఇవ్వాలనే భావన ఇందులో కనిపిస్తుంది. బాల్యవివాహాల సమస్యపై ఆయన వ్యతిరేకత 'పూర్ణమ్మ' వంటి రచనల్లో మరింత హృదయస్పర్శిగా నిలుస్తుంది. చిన్న వయసులోనే వివాహ బంధంలోకి వెళ్లాల్సి వచ్చిన ఓ బాలిక జీవితాన్ని విషాదంగా చిత్రించడం ద్వారా, సామాజిక ఆచారం వెనుక దాగిన వ్యక్తిగత విషాదాన్ని గురజాడ చూపించాడు. స్త్రీని కుటుంబ గౌరవానికి, ఆర్థిక లావాదేవీకి, పురుషాధిక్య వ్యవస్థకు పరిమితమైన వ్యక్తిగా చూసే దృష్టిని ప్రశ్నించాడు. కులవ్యవస్థపై కూడా గురజాడ ఆలోచనలో మానవతావాదమే కేంద్రంగా నిలిచింది. మనుషులను జన్మ ఆధారంగా విభజించడం కంటే మంచితనం, చెడుతనం అనే నైతిక ప్రమాణాలతో చూడాలనే భావన ఆయన కవిత్వంలో వ్యక్తమవుతుంది. 'మంచి చెడ్డలు మనుజులందున / ఎంచి చూడగ రెండే కులములు' అనే ప్రసిద్ధ పంక్తులు ఈ దృష్టిని స్పష్టంగా చెబుతాయి. 'మనీషి' కవితలో ఆయన మానవుడిని విగ్రహం కంటే తక్కువగా చూడే మతాచారాలపై ప్రశ్నలు సంధించాడు. దేవుడిని దూరంలోని కొండల్లో వెతకడం కంటే మనిషిలోని మానవత్వాన్ని గుర్తించాలనే భావన ఆయన రచనల్లో పదేపదే కనిపిస్తుంది. ఇక్కడే గురజాడ సంస్కరణవాదానికి ప్రత్యేకత కనిపిస్తుంది. ఆయన సంప్రదాయాన్ని మొత్తం తిరస్కరించలేదు. సంప్రదాయంలో ఏర్పడిన అన్యాయాన్ని, అహేతుకతను, కపటత్వాన్ని నిలదీశాడు. సమాజాన్ని మార్చడానికి సాహిత్యాన్ని ఒక సాధనంగా ఉపయోగించారు. సాహిత్యానికి సామాజిక బాధ్యత ఉందనే భావన ఆయన రచనా తత్వానికి కేంద్రబిందువు.

### భాష, జాతీయత, మానవతావాదం

గురజాడ ఆధునికతలో మరో కీలక అంశం భాష. ఆయనకు భాష అనేది పాఠకుడిని చేరుకునే ప్రధాన సాధనం. సంస్కృత ప్రభావంతో బరువెక్కిన గ్రాంథిక భాష సామాన్య పాఠకుడికి దూరంగా ఉందని ఆయన గుర్తించాడు. అందుకే, ఆ రోజుల్లో ప్రజలు మాట్లాడే భాషను సాహిత్యంలోకి తీసుకువచ్చాడు. 'కన్యాశుల్కం'లోని సంభాషణలు దీనికి అత్యంత శక్తివంతమైన ఉదాహరణ. విజయనగరం ప్రాంతపు వ్యవహారిక భాషకు దగ్గరగా పాత్రలు మాట్లాడటం వల్ల నాటకం సహజత్వాన్ని సాధించింది. తెలుగు రంగస్థలానికి వ్యవహారిక భాష సరిపోదనే అభిప్రాయాన్ని కూడా ఈ నాటకం సవాలు చేసింది. భాషను సరళీకరించడం అంటే సాహిత్య ప్రమాణాలను తగ్గించడం కాదని గురజాడ రచనలు నిరూపించాయి. దీనికి విరుద్ధంగా, జీవితం నుంచి వచ్చిన భాష పాత్రలకు మరింత విశ్వసనీయతను అందించింది. హాస్యం, వ్యంగ్యం, వ్యావహారిక ప్రయోగాలు, స్థానిక నుడికారాలు ఆయన నాటకానికి జీవం పోశాయి. ఈ మార్పు తరువాతి తెలుగు కథ, నాటకం, కవిత్వంపై గణనీయమైన ప్రభావం చూపింది. తెలుగు ఆధునిక సాహిత్యంలో మాట్లాడే భాషకు గౌరవం పెరగడానికి గురజాడ రచనలు ముఖ్యమైన కారణాల్లో ఒకటిగా నిలిచాయి. జాతీయత విషయంలో కూడా ఆయన దృష్టి ప్రత్యేకమైనది. 'దేశభక్తి' లేదా 'దేశమును ప్రేమించుమన్నా' కవితలో దేశాన్ని కేవలం భూభాగంగా కాకుండా ప్రజల సమాహారంగా చూడాలని ఆయన చెప్పాడు. 'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' అనే భావనలో ఆయన జాతీయతకు మానవతా పునాది కనిపిస్తుంది. దేశభక్తి అంటే నినాదాలు చేయడం కాదని, 'ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం.. శ్రమించడం.. జ్ఞానం సంపాదించడం.. కళలను అభివృద్ధి చేయడం.. సమాజానికి ఉపయోగపడే పని చేయడం' అని ఆయన కవిత్వం చెబుతుంది. 'ముత్యాల సరాలు'లోని ఈ కవితా దృష్టి ఆధునిక జాతీయతకు ఒక విస్తృతమైన నిర్వచనాన్ని అందిస్తుంది. గురజాడ జాతీయతలో సంకుచిత ప్రాంతీయతకు స్థానం లేదు. వివిధ మతాలు, కులాలు, వర్గాల ప్రజలు పరస్పరం సోదరభావంతో జీవించాలని ఆయన కోరాడు. 'మతం వేరైతే ఏమోయ్ / మనసులొకటై మనుషులుంటే' అనే భావన ఆయన జాతీయతకు ఉన్న విశాలతను తెలియజేస్తుంది. దేశం అభివృద్ధి చెందాలంటే ప్రజల మధ్య మనోభేదాలు తగ్గి, సామూహిక ప్రయోజనం పెరగాలని ఆయన నమ్మాడు. మానవతావాదం, సంస్కరణవాదం, జాతీయత పరస్పరం విడిపోని మూడు ధోరణులుగా ఆయన రచనలు కనిపిస్తాయి. కులవివక్షను ప్రశ్నించడం మానవతావాదం నుంచి వచ్చింది. బాల్యవివాహాలు, స్త్రీలపై వివక్షను వ్యతిరేకించడం సంస్కరణవాదం నుంచి వచ్చింది. ప్రజలందరూ కలిసి దేశాన్ని నిర్మించాలనే ఆలోచన ఆయన జాతీయతకు పునాది అయింది. ఈ మూడింటినీ కలిపినందువల్లే గురజాడ ఆలోచన తన కాలాన్ని దాటి ముందుకు వెళ్లింది. గురజాడకు కళ స్వతంత్ర విలువ కలిగినదే. అయితే కళ జీవితానికి దూరంగా ఉండకూడదని ఆయన భావించాడు. సాహిత్యం కేవలం భాషా విన్యాసంగా మిగిలిపోతే దాని సామాజిక శక్తి తగ్గిపోతుందని, సమాజంలోని అన్యాయాలను వెలుగులోకి తేవడం, నైతిక చైతన్యాన్ని పెంచడం, మనిషిని తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని కొత్తగా చూడటానికి ప్రేరేపించడం ద్వారా మాత్రమే సాహిత్యానికి నిజమైన సార్థకత ఏర్పడుతుందని ఆయన రచనలు సూచిస్తాయి. ఒక రకంగా ఆయన రచనలు కాలం కంటే ముందుకు పరుగులు తీస్తాయి. మనిషి మెదడులోకి చొచ్చుకుపోయి, ఆలోచించేలా చేస్తాయి. అందుకే గురజాడను కేవలం 'ఆధునిక తెలుగు సాహిత్య పితామహుడు' వంటి బిరుదులతో స్మరించడం సరిపోదు. ఆయన అసలు ప్రాధాన్యం తెలుగు సాహిత్యంలోకి ఒక కొత్త మనిషిని తీసుకురావడంలో ఉంది. ఆ మనిషి కులం, మతం, జన్మ, వృత్తి వంటి గుర్తింపుల కంటే మానవత్వాన్ని ముందుకు పెడతాడు. మూఢనమ్మకాన్ని ప్రశ్నిస్తాడు. స్త్రీ జీవితాన్ని స్వతంత్ర మానవ సమస్యగా చూస్తాడు. ప్రజల భాషలో మాట్లాడతాడు. దేశభక్తిని కార్యాచరణతో కొలుస్తాడు. సాహిత్యంలో కొత్తదనం అనేది కొత్త పదాలు లేదా కొత్త ఛందస్సులతో మాత్రమే రాదని, ప్రపంచాన్ని చూసే దృష్టి మారినప్పుడు సాహిత్యం ఆధునికమవుతుందని ఆయన తన రచనలతో నిరూపించాడు. మనిషిని సాహిత్యానికి కేంద్రంగా పెట్టినప్పుడు అది సమాజంతో సంభాషిస్తుంది. గురజాడ ఆ మార్పును తన కాలంలోనే ఆచరణలో చూపించాడు. అందుకే ఆయన రచనలు ఒక శతాబ్దం దాటినా పాతబడలేదు. ఆయన లేవనెత్తిన ప్రశ్నలు ఇప్పటికీ సమాజాన్ని నిలదీస్తునే ఉంటాయి. ఆధునిక సాహిత్యానికి పలు విధాలుగా సరికొత్త రంగులు అద్దిన గురజాడ అడుగుజాడలు తెలుగు సాహిత్యంలో ఎప్పటికీ చెక్కుచెదరకుండా ఉంటాయి. రచయితలకు మార్గదర్శనం చేస్తాయి.

**యువి. రత్నం, 9640467269**




## చదవాల్సిన పుస్తకం

### సామాజిక రుగ్మతలపై ఎక్కుపెట్టిన బాణం 'కన్యాశుల్కం'

పంతొమ్మిదో శతాబ్దం చివరి దశలో తెలుగు నాటక రచయిత గురజాడ అప్పారావు రచించిన నాటకం కన్యాశుల్కం. దీనిని వెల్చేరు నారాయణరావు ఆంగ్లంలోకి అనువదించగా, 2007లో 'గర్ల్స్ ఫర్ సేల్' పేరుతో ప్రచురితమైంది. కన్యాశుల్కం తొలిసారిగా 1892లో ప్రదర్శితమైంది. 1897లో పుస్తకరూపంలో వెలువడింది. తరువాత 1909లో రెండో, సవరించిన సంచిక ప్రచురితమైంది. భారతదేశంలోని ఏ భాషలోనైనా వలసవాదం భారతీయ సమాజంపై చూపిన ప్రభావాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించిన తొలి వాస్తవిక నాటకంగా కన్యాశుల్కంను పరిగణిస్తారు. ఏడు అంకాలతో విస్తరించిన కన్యాశుల్కం బహుస్వర నాటకం. ప్రతి అంకం తనదైన ప్రత్యేకతను కలిగి ఉన్నప్పటికీ, మొత్తం నాటకాన్ని చదివినప్పుడు అవన్నీ కలిసి ఒక దీర్ఘకథకు సమన్వయమైన స్వరూపాన్ని ఇస్తాయి. నాటకం చమత్కారభరితం, హాస్యభరితం, గంభీరమైనది, అదే సమయంలో తీవ్రంగా నిజాయితీతో కూడినది. అందుకే తెలుగు సాహిత్యంలోని శాస్త్రీయ రచనల్లో ఒకటిగా దీనికి గుర్తింపు లభించింది. కన్యాశుల్కంలోని సంభాషణలకు ఇప్పటికీ సాటిలేదు. విద్యావంతులైన తెలుగువారిలో ఈ నాటకం ఎంత ప్రజాదరణ పొందిందంటే, ఇందులోని సంభాషణలను కంఠస్థం చేసుకుని రోజువారీ సంభాషణల్లో ఉటంకించడం సాధారణమైంది. నాటకంలోని పాత్రలు ప్రజలకు తమ పక్కింటివారిలా పరిచయమయ్యాయి. ప్రజల ఊహాలోకంలో అవి స్వతంత్ర జీవితాన్ని సంతరించుకున్నాయి. కన్యాశుల్కం ఒక చురుకైన, సామాజికంగా పైకి ఎదుగుతున్న సమాజాన్ని చిత్రిస్తుంది. ఆ సమాజంలో అన్ని వర్గాల ప్రజలు కనిపిస్తారు. వేదాలు పఠించే బ్రాహ్మణుల నుంచి వేశ్యావృత్తిలో ఉన్న విధవరాళ్ల వరకు, అవినీతిపరులైన పోలీసు అధికారుల నుంచి ఆదర్శవాద న్యాయవాదుల వరకు, తెలివైన వేశ్యల నుంచి నకిలీ యోగుల వరకు, గ్రామీణ రాజకీయాల్లో చతురులైన నాయకుల నుంచి ఆంగ్లం మాట్లాడే దర్జాగా తిరిగే యువకుల వరకు, వివిధ కులాలు, వృత్తులకు చెందిన తెలివైన వ్యక్తుల వరకు అనేక రకాల పాత్రలు ఇందులో ఉన్నాయి. వితంతు పునర్వివాహం, బంధుత్వం, స్నేహం, న్యాయవ్యవస్థలో అవినీతి, లింగ అసమానత, ఆంగ్ల ప్రభావం, వలస పాలకుల ప్రభావం, వలస భాష ప్రభావం, కఠినమైన పితృస్వామ్య కుటుంబ వ్యవస్థ వంటి అనేక అంశాలను ఈ నాటకం పరిశీలిస్తుంది. అయితే ఇక్కడ ప్రధానంగా చర్చించాల్సిన అంశం 'వలస ఆధునికత'. నిజానికి 'వలస ఆధునికత'ను 'అది ఏమిటి' అని చెప్పడం కంటే, 'అది ఏమి కాదు' అని చెప్పడం ద్వారా సులభంగా నిర్వచించవచ్చు. అది 'సంప్రదాయం' కాదు. సమీప గతాన్ని తిరస్కరించి, దానికి స్పష్టంగా భిన్నమైనదిగా తనను తాను ప్రతిష్ఠించుకుంటుంది. తెలుగులో ఇరవయ్యో శతాబ్దపు ఆధునిక కవులు తమను తెల్లవారుజామున మేలుకొలుపు గీతాలు పాడే 'వైతాళికులు'గా అభివర్ణించుకున్నారు. అంటే, చీకటి రాత్రి ముగిసిందని ప్రకటించేవారిగా తమను తాము భావించారు. ఇరవయ్యో శతాబ్దం తొలి దశలోని కవులు తమ కవిత్వానికి 'నవ్య', 'ఆధునిక' వంటి పదాలను గుర్తింపులుగా స్వీకరించడానికి ఇష్టపడ్డారు. పండితుల ఆధిపత్యాన్ని, నిర్దేశిత వ్యాకరణాలను, పురాణ ఇతివృత్తాలను తిరస్కరించడం వారి విధానంగా మారింది. దీనికి భిన్నంగా, వలసపూర్వ ఆధునికత గతంతో పూర్తిగా తెగతెంపులు చేసుకోవడాన్ని తన లక్షణంగా భావించదు. గతం ప్రాముఖ్యతను కూడా అది తిరస్కరించదు. సంప్రదాయాన్ని కొనసాగిస్తూనే, సున్నితత్వంలో, అనుభూతిలో, సాహిత్యాన్ని పాఠకులు స్వీకరించే విధానంలో మార్పును తీసుకువస్తుంది. కన్యాశుల్కం ప్రారంభ వలసకాలపు తెలుగు సమాజానికి ఒక చిత్రాన్ని అందిస్తుంది. ఆ సమాజం తనలో మిగిలిపోయిన పాత ప్రపంచంతోనూ, కొత్తగా రూపుదిద్దుకుంటున్న ప్రపంచంతోనూ నిరంతరం పరస్పర సంబంధం కలిగి ఉంది. నాటకం పాత సామాజిక ఆధిపత్య వర్గాలను పక్కకు నెడుతుంది. ముఖ్యంగా బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులతో కూడిన సంప్రదాయ నాలుగు వర్ణాల సామాజిక వ్యవస్థకు బదులుగా, వ్యక్తివాద దృక్పథం కలిగిన కొత్త ఉన్నతవర్గం ఏర్పడుతున్న దృశ్యాన్ని చూపిస్తుంది. హోదా, లింగ సంబంధాలపై కూడా ఈ కొత్త వర్గానికి భిన్నమైన అవగాహన ఉంది. సాహిత్యానికి ఆశ్రయదాతలుగా మారిన ఈ కొత్త వర్గం, వారి వెంట ఉన్న వేశ్యలతో కలిసి కవిత్వ రంగంలో ప్రముఖ పాత్ర పోషించింది. ఈ కాలపు సాహిత్యం 'ఆధునిక స్వయం'గా పిలవదగిన కొత్త వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించడం ప్రారంభించింది. వలస ఆధునికతకు ఆకర్షితమైన కొత్త మధ్యతరగతి తన సమీప గతాన్ని మర్చిపోయిన ఒక సాంస్కృతిక విస్మృతికి గురైనట్లు అప్పారావు నాటకం సూచిస్తుంది. ఈ ప్రక్రియలో సంప్రదాయాన్ని తక్కువగా చూడడం మొదలైంది. భారతీయ సమాజం స్తబ్ధంగా, క్షీణించిన స్థితిలో ఉందని, భారతీయులు మూఢనమ్మకాలు, అనైతికతలో కూరుకుపోయినవారని, మానవ విలువల పట్ల సున్నితత్వం లేనివారని, మార్పును స్వీకరించే సామర్థ్యం లేనివారని వలస దృష్టికోణం ప్రతిబింబించింది. కొత్త మధ్యతరగతి ఈ చిత్రణను స్వీకరించింది. అయితే గురజాడ వ్యంగ్య సంభాషణలను సృజనాత్మకంగా ఉపయోగించడం ద్వారా ఒక భిన్నమైన అవగాహనను కలిగిస్తారు. సమాజం తన సమస్యలను తానే ఎదుర్కోగలదు. తన తప్పులను తానే సరిదిద్దుకోగలదు. ఎన్నో అంశాలతో మేళవించి, సమకాలీన సామాజిక రుగ్మతలపై కొరడా ఝుళిపించిన 'కన్యాశుల్కం' అప్పుడే కాదు... నేటికీ పఠనీయమే. ఎన్నటికీ నిత్యనూతనమే.

# భవిష్యత్తును ఊహించిన దార్శనికుడు వెల్స్


నేడు జయంతి

ఇరవయ్యో శతాబ్దం ప్రారంభ దశలో అత్యంత విస్తృతంగా రచనలు చేసిన, ప్రజాదరణ పొందిన, బహుముఖ రచయితల్లో హెచ్‌జి వెల్స్ (1866–1946) ముందు వరుసలో ఉంటాడు. ఆయన రచనలు సైన్స్ ఫిక్షన్ నుంచి సామ్యవాద సిద్ధాంతాల వరకు, ఎడ్వర్డియన్ వ్యంగ్యం నుంచి ప్రపంచ చరిత్ర వరకు, చిన్నకథల నుంచి ఆదర్శ సమాజాలను ఊహించిన నవలల వరకు అనేక ప్రక్రియలను దాటాయి. తన కాలంలోని ప్రజల ఊహాశక్తిపైనా, సాహిత్య విమర్శపైనా ఆయనకు గణనీయమైన ప్రభావం ఉండేది. అనేక బెస్ట్ సెల్లర్స్‌ను వెలువరించిన విల్‌ఫ్రెడ్ వర్జీనియా ఊల్ఫ్ 1924లో రాసిన 'మిస్టర్ బెన్నెట్ అండ్ మిసెస్ బ్రౌన్' వ్యాసంలో వెల్స్ రచనలపై తీవ్రంగా స్పందించారు. డొరోథీ రిచర్డ్‌సన్, రెబెక్కా వెస్ట్, జార్జ్ బెర్నార్డ్ షా, హెన్రీ జేమ్స్ వంటి ఆధునికవాద రచయితలతో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉండేవి. కొన్ని సందర్భాల్లో అవి విచ్ఛిన్నమయ్యేవి. విభిన్న సాహిత్య ప్రక్రియలు, కాలాల మధ్య సంచరించిన వెల్స్‌ను ఒకే కోణంలో నిర్వచించడం కష్టం. 1866 సెప్టెంబర్ 21న ఇంగ్లండ్‌లోని కెంట్‌లో, దిగువ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన హెర్బర్ట్ జార్జ్ వెల్స్ బాల్యం పుస్తకాలతో సన్నిహితంగానే గడిచినప్పటికీ, అంత సంతోషకరంగా ఏమీ సాగలేదు. కొంతకాలం థామస్ మార్లీ కమర్షియల్ అకాడమీలో చదివాడు. తండ్రి కాలు విరగడంతో 1881లో చదువు మానేసి బట్టల దుకాణంలో శిష్యుడిగా పనిచేయాల్సి వచ్చింది. అక్కడ అనుభవించిన కఠినమైన పని, దారిద్ర్యం, అవమానకరమైన పరిస్థితులు తరువాత ఆయన రాసిన 'కిప్స్', 'ది వీల్స్ ఆఫ్ ఛాన్స్' నవలలకు కథా వస్తువులయ్యాయి. కొంతకాలం ఉపాధ్యాయుడిగా పనిచేసిన తరువాత వెల్స్ నార్మల్ స్కూల్ ఆఫ్ సైన్స్లో చేరి టిహెచ్ హక్స్లీ వద్ద జీవశాస్త్రాన్ని అభ్యసించాడు. అదే సమయంలో రాజకీయ తత్వశాస్త్రాన్ని విస్తృతంగా చదివాడు. చదువు పూర్తికాక ముందే ఆ సంస్థను విడిచి, జీవనోపాధి కోసం బోధకుడిగా పనిచేశారు. 1891లో తన బంధువు ఇసబెల్ మేరీ వెల్స్‌ను వివాహం చేసుకున్నాడు. కానీ, ఆ బంధం నాలుగేళ్లకే ముగిసింది. 1895లో మాజీ విద్యార్థిని అమీ కేథరిన్ రాబిన్స్‌ను వివాహం చేసుకుని ఇద్దరు కుమారులకు తండ్రయ్యాడు. వివాహ బంధంలో ఉన్నప్పటికీ మార్గరెట్ సింగర్, అంబర్ రీవ్స్, రెబెక్కా వెస్ట్, డొరోథీ రిచర్డ్సన్ తదితరులతో ఆయనకు సంబంధాలు కొనసాగాయి. రిచర్డ్‌సన్ తన నవల 'ది టన్నెల్' (1919)లోని అహంకారపూరిత, ఆధిపత్య స్వభావం కలిగిన హైపో జి. వెల్స్ పాత్రకు ఆయనను నమూనాగా ఉపయోగించాడు. సామ్యవాద భావాల పట్ల ఆకర్షితుడైన వెల్స్ ఫేబియన్ సొసైటీలో చేరాడు. జార్జ్ బెర్నార్డ్ షా వంటి ప్రముఖులు ఉన్న ఈ సంస్థ హేతుబద్ధత, క్రమంగా జరిగే సామాజిక మార్పును సమర్థించేది. అయితే సంస్థ వ్యూహాలను మరింత విప్లవాత్మకంగా మార్చాలని వెల్స్ ప్రయత్నించడంతో విభేదాలు ఏర్పడ్డాయి. పురుషాధిపత్య ఏకపత్నీవివాహ కుటుంబాన్ని వ్యక్తిగత ఆస్తి వ్యవస్థగా పరిగణిస్తూ దాన్ని తిరస్కరించే తీర్మానానికి మద్దతు ఇవ్వాలని ఆయన కోరాడు. వివాహేతర సంబంధాలపై ఆయనపై ఉన్న ప్రచారాన్ని ఆధారంగా చేసుకుని సంప్రదాయవాదులు, కొందరు సామ్యవాదులు ఆయనను స్వేచ్ఛా ప్రేమకు ప్రతినిధిగా విమర్శించారు. దీనితో, ఫేబియన్ సొసైటీపై ఆధిపత్యం సాధించాలన్న వెల్స్ ప్రయత్నాలు చివరకు విఫలమయ్యాయి. 1895లో వెల్స్ వరుసగా చిన్నకథలను ప్రచురించడం ప్రారంభించాడు. అదే ఆయన అత్యంత సృజనాత్మక రచనా దశకు నాంది పలికింది. 1895 నుంచి 1901 మధ్య 'ది టైమ్ మెషీన్', 'ది వార్ ఆఫ్ ది వరల్డ్స్' వంటి సైన్స్ ఫిక్షన్ నవలలు రాశాడు. ఈ ప్రక్రియకు పునాది వేసిన రచయితల్లో ఆయనను ముఖ్యుడిగా పరిగణిస్తారు. 'యాంటిసిపేషన్స్'లో భవిష్యత్ నాగరికతను ఊహించిన ఆయన, 'అవుట్‌లైన్ ఆఫ్ హిస్టరీ'లో ప్రపంచ చరిత్రను సమగ్రంగా వివరించాడు. 'ది హోలీ టెరర్'లో ఫాసిజం, దాని ఆకర్షణీయ నాయకుల ఎదుగుదలను పరిశీలిస్తాడు. ఆయన సైన్స్ ఫిక్షన్ రచనలు కందకాల యుద్ధం, వైమానిక బాంబుదాడులు, విషవాయువు, అణుబాంబు, ప్రపంచ యుద్ధం వంటి ఇరవయ్యో శతాబ్దపు భయానక పరిణామాలను ముందుగానే ఊహించినట్లుగా కనిపిస్తాయి. మొదటి ప్రపంచ యుద్ధానికి ప్రారంభంలో ఆయన ఉత్సాహంగా మద్దతు ఇచ్చి, యుద్ధాన్ని అంతం చేసే యుద్ధం అనే ఆశావహ భావనతో వ్యాసాలు రాశాడు. తరువాత ఆ శీర్షికే కఠినమైన వ్యంగ్యానికి ప్రతీకగా మారింది. వెల్స్ ఒక ప్రముఖ ప్రజా మేధావిగా కూడా ఎదిగాడు. యూజెనిక్స్, ప్రపంచ రాజ్యం వంటి అంశాలపై ఆయన విస్తృతంగా రాశాడు. 1920ల నాటికి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందాడు. అయితే ఆయన కల్పిత రచనల ప్రాముఖ్యతను ఈ ప్రజా మేధావి పాత్ర కొన్నిసార్లు కప్పివేస్తుంది. 'లవ్ అండ్ మిస్టర్ లెవిషమ్'లో లైంగికతను బహిరంగంగా చర్చించిన ఆయన, 'బూన్'లో హెన్రీ జేమ్స్ శైలిని వ్యంగ్యంగా అనుకరించాడు. 'ది వార్ ఆఫ్ ది వరల్డ్స్'లో వలసవాదాన్ని, 'టోనోబంగే'లో ఆధునిక ప్రకటనల ప్రభావాన్ని పరిశీలించాడు. వెల్స్‌ను వస్తువుల నిర్మాణంపైనే ఆసక్తి చూపిన ఎడ్వర్డియన్ రచయితగా వర్జీనియా ఊల్ఫ్ విమర్శించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించాలి. అయితే ఆయన రచనల్లోని ప్రక్రియల కలయిక, శాస్త్రీయ ఆలోచనలను సాహిత్యంలోకి తీసుకురావడం, భవిష్యత్తును ముందుగానే ఊహించే స్వరం వంటి లక్షణాలు ఆధునికవాద సాహిత్యానికి ముఖ్యమైన లక్షణాలుగా కనిపిస్తాయి. ఎడ్వర్డియన్ రచయితగానే కాకుండా, ఆధునికవాదానికి ముందుమాట పలికిన రచయితగా, ప్రజా మేధావిగా, ఫిక్షన్ రచయితగా వెల్స్ స్పష్టమైన వర్గీకరణలకు అందని వ్యక్తి. రాజకీయ నాయకుడికంటే భవిష్యద్రష్టగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచాన్ని మార్చబోయే సామాజిక పరిణామాలను ఆయన తన రచనల్లో ముందుగానే ఊహించినట్లు కనిపిస్తుంది.

**– సత్యశ్రీ**

ఈ వారం కవితలు

## జ్ఞాపకాల బాల్యం

పారుతున్న నదీజలంలో పిల్లలు కేరింతలు
కొడుతుంటే నవ్వుతూ పరుగులుతీస్తుంది సాగరగామిని.
చిన్నచిన్న అలలన్నీ పిల్లల ఎదనుతాకుతూ...
కల్మషంలేని కమ్మని కబుర్లను వింటూ...
ఆనందంతో ఎగిసిపడుతున్నాయి.

చెట్టుపుట్టలు... వాగువంకల ....చుట్టూ
రంకెలేసుకుంటూ తిరుగుతుంటే..
సీతాకోకచిలుకలు రంగురంగుల
రెక్కలపై ఎక్కించుకొని ఆకాశమంత
విశ్వాన్ని పరిచయం చేసేవి.
చిటారుకొమ్మన తేనెతుట్టలు.. ఎంత కమ్మని
పుష్పరసమో..మా తియ్యని స్నేహంలాగా.
మామిడితోటలో మధురఫలములు..
ఎంతతియ్యని రుచులో..మా స్నేహామృతంలాగా.

గుండెలన్నీ ఒక్కదగ్గర విశాలమైన మైదానంలా పరిచి
పొద్దుపొడిచి...పొద్దుగూకే వరకు
తీరొక్కఆటలతో తీరికలేని రోజులు.
ఎక్కడో పేదగుడిసెలో పుట్టిన స్నేహితులంతా
రెక్కలుతొడిగిన పక్షుల్లా వాలిపోయేవాళ్ళం.
ఒక్కోమామిడి ఆకును గుమ్మానికి తోరణంలా కట్టినట్లు
తిమిరంలో తారలు వెలుగులు కురిపించినట్లు..
రోజంతా వేడుకలా కబుర్లతో కాలక్షేపం అయ్యేది.



చిన్ననాటి రోజులన్నీ చెదిరిపోని జ్ఞాపకం
ఎప్పటికి వాడిపోని తరిగిపోని బంగారు బాల్యం.
ఇపుడు మళ్ళీ రావాలి అలాంటి పాతరోజులు.
చేతికి చిక్కని పాదరసంలా..
చెల్లాచెదురుగా వెళ్లిపోయిన వలస పక్షుల్లా..
కనుమరుగవుతున్న బాల్యం మళ్ళీరావాలి.
మోడుబారిన వృక్షం మళ్ళీపచ్చగా చిగురించినట్లు..
గూడుచేరిన పక్షుల్లా అందరూ కలవాలి.
సెల్ ఫోన్ జైలునుండి ..ఆన్‌లైన్ గేమ్స్ సంకెళ్లను
తెంపుకొని..మళ్ళీ కల్మషంలేని మనస్సులన్ని
పెనవేసుకోవాలి.

**అశోక్ గోనె, 9441317361**

## పిలుపులు

ప్రకృతి పిలుస్తుంది..
పచ్చని చిగురుల పరవశంతో,
పూల పరిమళాల పలకరింపుతో,
చినుకుల చిలిపి సవ్వడితో
రమ్మంటుంది తన ఒడిలోకి!
ప్రేయసి పిలుస్తుంది...
పెదవులపై పూసిన చిరునవ్వుతో,
కళ్లలో దాచుకున్న ప్రేమతో,
మనసులో మోగే మౌనరాగంతో
రమ్మంటుంది తన హృదయంలోకి!

పున్నమి వెన్నెల పిలుస్తుంది...
వెండితెర పరిచిన నిశీధిలో,
నక్షత్రాల నాట్యాన్ని వీక్షించమని,
చంద్రుని చల్లని కాంతిలో
మనసుకు మధురమైన మౌనం నేర్పమని!
పల్లె పిలుస్తుంది...
మట్టివాసన మమతను మోసుకొస్తూ,
పంటచేల పచ్చదనం పలకరిస్తూ,
పొద్దుపొడుపున కోడి కూతతో
పాత జ్ఞాపకాల దారిలో నడిపించమని!

పట్నం పిలుస్తుంది...
వెలుగుల వలలో కలలను బంధించి,
వేగపు పరుగుల్లో కాలాన్ని తరిమేస్తూ,
అవకాశాల ఆకాశాన్ని అరచేతిలో చూపించి,
అడుగడుగునా ఆరాటంతో ఎదగమని!
పూదోట పిలుస్తుంది...రంగురంగుల రేకులు విప్పి,
తేనెటీగల తీయని గానంతో మురవమని,
పరిమళాల వంతెన వేసి
పరవశించి పరిమళించమని!

పుస్తకం పిలుస్తుంది..
చదవని లోకాల తలుపులు తెరవమని,
చరిత్రలోని మహనీయులను తలచమని,
జ్ఞానజ్యోతిని గుండెలో వెలిగించి
చీకట్లను తరిమేయమని!
పెన్ను పిలుస్తుంది...
మనసులోని మౌనాన్ని పలికించమని,
మదిలో మెదిలే భావాలకు రూపమివ్వమని,
కన్నీటిని అక్షరాలుగా మార్చి
కాగితంపై కవితగా కురిపించమని!
పిలుపులు ఎన్ని వినిపించినా...
అన్నీ ఒకే బాటను చూపిస్తాయి;
ప్రకృతి నుంచి ప్రేమ వరకు,
అక్షరం నుంచి అనుభవం వరకు
జీవితాన్ని ఆస్వాదించమని!

**గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్**

## భావన

అభిప్రాయాలు, ఊహలు, ఊసులు
ఆలోచనల తలంపుల గుత్తులు
మనసు సంకల్పాల గమ్మత్తులు
మదిలో రూపుదిద్దుకున్న భావనా రూపం
మహిలో రూపుదాల్చే నిజరూపం!

బహు భావనల భావుకులం
బహు వర్ణనల కవి కలం
బహు సృజనాత్మకతల కవి కులం
బహు విధముల ఉన్నతీకరించే గళం!

భావానికి భావుకత
భావోద్వేగాల రూప వ్యక్తత
భావనానుభవాల స్పందన
భావాభిరుచుల భావనల ప్రతిస్పందన!

భావాల మధురిమ
మనసును రంజింపజేయు
మెరుపు వెనుక ఉరుము ఉరిమి
కురిపించు వర్షపు జల్లులు
చిరునవ్వు వెనుక దాగిన భావనలు
చిలుకును హర్షపు జల్లులు!

**– పట్లోళ్ల బక్కారెడ్డి 9705315250**

# కరోనా కంటే ప్రమాదకరమైనది క్యాన్సర్

## జ్యోతి సంస్మరణ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



**ప్రజాపక్షం/అమరచింత:** కరోనా కంటే ప్రమాదకరమైనది క్యాన్సర్ వ్యాధి అని ఈ వ్యాధి వల్ల అనేక మంది మృతి చెందుతున్నా ప్రభుత్వాలు ఈ వ్యాధిని నివారించేందుకు ఏ మాత్రం కృషి చేయడం లేదని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివ రావు విచారం వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలోని శ్రీ కృష్ణ నగర్ లో ఆదివారం కామ్రేడ్ జ్యోతి సంస్మరణ సభ సిపిఐ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సంస్మరణ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావుతో పాటు ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రొఫెసర్ ఖాసిం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల నరసింహా, సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయు లు, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మ ణ్, అడ్వకేట్ జనార్ధన్‌లు హాజరై నివాళులర్పించారు. సభలో సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ విజయ రాములు కుటుంబానికి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈ సభలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ జ్యోతి మరణం కమ్యూనిస్టు పార్టీకి, విజయరాములు కుటుంబానికి తీరని లోటు అని ఆవేదన చెందారు. ప్రజా సమస్యలపై, కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి విజయరాములు మనోధైర్యంతో ముందుకు సాగి ఉద్యమాలను నడిపించాలని సాంబశివరావు సూచించారు. ఎమ్మెల్సీ గోరిట వెంకన్న మాట్లాడుతూ ప్రపంచాన్ని మార్చగలిగేది ఒక్క కమ్యూనిజంకే సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కారం చేయడానికి కమ్యూనిస్టుల పాత్ర కీలకంగా ఉంటుందని గోరటి వెంకన్న పేర్కొన్నారు. జ్యోతి ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రతి కుటుంబంలో అనేక సమస్యలు ఉంటాయని, అదేవిధంగా కమ్యూనిస్టుల కుటుంబాలలో కూడా సమస్యలు తప్పకుండా ఉంటాయని ప్రొఫెసర్ ఖాసిం తెలిపారు. కుటుంబాలలో ఎన్ని బాధలు ఉన్నా విజయరాములు సతీమణి జ్యోతి తన భర్త వెంటే ఉంటూ ప్రజా ఉద్యమాలలో, కమ్యూనిస్టు పార్టీ కోసం పాటుపడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. విజయరాములు కుటుంబంలో సభ్యులందరూ గుండె ధైర్యంతో ఉండి వాళ్లు నమ్ముకున్న సిద్ధాంతాన్ని విడిచిపెట్టకుండా ప్రజా ఉద్యమాలను ఇంకా ఉధృతం చేయాలని ఆయన కోరారు. జ్యోతి సంస్కరణ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాల నరసింహ, సైకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మ ణ్, సీనియర్ అడ్వకేట్ బి.జనార్ధన్ ఇంకా పలువురు వ్యక్తులు ప్రసంగించారు. ఈ సభకు వివిధ జిల్లాల నుంచి సిపిఐ నాయకులు కార్యకర్తలు,మండల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు.

# పార్టీ ఫిరాయింపులపై చట్టంలోని లోపాలు సరిచేయాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజకీయ పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలోని లోపాలను సరిచేయాలని జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలో ఉన్న లోపాలను సరిచేయకుండా వదిలేయడం వల్ల దేశంలో అసహ్యకరమైన, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే పరిణామాలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే పార్టీ ఫిరాయింపులను అడ్డుకునే విధంగా చట్టాన్ని కఠినతరం చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఎన్నికల్లో ఏ అభ్యర్థి ఏ పార్టీ తరపున పోటీ చేశారో ఎన్నికల కమిషన్ వద్ద స్పష్టమైన రికార్డు ఉందని, ఎన్నికైన తర్వాత పార్టీ మారి, ప్రజల తీర్పునకు విరుద్ధంగా వ్యవహరిస్తే, ఫిరాయింపు నిర్ధారణ అయిన వెంటనే పదవి రద్దయ్యే విధంగా చట్టాన్ని ఎందుకు మార్చకూడదని ఆయన ప్రశ్నించారు. ఈ దుస్థితికి జాతీయ స్థాయిలో గతంలో పరిపాలించిన కాంగ్రెస్, ప్రస్తుతం అధికారంలో ఉన్న బిజెపి కూడా బాధ్యత వహించాల్సిందేనన్నా రు. గతంలో కాంగ్రెస్ తప్పు చేసి ఉంటే, ప్రస్తుతం అధికారంలో ఉన్న బిజెపి ఆ లోపాలను సరిచేసే అవకాశం ఉందని, మరి బిజెపి ఎందుకు సరిచేయడం లేదని ఆయన ప్రశ్నించారు. ప్రజల తీర్పును, ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కే ఫిరాయింపులను సమర్థించే రాజకీయ నాయకులను చరిత్ర క్షమిస్తుందా? అని ఆయన ప్రశ్నించారు.

# ఫాంహౌస్‌ల కోసమే తెలంగాణ తెచ్చుకున్నామా?

## బిఆర్ఎస్ పాలనలో భూముల చుట్టూనే దోపిడీ సాగింది: చనగాని ధ్వజం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫాంహౌస్‌లు, భూముల కోసం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామా అనే సందేహం కలుగుతోందని టిపిసిసి జనరల్ సెక్రటరీ, సీనియర్ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. గాంధీభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'కాళోజీ నారాయణరావు చెప్పిన పరాయి పాలన ముగిసిందని మురిసిపోకు.. మన వాళ్ల దోపిడీ ఇంకా ఘోరంగా ఉంటుంది' అనే మాటలను ప్రస్తావిస్తూ.. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో భూములు, కబ్జాల చుట్టూనే పాలన సాగిందని దయాకర్ విమర్శించారు. కెసిఆర్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని ఉల్లంఘించారని, కెటిఆర్, హరీష్‌రావు, సంతోష్‌రావు, కవిత తదితరులు అక్రమ భూముల విషయంలో పోటీ పడ్డారని విమర్శించారు. మాజీ ప్రధాని పివి నరసింహారావు ల్యాండ్ సీలింగ్ చట్టం అమలులో భాగంగా వందల ఎకరాల భూమిని ప్రభుత్వానికి ఇచ్చారని గుర్తుచేశారు. జన్వాడ ఫాంహౌస్ లీజుకు తీసుకున్నదే అయితే అక్కడ డ్రోన్ ఎగురవేసినప్పుడు కేసులు ఎందుకు నమోదు చేశారో కెటిఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భూముల విషయంలో జరిగిన వ్యవహారాలపై కూడా వివరణ ఇవ్వాల ని కోరారు. 22ఎ జాబితాలో నిషేధిత భూములతోపాటు బిఆర్ఎస్ నేతలకు సంబంధించిన అక్రమ భూములు, ప్రభుత్వ భూములు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చనగాని దయాకర్ తెలిపారు.

# అప్రకటిత కోతలతో అల్లాడుతున్న జనం

## గుట్టు బయటపడుతుందనే లాగ్ బుక్ మాయం

## మోటకొండూరు సబ్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన మాజీ మంత్రి హరీశ్ రావు



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విధిస్తున్న అప్రకటిత విద్యుత్ కోతలతో రైతులు తీవ్రంగా అల్లాడుతున్నారని, కరెంట్ కోతల వాస్తవాలు బయటపడతాయనే భయంతోనే మోటకొండూరు సబ్ స్టేషన్‌లో లాగ్ బుక్‌ను అధికారులు మాయం చేశారని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు ఆరోపించారు. ప్రభుత్వం నిజంగానే 24 గంటల కరెంట్ ఇస్తుంటే లాగ్ బుక్ చూపించడానికి ఎందుకు భయపడుతోందని నిలదీశారు. ఆదివారం మోటకొండూర్ సబ్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ 'రైతుల కోరిక మేరకే సబ్ స్టేషన్‌లో ఎన్ని గంటల కరెంట్ ఇస్తున్నారో చూడడానికి వచ్చాం. కానీ మేము వస్తున్నామని తెలిసే అధికారులతో లాగ్ బుక్ మాయం చేయించారు. మోటకొండూర్ రైతులకు రోజుకు 6–7 గంటల కరెంట్ కూడా రాక పంటలు ఎండిపోతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డిలు సబ్ స్టేషన్ల వద్దకు వచ్చి వాస్తవాలు చూసి రైతులకు సమాధానం చెప్పాలి అని డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ నాయకుల ఇండ్లు ఎఫ్‌టిఎల్‌లోనే ఉన్నాయి..**

ప్రభుత్వ విప్ మహేందర్ రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సిఎం సోదరుడితో పాటు కాంగ్రెస్ సీనియర్ నేత కెవిపి రామచంద్ర రావు ఇండ్లు ఎఫ్టీఎల్, శిఖం భూముల్లోనే ఉన్నాయని, ధైర్యముంటే ముందు వాటిని కూలగొట్టాలని హరీశ్ రావు సవాల్ విసిరారు. అజీజ్ నగర్ భూములను 12 ఏళ్ల క్రితమే ఐటి రిటర్న్స్‌లో, ఎలక్షన్ అఫిడవిట్లలో స్పష్టంగా చూపించామని తెలిపారు. 22ఎ నిషేధిత భూముల జాబితా, భూకుంభకోణాలను బిఆర్ఎస్ బయటపెడుతోందనే కక్షతోనే తమపై బురదజల్లే రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

**అది ఎల్‌నినో కరువు కాదు..కాంగ్రెస్ తెచ్చిన కరువే!**

రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్నది ఎల్‌నినో తెచ్చిన కరువు కాదని, ముమ్మాటికీ కాంగ్రెస్ అసమర్థత వల్ల వచ్చిన కరువేనని హరీశ్ రావు ఆరోపించారు. నీళ్లు ఉండి ఎత్తలేని, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉండి ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, అవ్వలకు రూ.4,000 పెన్షన్, మహిళలకు రూ.2,500 ఇచ్చేదాకా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ప్రజల పక్షాన బిఆర్ఎస్ పోరాటాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఆయన వెంట మాజీ శాసన సభ్యులు గొంగిడి సునీత మహేందర్రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

# తెలంగాణలో బూత్ స్థాయి సమన్వయానికి జాతీయ స్థాయిలో గుర్తింపు

## కులగణన ఉద్యమానికి 100 రోజుల క్యాంపెయిన్..

## రుద్ర సంతోష్ కుమార్‌కు కీలక బాధ్యత

**ప్రజాపక్షం/హైదరాబాద్:**తెలంగాణలో కులగణనను క్షేత్రస్థాయి నుంచి బూత్ స్థాయివరకు తీసుకెళ్లిన వార్ రూమ్ వ్యూహం ఇప్పుడు ఢిల్లీకి చేరింది. రాష్ట్రంలో కులగణన కార్యక్రమం కోసం వార్ రూమ్, కాల్ సెంటర్, డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థలను సమన్వయం చేసిన రుద్ర సంతోష్ కుమార్‌కు జాతీయ స్థాయిలో కీలక బాధ్యత లు అప్పగించినట్లు ఎఐసిసి వర్గాలు తెలిపాయి. జాతీయ జనగణనలో కులగణన అంశంపై దేశవ్యాప్తంగా చేపట్టనున్న 100 రోజుల క్యాంపెయిన్‌కు ఎఐసిసి వార్ రూమ్ కోఆర్డినేటర్‌గా ఆయనను నియమించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు ఎఐసిసి నుంచి నియామకపత్రం జారీ అయినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి.కులగణనపై అవగాహన కార్యక్రమాలు, రాష్ట్రాల వారీ కార్యాచరణ, శిక్షణ, సంస్థాగత సమన్వయం, డిజిటల్ మానిటరింగ్, వారపు పురోగతి నివేదికలు వంటి అంశాలను సమన్వయం చేసే లా జాతీయ వార్ రూమ్‌ను రూపొందించనున్నట్లు సమాచారం.

**తెలంగాణ మోడల్‌కు జాతీయ గుర్తింపు**

2024–25లో తెలంగాణలో కులగణన కార్యక్రమం సందర్భంగా రుద్ర సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక వార్ రూమ్, కాల్ సెంటర్ వ్యవస్థను ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయి సమన్వయం చేపట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థ ద్వారా పార్టీ కార్యకర్తలు, మండల అధ్యక్షులు, బ్లాక్, గ్రామ, బూత్ స్థాయి ప్రతినిధులతో నిరంతరం సమన్వయం నిర్వహించినట్లు పేర్కొన్నాయి. సుమారు 45 రోజులపాటు సాగిన ఈ ప్రక్రియలో రోజుకు 2,000 మందికి పైగా కార్యకర్తలు, సంస్థాగత ప్రతినిధులతో సంప్రదింపులు జరిపినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎఐసిసి నేషనల్ కోఆర్డినేటర్ కొప్పుల రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎఐసిసి ఒబిసి జాతీయ చైర్మన్ అనిల్ జైహింద్ యాదవ్, ఎఐసిసి మైనారిటీ జాతీయ చైర్మన్ ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి, వివిధ రాష్ట్రాల ఒబిసి, మైనారిటీ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నీటి కుంటలో మునిగి అక్కా చెల్లెళ్ళు మృతి





**ప్రజాపక్షం/ములుగు:** మండలంలోని ఖాసీందెవి పేట గ్రామంలో అక్కాచెల్లెళ్లు నీటికుంటలో మునిగి మృతి చెందడంతో విషాద ఛాయలు అలుముకున్నా యి. గ్రామంలోని మహమ్మద్ అంజద్ పాషా కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం పత్తి చేనులో పురుగుల మందు చల్లడానికి వెళ్ళారు. సాయంత్రం సమ యంలో ఇద్దరు కుమార్తెలు సమ్మాన్ (19), ఆసియా (10) సరదాగా సమీపంలోని నీటికుంట దగ్గరికి వెళ్ళి ప్రమాద వశాత్తు జారిపడ్డారు. కొద్ది సేపటి తరువాత పిల్లలిద్దరు కనపడకపోవడంతో చుట్టుపక్కల వెతికి కుంట దగ్గరికి వెళ్లేసరికి అక్కచెల్లెళ్లు ఇద్దరు మునుగుతూ కనిపించగా వెంటనే బయటకు తీసి కాపడడానికి ప్రయత్నించిన ఫలితం లేకపోయింది. కంటి ముందే ఇద్దరు కూతుళ్ళు చనిపోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు ఆకాశన్నంటాయి.


# THE ANDHRA BANK EMPLOYEES' CO-OPERATIVE BANK LTD.

REGD. & CENTRAL OFFICE, MITHILA COMPLEX, KOTHI, HYDERABAD

THE THIRD SCHEDULE (SECTION 29) OF BANKING REGULATION ACT, 1949

*Financial Year 2025 - 2026*

## BALANCE SHEET AS ON 31ST MARCH, 2026

| Sl.No. | CAPITAL AND LIABILITIES | Schedule | As at 31.03.2026 | As at 31.03.2025 |
|---|---|---|---|---|
| 1 | SHARE CAPITAL | 1 | 39,99,09,670.00 | 35,44,81,240.00 |
| 2 | RESERVE FUND AND OTHER RESERVES | 2 | 28,79,55,121.33 | 27,93,21,065.80 |
| 3 | DEPOSITS AND OTHERS ACCOUNTS | 3 | 3,00,08,28,182.89 | 2,62,98,29,034.19 |
| 4 | BORROWINGS | 4 | 0.00 | 0.00 |
| 5 | BILLS FOR COLLECTION BEING BILLS RECEIVABLE (As per Contra) | | 0.00 | 0.00 |
| 6 | BRANCH ADJUSTMENTS | | 0.00 | 0.00 |
| 7 | OVERDUE INTEREST RESERVE (As Per Contra) | | 0.00 | 0.00 |
| 8 | INTEREST PAYABLE | | 24,62,971.00 | 28,58,463.00 |
| 9 | OVERDUE INT ON NPAS' | | 22,63,268.00 | 21,43,489.00 |
| 10 | OTHER LIABILITIES | 5 | 61,53,42,908.08 | 73,61,523.80 |
| 11 | PROFIT & LOSS ACCOUNT | | 5,63,58,402.14 | 4,46,30,046.82 |
| | **TOTAL** | | **3,75,59,31,044.44** | **3,32,06,24,862.61** |
| | **CONTINGENT LIABILITIES** | | | |
| | DEAF (CONTRA) | | 1,07,17,228.06 | 1,10,94,306.16 |
| | Estimated interest liability on Matured Deposits | | 36,880.00 | 36,880.00 |

| Sl.No. | PROPERTY AND ASSETS | Schedule | As at 31.03.2026 | As at 31.03.2025 |
|---|---|---|---|---|
| 1 | CASH | 6 | 7,81,72,234.33 | 2,89,37,944.91 |
| 2 | BALANCES WITH OTHER BANKS | 7 | 19,80,85,341.12 | 18,41,97,551.41 |
| 3 | MONEY AT CALL & SHORT NOTICE | | 0.00 | 0.00 |
| 4 | INVESTMENTS | 8 | 59,47,99,873.00 | 59,53,27,878.00 |
| 5 | ADVANCES | 9 | 2,86,68,09,852.17 | 2,49,33,62,887.75 |
| 6 | INTEREST RECEIVABLE | | | |
| | a) on Investments & Staff Housing Loans | 10 | 1,12,83,551.00 | 1,13,04,548.00 |
| | b) on Advances (As per contra) | | 28,85,407.00 | 24,24,991.00 |
| 7 | BILLS RECEIVABLE | | 0.00 | 0.00 |
| | BEING BILLS RECEIVABLE (As per Contra) | | 0.00 | 0.00 |
| 8 | PREMISES | 11 | 1,99,640.90 | 2,15,828.00 |
| 9 | FURNITURE | 12 | 3,54,312.54 | 2,09,324.47 |
| 10 | OTHER FIXED ASSETS | 13 | 1,88,856.57 | 3,58,505.63 |
| 11 | OTHER ASSETS | 14 | 31,51,975.81 | 42,85,403.44 |
| | **TOTAL** | | **3,75,59,31,044.44** | **3,32,06,24,862.61** |

*For THE ANDHRA BANK EMPLOYEES' CO-OPERATIVE BANK LIMITED*

(SAMAD KHAN) CHAIRMAN; (S.MURALIDHAR) VICE-CHAIRMAN; (N.SURESH) DIRECTOR; (M. KRISHNA KISHORE) DIRECTOR; (A. VIVEKANANDA REDDY) DIRECTOR; (CHAWAN CHANDRA SHEKAR) DIRECTOR; (RAMJI PACHIPALA) DIRECTOR

(K. VIJAYA KUMAR) DIRECTOR; (SRINIVASA RAO .K) DIRECTOR; (CHANDRA MOHAN) DIRECTOR; (V.SUPRIYA SHARA) DIRECTOR; (P.VIJAYA BHASKAR) DIRECTOR; (V. VENKATESWARA RAO) CHIEF EXECUTIVE OFFICER

As Per Our Report Of Even Date
For **M/S. P. VISWANADH & ASSOCIATES**
Chartered Accountants
Firm's Regn. No. 005603S
**Sd/- (P. VISWANADH)**
Proprietor
Membership No. 028786

**P. VISWANADH & ASSOCIATES**
CHARTERED ACCOUNTANTS
6-2-975, Flat # 111, Block - A,
Kushal Towers, Khairatabad,
Hyderabad - 500 004.
Phone : 040-2332 6118
E-mail : pvaca_hyd@yahoo.co.in

**INDEPENDENT AUDITOR'S REPORT**

**To**
**The Members of**
**Andhra Bank Employees' Co-operative Bank Limited**

**Report on the Audit of the Financial Statements**

**Opinion**

We have Audited the Financial Statements of The Andhra Bank Employees' Co-operative Bank Limited as at 31stMarch 2026, which comprise the Balance Sheet as at 31st March 2026, the Statement of Profit and Loss and the Statement of Cash Flows for the year then ended, and Notes to the Financial Statements, including a summary of Significant Accounting Policies and other explanatory information in which are included Returns of Head Office and 3 Branches which are consolidated in these Financial Statements. The Branches Audited by us have been selected in accordance with the guidelines issued to the Bank by RBI.
In our opinion and to the best of our information and according to the explanations given to us, the aforesaid Financial Statements together with Notes thereon give the information required by the Banking Regulation Act,1949 and the rules made thereunder, the guidelines issued by the Reserve Bank of India and the Registrar of Cooperative Societies under the Co-operative Societies Act, 1912 in the manner so required and give a true and fair view in conformity with the accounting principles generally accepted in India.
In the case of the Balance Sheet, state of affairs of the Bank read with the notes thereon as at 31st March, 2026.
In the case of Profit and Loss Account, read with the notes thereon for the year ended on that date.

**Basis for Opinion**

We conducted our Audit in accordance with the Standards on Auditing (SAs) issued by Institute of Chartered Accountants of India (ICAI). Our responsibilities under those Standards are further described in the Auditor's Responsibilities for the Audit of the Financial Statements section of our Report. We are independent of the Bank in accordance with the Code of Ethics issued by the ICAI together with ethical requirements that are relevant to our Audit of the Financial Statements under the provisions of the Banking Regulations Act, 1949 and the Rules made thereunder and we have fulfilled our other ethical responsibilities in accordance with these requirements and the Code of Ethics. We believe that the audit evidence we have obtained is sufficient and appropriate to provide a basis for our opinion.

**Information Other than the Financial Statements and Auditor's Report thereon**

The Bank's Board of Directors is responsible for the preparation of other information. The other information comprises the information included in the Board of Directors Report including other explanatory information, but does not include Financial Statements and our Auditor's Report thereon. The Report of the Board of Directors is expected to be made available to us after the date of this Auditor's Report. Our opinion on the Financial Statements does not cover the other information and we do not express any form of assurance conclusion thereon. In connection with our Audit of the Financial Statements, our responsibility is to read the other information [illegible]

**Responsibilities of Management and those charged with governance for the Financial Statements**

[illegible]

free from material misstatement, whether due to fraud or error.
In preparing the Financial Statements, management is responsible for assessing the Bank's ability to continue as a going concern, disclosing, as applicable, matters related to going concern basis of accounting unless management either intends to liquidate the Bank or to cease operations, or has no realistic alternative but to do so.
The Boards of Directors are responsible for overseeing the Bank's Financial Reporting process.

**Auditor's Responsibilities for the Audit of the Financial Statements**

Our objectives are to obtain reasonable assurance about whether the Financial Statements as a whole are free from material misstatement, whether due to fraud or error, and to issue an Auditor's Report that includes our opinion. Reasonable assurance is a high level of assurance, but is not a guarantee that an Audit conducted in accordance with SAs will always detect a material misstatement when it exists. Misstatements can arise from fraud or error and are considered material if, individually or in the aggregate, they could reasonably be expected to influence the economic decisions of users taken on the basis of these Financial Statements.
As part of an Audit in accordance with SAs, we exercise professional judgment and maintain professional skepticism throughout the audit. We also:

- Identify and assess the risks of material misstatement of the financial statements, whether due to fraud or error, design and perform audit procedures responsive to those risks, and obtain audit evidence that is sufficient and appropriate to provide a basis for our opinion. The risk of not detecting a material misstatement resulting from fraud is higher than for one resulting from error, as fraud may involve collusion, forgery, intentional omissions, misrepresentations, or the override of internal control.
- Obtain an understanding of internal control relevant to the Audit in order to design audit procedures that are appropriate in the circumstances, but not for the purpose of expressing an opinion on the effectiveness of the Bank's internal control.
- Evaluate the appropriateness of accounting policies used and the reasonableness of accounting estimates and related disclosures made by management.
- Conclude on the appropriateness of management's use of the going concern basis of accounting and, based on the audit evidence obtained, whether a material uncertainty exists related to events or conditions that may cast significant doubt on the Bank's ability to continue as a going concern. If we conclude that a material uncertainty exists, we are required to draw attention in our auditor's report to the related disclosures in the financial statements or, if such disclosures are inadequate, to modify our opinion. Our conclusions are based on the audit evidence obtained up to the date of our Auditor's Report. However, future events or conditions may cause the Corporation to cease to continue as a going concern.
- Evaluate the overall presentation, structure and content of the financial statements, including the disclosures, and whether the financial statements represent the underlying transactions and events in a manner that achieves fair presentation.

We communicate with those charged with governance regarding, among other matters, the planned scope and timing of the audit and significant audit findings, including any significant deficiencies in internal control that we identify during our audit.
We also provide those charged with governance with a statement that we have complied with relevant ethical requirements regarding independence and to communicate with them all relationships and other matters that may reasonably be thought to bear on our independence and where applicable, related safeguards.

**Report on Other Legal and Regulatory Requirements**

We have obtained all the information and explanations, which to the best of our knowledge and belief were necessary for the purpose of our Audit and have found to be satisfactory; In our opinion, proper books of account as required by law have been kept by the [illegible]

For M/s. P. Viswanadh & Associates,
Chartered Accountants
Firm's Regn. No. 005603S

P. Viwanadh
Proprietor
Membership No. 028786
UDIN: 26028786LFMUGH6907

Place: Hyderabad
Date: 03/05/2026

THE ANDHRA BANK EMPLOYEES' CO-OPERATIVE BANK LTD.

PROFIT AND LOSS ACCOUNT FOR THE YEAR ENDED 31st MARCH, 2026

AS PER BANKING REGULATION ACT, 1949

**EXPENDITURE**

| Sl. No. | Particulars | Year ended on 31.03.2026 | Year ended on 31.03.2025 |
|---|---|---|---|
| 1 | INTERST ON DEPOSITS | 20,70,04,986.93 | 18,02,44,422.71 |
| 2 | INTEREST ON BORROWINGS | 0.00 | 0.00 |
| 3 | SALARIES, ALLOWANCES | 2,01,76,368.94 | 1,92,02,166.42 |
| 4 | DIRECTORS & LOCAL COMMITTEE MEMBERS FEES | 6,49,156.00 | 7,38,845.00 |
| 5 | RENT, TAXES INSURANCE & LIGHTING ETC. | 86,67,697.85 | 83,77,404.64 |
| 6 | LAW CHARGES | 0.00 | 5,00,000.00 |
| 7 | POSTAGE, TELEGRAMS & TELEPHONE | 90,609.74 | 72,516.17 |
| 8 | AUDITORS FEES | 7,12,776.00 | 5,74,630.00 |
| 9 | DEPRECIATION ON FIXED ASSETS | 11,48,487.86 | 11,37,112.49 |
| 10 | REPAIRS TO BANKING PROPERTY | 58,195.00 | 48,132.00 |
| 11 | STATIONARY, PRINTING | 1,68,823.20 | 1,33,733.46 |
| 12 | ADVERTISEMENT | 1,72,360.00 | 2,12,045.00 |
| 13 | PREMIUM ON SECURITIES AMORTISED | 5,28,005.00 | 5,28,014.00 |
| 14 | OTHER EXPENDITURE | 23,82,971.05 | 16,23,799.83 |
| 15 | RESERVE FOR NON PERFORMING ASSETS | 0.00 | 69,222.00 |
| 16 | PROVISION FOR P.L. ENCASHMENT | | 14,00,000.00 |
| 17 | PROVISION FOR SICK LEAVE | 3,50,000.00 | 3,50,000.00 |
| 18 | PROVISION FOR DEFERRED TAX LIABILITY | | 0.00 |
| 19 | PROVISION FOR INCOME TAX ON PROFIT | 1,96,38,556.00 | 2,28,42,304.00 |
| 20 | PROVISION FOR DEPRECIATION ON SECURITIES | | 0.00 |
| | NET PROFIT | 5,63,58,402.14 | 4,46,30,046.82 |
| | | **31,81,07,395.71** | **28,26,84,394.54** |

**INCOME**

| Sl. No. | Particulars | Year ended on 31.03.2026 | Year ended on 31.03.2025 |
|---|---|---|---|
| 1 | INTEREST ON ADVANCES | 25,92,45,936.63 | 23,28,87,116.30 |
| 2 | INCOME FROM INVESTMENTS | 4,75,07,475.00 | 4,70,33,266.00 |
| 3 | COMMISSION, EXCHANGE | 170.52 | 1,845.00 |
| 4 | OTHER RECEIPTS | 30,41,485.27 | 27,55,233.08 |
| 5 | PROVISION FOR DEFERRED TAX LIABIITY WRITTEN BACK | 12,328.29 | 6,934.16 |
| 6 | RESERVE FOR NON PERFORMING ASSETS WRITTEN BACK | 0.00 | 0.00 |
| 7 | PROVISION FOR P.L.ENCASHMENT WRITTEN BACK | 63,00,000.00 | 0.00 |
| 8 | PROVISION FOR DEPRECIATION ON SECURITIES WRITTEN BACK | 20,00,000.00 | |
| | | **31,81,07,395.71** | **28,26,84,394.54** |

(SAMAD KHAN) CHAIRMAN; (S.MURALIDHAR) VICE-CHAIRMAN; (N.SURESH) DIRECTOR
(M. KRISHNA KISHORE) DIRECTOR; (A. VIVEKANANDA REDDY) DIRECTOR
(CHAWAN CHANDRA SHEKAR) DIRECTOR; (RAMJI PACHIPALA) DIRECTOR; (K. VIJAYA KUMAR) DIRECTOR
(SRINIVASA RAO .K) DIRECTOR; (CHANDRA MOHAN) DIRECTOR; (V.SUPRIYA SHARA) DIRECTOR
(P.VIJAYA BHASKAR) DIRECTOR; (V. VENKATESWARA RAO) CHIEF EXECUTIVE OFFICER

As Per Our Report Of Even Date
For **M/S. P. VISWANADH & ASSOCIATES**
Chartered Accountants
Firm's Regn. No. 005603S
**Sd/- (P. VISWANADH)**
Proprietor
Membership No. 028786

# సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- మదనాపూర్ మండలంలో ఊకచెట్టు వాగు హై లెవెల్ బ్రిడ్జి ప్రారంభించిన మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకిటి శ్రీహరి
- మదనాపూర్, కౌకుంట్ల, మూసాపేట మండలాల్లో సమీకృత మండలం కార్యాలయ సముదాయాల నిర్మాణానికి రూ.49 కోట్లు మంజూరు చేస్తామని మంత్రి ప్రకటన



**ప్రజాపక్షం/వనపర్తి :** మదనాపూర్ మండలంలోని ఊక చెట్టువాగుపై నిర్మించిన హైలెవల్ బ్రిడ్జిని ఆదివారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి సహచర మంత్రి, రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం మదనాపురం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పబ్లిక్ మీటింగ్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి నాయకత్వంలో దేవరకద్ర నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణంతో పాటు, డిగ్రీ కళాశాల, కురుమూర్తి దేవస్థానానికి రహదారి, వంతెనలు ఊకచెట్టువాగుపై హైలెవల్ బ్రిడ్జి తదితర అభివృద్ధి పనులు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. గత పాలకులు ఊకచెట్టు వాగు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభించి మధ్యలో వదిలేస్తే, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అడిగిన వెంటనే పెండింగ్ పనుల కోసం రూ.6 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అదే విధంగా ఎమ్మెల్యే కోరిన వెంటనే దేవరకద్ర నియోజకవర్గంలోని మదనాపూర్, కౌకుంట్ల, మూసాపేట మండలాల్లో మండల కార్యాలయ సముదాయాల నిర్మాణానికి మొత్తం రూ.49 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో మండల కార్యాలయ సముదాయానికి సుమారు రూ.16.30 కోట్ల చొప్పున నిధుల కేటాయించినట్లు పేర్కొన్నారు. మండల స్థాయి కార్యాలయాలకు వచ్చే ప్రజలు, రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా ఆధునిక భవనాలను నిర్మించనున్నట్లు తెలిపారు. అధికారులు, సిబ్బందికి మెరుగైన పని వాతావరణంతో పాటు ప్రజలకు తాగునీరు, మరుగుదొడ్లు తదితర ప్రాథమిక సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు.అందుకే రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, పుస్తకాలు యూనిఫాంలు తదితర సదుపాయాలు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల కోసం కాస్మెటిక్ చార్జీలను 40 శాతం పెంచినట్లు తెలిపారు. చదువుతో పాటువిద్యార్థులకు ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. స్వయం సహాయక మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం సమృద్ధి సాధించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. కోటిమంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకుని పేద ప్రజలు సొంతింటి కలను సాకారం చేసుకోవడం ఆనందంగా ఉందని మంత్రి తెలిపారు. ప్రతి అర్హత కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ఊకచెట్టువాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి గతంలో కృషి చేసినట్లు తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణం విషయంలో గత ప్రభుత్వం కాలక్షేపం చేసిందని విమర్శించారు. గతంలో ఈబ్రిడ్జి లేకపోవడం కారణంగా నలుగురు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తవడంతో వర్షాకాలంలో ప్రజలకు ఎదురయ్యే రాకపోకల ఇబ్బందులు తొలగిపోయాయని చెప్పారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడి 1,000 రోజులు అవుతుందని, ఈ వెయ్యి రోజుల్లో దేవరకద్ర నియోజకవర్గానికి సుమారు రూ. 1,034 కోట్ల నిధులు తీసుకువచ్చి వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కొన్ని పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని, కొత్త పనులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని చెప్పారు. మదనాపూర్ మండలంలోని ఉక చెట్టు వాగుపై బ్రిడ్జి లేకపోవడం కారణంగా గతంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఆ సమయంలో తాను ధర్నా చేసినట్లు గుర్తు చేసుకున్నారు. తదనంతరం గత ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించినప్పటికీ మధ్యలోనే వదిలేసిందని విమర్శించారు. అనంతరం తమ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రిని కోరిన వెంటనే పెండింగ్ పనులకు రూ.6 కోట్లు మంజూరు చేశారని ఇప్పుడు ఈ బ్రిడ్జిను పూర్తి చేసుకుని ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. నియోజకవర్గంలో క్రీడా రంగ అభివృద్ధికి మినీ స్టేడియం నిర్మాణానికి రూ.10 కోట్లు, కొత్తకోటలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.2.50 కోట్లు మంజూరు చేసిన మంత్రి వాకిటి శ్రీహరికి ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్‌కుమార్, ఏఆర్ అదనపు ఎస్‌పి వీరారెడ్డి, ఆర్‌డిఒ సుబ్రహ్మణ్యం, మదనాపురం స్థానిక సర్పంచు శారదా, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, రోడ్లుభవనాల శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డిఎస్‌పి, కమిషనర్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



**ప్రజాపక్షం/కల్వకుర్తి:** వినాయక నిమజ్జనానికి కల్వకుర్తి పట్టణ సమీపంలోని ఈదుల చెరువులో ఏర్పాటు చేసిన ఏర్పాట్లను ఆదివారం డిఎస్‌పి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ షేక్, ఎస్‌ఐ కురుమూర్తిలు పరిశీలించారు. నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, పారిశుద్ధ్య ఏర్పాట్లు ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను వారు పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో మాజీ సర్పంచు ఆనంద్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ షాన్‌వాజ్ ఖాన్, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సతీష్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వసతులు

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో చేపడుతున్న సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలంగాణ పబ్లిక్ స్కూల్లో నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వసతులు ఉంటాయని పెద్దకొత్తపల్లి మార్కెట్ చైర్మన్ దండు నరసింహా అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దకొత్తపల్లి మండల్ ప్రభుత్వ పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా మార్చడంతో మార్కెట్ చైర్మన్ దండు నరసింహ, కాంగ్రెస్ మండల్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దండు నరసింహ మాట్లాడుతూ ప్రస్తుతం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలో చదవడానికి పేద,మధ్య తరగతి కుటుంబాలకు భారీ ఖర్చు చేయవలసి వస్తుందని ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక వసులతో అభివృద్ధి చేసి కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావడం ఎంతో సంతోషకరమైన విషయం అన్నారు. మండలంతో పాటు వివిధ దూరప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యా తెలంగాణ పబ్లిక్ స్కూల్లో లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి వెంకటేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు దండు చంద్రయ్య, శివశంకర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## మక్తల్ మండల నూతన ప్రెస్ క్లబ్ (ప్రింట్ మీడియా) ఏకగ్రీవ ఎన్నిక...



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ మండలం నూతన ప్రెస్ క్లబ్ (ప్రింట్ మీడియా) కమిటీని ఆదివారం సీనియర్ జర్నలిస్టులు, సలహాదారులు అంజన్ ప్రసాద్ (దిశ), దేవసూగూరు సురేందర్ (ఆంధ్రజ్యోతి), మద్వార్ బాల్ రాజు (సాక్షి) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో ప్రెస్‌క్లబ్ (ప్రింట్ మీడియా) అధ్యక్షుడిగా మామిళ్ల పృథ్వీరాజ్ (సత్యవార్త పత్రిక), ప్రధాన కార్యదర్శిగా రాజు పెయింటర్ (తెలుగుప్రభ), గౌరవ అధ్యక్షుడిగా ఎల్లారెడ్డి (వెలుగు), ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా సురేష్ గౌడ్ (మన తెలంగాణ), రఘు (వార్త) కోశాధికారిగా గోవింద్ (సూర్య), కార్యదర్శులుగా ప్రదీప్ (జనం సాక్షి), సి.సురేష్, (ప్రజాపక్షం) కర్నె బాల్‌రాజు (నవ తెలంగాణ), హరిక్రిష్ణ (విజన్ ఆంధ్ర) ఎగ్జిక్యూటివ్ కమిటీ ఇసి సభ్యుడిగా నూర్ పాషా (నినాదం) కార్తీక్ (ప్రజాదర్బార్) వెంకట్‌రెడ్డి (ప్రజా లక్ష్యం) లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు నూతన కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన ఐక్యత కోసం నూతన కమిటీ కృషి చేయాలనిఈ సందర్భంగా వక్తలు ఆకాంక్షించారు. ఎన్నికైన అనంతరం ఎన్నికైన అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జర్నలిస్టుల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

## అనుచిత పోస్టులు చేస్తే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/నారాయణపేట :** గణేష్ పండుగ, తాఖీ బాబా దర్గా ఉర్సు వేడుకలను ప్రశాంత వాతావరణంలో, సోదరభావంతో నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టిందని జిల్లా ఎస్‌పి డాక్టర్ వినీత్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మత విశ్వాసాలు, కులాలు, వర్గాలు, మతపెద్దలు, ఇతర సముదాయాలను కించపరిచేలా లేదా రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు, కామెంట్లు, వీడియోలు, ఫోటోలు, మార్ఫింగ్ చిత్రాలను ప్రచారం చేయడం, షేర్ చేయడం, ఫార్వర్డ్ చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సోషల్ మీడియాపై పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని తెలిపారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే ఉద్దేశంతో తప్పుడు సమాచారం, పాత వీడియోలు, వదంతులు, అభ్యంతకర కంటెంట్‌ను వైరల్ చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిజనిజాలు నిర్ధారించుకోకుండా ఎలాంటి వార్తలు, వీడియోలు, ఆడియోలను సోషల్ మీడియాలో ప్రచారం చేయవద్దని ప్రజలకు సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాను ఉపయోగించే వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి డాక్టర్ వినీత్ హెచ్చరించారు.

## భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలి

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** అమెరికా ఆధిపత్య యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా షాహిద్ భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలనిప పివైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ , పిఒడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మీ , పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 22 నుంచి 28వ తేదీ వరకు భగత్‌సింగ్ జయంతి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని పిడిఎస్‌యు, పివైఎల్, పిఒడబ్ల్యు సంఘాల నాయకులు నిర్ణయించారు. నారాయణపేట్ జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో పిడిఎస్‌యు, పివైఎల్, పిఒడబ్ల్యు సంఘాల ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం అంతర్జాతీయ పరిణామాలు, సామ్రాజ్యవాద ఆధిపత్య ధోరణులు, యుద్ధాల వల్ల సామాన్య ప్రజలపై పడుతున్న ప్రభావం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఆధిపత్యం కోసం కొనసాగుతున్న యుద్ధోన్మాద ధోరణులకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తులు ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. యుద్ధాల వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రపంచ శాంతి కోసం ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని అన్నారు. విద్యార్థులు, యువత, మహిళలు ప్రజా సమస్యలపై చైతన్యవంతులైన ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు వెంకటేష్, జిల్లా కార్యదర్శి, మహేష్, పివైఎల్ అధ్యక్షుడు ప్రతాప్, జిల్లా కార్యదర్శి సిద్దు, ఉపాధ్యక్షులు అంజి, జిల్లా నాయకులు కృష్ణ, శ్రీహరి, పృధ్వీరాజ్ , పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.




## అసంపూర్తి ప్రాజెక్టులకు బిఆర్‌ఎస్‌దే బాధ్యత

కెటిఆర్‌కు వాస్తవాలు మాట్లాడే ధైర్యం ఉందా? : ఎమ్మెల్యే వంశీకృష్ణ





**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** గత బిఆర్‌ఎస్ పాలనలో ప్రాజెక్టులను ఏళ్ల తరబడి పెండింగులో పెట్టి అసంపూర్తిగా వదిలేశారని డిసిసి అధ్యక్షుడు అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ విమర్శించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా వదిలేసిన నాయకులు ఇప్పుడు అభివృద్ధిపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కెటిఆర్ శనివారం చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని పేర్కొంటూ, గతంలో ప్రాజెక్టుల పరిస్థితి, ప్రస్తుతం కొనసాగుతున్న పనులపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు, అనుమతులు, పెండింగ్ సమస్యలపై ప్రభుత్వం అధికారికంగా వివరాలు వెల్లడిస్తోందని తెలిపారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ విమర్శలు చేయడం కాకుండా, గత పాలనలో ప్రాజెక్టుల పనులు ఎందుకు పూర్తి చేయలేకపోయారో కెటిఆర్ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. గత పాలనలో అసంపూర్తిగా మిగిలిన ప్రాజెక్టులకు బాధ్యత ఎవరిది? ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా రాజకీయ విమర్శలు చేయడం ఎందుకు? అని ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రశ్నించారు. మీడియా సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సునేంద్ర కుమార్, జిల్లా ఎస్‌పి సెల్ అధ్యక్షుడు నిరంజన్, మార్కెట్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### బిసి గురుకుల పాఠశాలలో ఎమ్మెల్యే తనిఖీ

నాగర్‌కర్నూల్ పట్టణంలోని శ్రీపురం రోడ్డులో ఉన్న మహాత్మా జ్యోతి బాపూలే బిసి గురుకుల బాలుర పాఠశాల, కళాశాలను డిసిసి అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గురుకులాన్ని సందర్శించిన ఆయన విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యత, భద్రతాప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమ ని ఎమ్మెల్యే తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అందుబాటులో ఉంటూ వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## బసవేశ్వర స్వామి పల్లకి సేవా



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట్ పట్టణం సరాప్ బజార్‌లో కొలువైన శ్రీ వీరభద్ర సమేత బసవేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రావణమాస ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బుస్సయ్యస్వామి ఆధ్వర్యంలో అర్చకులు మడపతి మంజునాథ, స్వామి, మణి స్వామిల ఆలయంలో మూలవిరాట్ లకు పవిత్ర గంగాజలంతో అభిషేకం నిర్వహించారు అల్లు అర్చన, పుష్పలంకరణ, మహా మంగళహారతి నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం బసవేశ్వరుడు, వీరభద్ర స్వామి ఉత్సవ విగ్రహాలతో పట్టణ పురవీధులగుండా లింగయ్యగుడి వరకు పల్లకీసేవ కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాలింగం, ముర్లపల్లి జగదీష్, సంగన్ బసప్ప, సిద్ధి లింగయ్య స్వామి, ఆకుల రాజేష్ కుమార్, జాజాపూర్ రవికుమార్, జాజాపూర్ మణికంఠ, పవిత్ర, సునీత, శైలు, మధు, పార్వతి, మహిళలు, వీరశైవ సమాజం సభ్యులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకుని పూజించి పర్యావరణాన్ని కాపాడాలి

**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** వచ్చే ఏడాది అందరూ మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడాలని గద్వాల ఎమ్మెల్యే పండ్ల కృష్ణ మోహన్ రెడ్డి తెలిపారు. గద్వాల పట్టణంలోని 28వ వార్డు శేరల్లీవీధి బీకే ఎంఆర్‌టీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని ఆదివారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇలాగే అంగరంగ వైభవంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. పూర్వ వైభోగం తీసుకొచ్చే విధంగా కృషి చేయాలని సంస్కృతి సాంప్రదాయాలను గౌరవించి అందరూ కలిసికట్టుగా వేడుకలు జరుపుకోవాలని కోరారు. వచ్చే ఏడాది ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను ప్రతిష్టించి పర్యావరణాన్ని కాపాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిసిసి అధ్యక్షులు రాజీవ్‌రెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, సీడ్ ఆర్గనైజర్లు బండ్ల రాజశేఖర్‌రెడ్డి, సత్యారెడ్డి, మాజీ ఎంపిపి విజయ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్ , మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, కౌన్సిలర్స్ చంద్రశేఖర్, గోవిందు, మాజీ కౌన్సిలర్ తుమ్మల నరసింహులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఓటమి నుంచి పాఠాలు... 2029 వైపు చూపు

గద్వాలలో పుంజుకుంటున్న సరిత తిరుపతయ్య వర్గం



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల :** గద్వాల జిల్లా రాజకీయాల్లో మాజీ జెడ్‌పిచైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య పేరు మరోసారి హట్ టాపిక్‌గా మారింది. 2023 అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత కొంతకాలం ఆచితూచి వ్యవహరించిన ఆమె, ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి పొందిన కీలక పదవితో మళ్లీ ఉపందుకున్నారు. రాబోయే 2029 ఎన్నికలే లక్ష్యంతో తన సొంత వర్గాన్ని బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. గద్వాల రాజకీయ నేపథ్యం కాంగ్రెస్‌లో చేరిక 2019 నుండి 2024 వరకు గద్వాల జెడ్‌పి చైర్‌పర్సన్‌గా పనిచేసిన సరిత తిరుతపయ్య, అప్పట్లో బిఆర్‌ఎస్ పార్టీలో కీలక నాయకురాలిగా గుర్తింపు పొందారు. అయితే స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వర్గానికి, ఆమె వర్గానికి మధ్య సాగిన ఆధిపత్య పోరు జిల్లా రాజకీయాలో నిరంతరం చర్చనీయాంశంగా ఉండేది. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆమె బిఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి, పెద్ద ఎత్తున కౌన్సిలర్లు, ఎంపిటిసిలు, సర్పంచులతో కలిసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా గద్వాల బరిలో నిలిచినప్పటికీ, బిఆర్‌ఎస్ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతిలో 7,036 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఎన్నికల ఫలితాలు బిసి ఓట్ల సమీకరణం 2023 ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే పలు ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. బిసి నినాదం ప్రభావం కురువ సామాజికవర్గానికి సరితకు మద్దతు లభించిన ప్పటిక, ఆ ఓట్లు పూర్తిగా ఏకతాటిపైకి రాకపోవడం ఓటమికి ఒక కారణమైంది. పోటీలో ఉన్న ఎఐఎఫ్‌బి అభ్యర్థి గొంగల రంజితకు 13,454 ఓట్లు రావడంతో, గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఓట్లు చీలిపోయాయి. ఓటమి తర్వాత మారిన సమీకరణాలు ఎన్నికల అనంతరం గద్వాలలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోయాయి. సరిత వెంట కాంగ్రెస్‌లోకి వచ్చిన అనేకమంది ప్రజాప్రతినిధులు తిరిగి తమ పాత శిబిరాల వైపు అడుగులు వేశారు. కొన్ని సందర్భాల్లో పార్టీ టికెట్లు ఇప్పించుకోవడంలో కూడా ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోవడంతో, సరిత వర్గం బలహీనపడిందనే అభిప్రాయం వ్యక్తమైంది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం సరిత తిరుపతయ్యకు తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు అప్పగించడంతో ఆమె రాజకీయ సమీకరణాల్లో మళ్లీ ప్రాధాన్యత సంతరించుకున్నారు. ఈ పదవి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గొర్రెల పెంపకందారులు, యాదవ, కురువ సామాజిక వర్గాలతో నేరుగా సంబంధాలు ఏర్పడే అవకాశం లభించిందని ఆమె అనుచరులు భావిస్తున్నారు. 2029 ఎన్నికల్లో సరిత తిరుపతయ్యను ఖచ్చితంగా అసెంబ్లీకి పంపుతాం అని ఆమె వర్గం ధీమా వ్యక్తం చేస్తోంది. బిసి నినాదంతో ముందుకు సాగుతున్న సరిత తిరుపతయ్య తనకు లభించిన కొత్త పదవిని ఆసరాగా చేసుకుని గద్వాలలో తన ముద్రను ఎలా చాటుకుంటారు? గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని 2029లో మళ్లీ పూర్వ వైభవాన్ని సాధించగలరా? అనేది రానున్న రోజుల రాజకీయ పరిణామాలే నిర్ణయించనున్నాయి.



## పత్తికి క్వింటల్ రూ.15000, వరికి రూ.3,500 ఇవ్వాలి

అఖిలభారత ఐక్య రైతు సంఘం ఎఐయుకెఎస్ డిమాండ్

**ప్రజాపక్షం/మక్తల్ :** అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఐబి మక్తల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు భగవంతు కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షులు డి.చంద్రశేకర్ టియుసిఐ జిల్లా అధ్యక్షులు భగవంతు కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షులు డి.చంద్రశేఖర్ టియుసిఐ జిల్లా అధ్యక్షులు కిరణ్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వేసినటువంటి పత్తి పంట ఏరి అమ్మడం జరుగుతుందని వరి పంట కోతకు రావడం జరుగుతుంది కానీ పత్తి మార్కెట్ కాటన్ మిల్లుకు తీసుకపోతే మధ్య దళారులు క్వింటాల్ పత్తికి రూ.9600 ధర నిర్ణయిస్తారు. కాని రైతులకు ఏకరానికి రూ.30 వేలు ఖర్చు అయితుందని కాబట్టి క్వింటాలుకు పత్తికి రూ.15 వేలు సిసిఐ ద్వారా కొనుగోలు చేయాలని, క్వింటాల్ వరికి రూ.3500 ఐకెపి పిఎసిఎస్ సెంటర్‌లో ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం డివిజన్ కార్యదర్శి ఆనందదు టియుసి ఐ జిల్లా ఉపాధ్యక్షులు భుట్టో రైతు సంఘం ఏరియా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రాజు వెంకటేష్ మల్లేష్ గోపాల్ నర్సింహా రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మంటపాలు సందర్శించిన మాజీ మంత్రి



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పట్టణంలో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి సందర్శించి, విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, స్వయంగా భక్తులకు వడ్డించారు. ఈ సందర్భంగా గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు. భక్తి శ్రద్ధలతో గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్న మండపాల నిర్వాహకులను అభినందించారు.

## కృష్ణ మండల పిఆర్‌టియు నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



**ప్రజాపక్షం/కృష్ణ :** కృష్ణ మండల పిఆర్‌టియు నూతన కార్యవర్గాన్ని సంఘం నాయకులు జనార్ధన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సురేందర్, తిరుమల రావు, ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా దండు శేఖర్, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ పెన్షన్ విధానం అమలు చేయాలని సిపిస్ రద్దు చేసి పాత పెన్షన్ కొనసాగించాలని పెండింగ్ బిల్లును తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని తెలిపారు.

## ఉచిత క్యాన్సర్ పరీక్షలు

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని కల్వకోల్ గ్రామంలో సింధు క్యాన్సర్ హాస్పిటల్ సౌజన్యంతో గ్రామ సర్పంచు బంత్రోత్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. డాక్టర్ అనూష (గైనకాలజిస్ట్) డాక్టర్ ఆదిత్య (జనరల్ ఫిజీషియన్) దాదాపు 200 మందికి రక్తపరీక్షలు, ఇసిజి, క్యాన్సర్ పరీక్షలు చేశారని గ్రామ సర్పంచు శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సర్పంచు చట్టముని వెంకటస్వామి, టిఆర్‌ఎస్ పార్టీ యువ నాయకులు ప్రదీప్ శెట్టి, సింగిల్ విండో వైస్ చైర్మన్ రాము యాదవ్, రిటైర్మెంట్ ప్రధాన ఉపాధ్యాయులు ధర్మారెడ్డి, బిజెపి నాయకులు, అమ్మపల్లి మల్లేష్, పుట్ట ఈశ్వరయ్య, నూనె వెంకటేశ్, డీలర్ శ్యాము, గువ్వలి బొడ్డు నరసింహ, గుర్రాల బిచ్చన్న, మౌలాలి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.





## ఆర్9 ఎత్తిపోతల పథకం పైపులైన్ నిర్మాణ పనులు ముమ్మరం

**ప్రజాపక్షం/నడిగూడెం:** మునగాల, నడిగూడెం మండలాల పరిధిలో సాగర్ ఎడమకాలువపై నిర్మించిన ఆర్9 ఎత్తిపోతల పథకం నడిగూడెం మండలంలోని రామాపురం, ఈకెపేట, ఈకెపేట తండా, తెల్లబెల్లి గ్రామాలలో, మునగాల మండలంలోని బరాఖత్‌గూడెం, కృష్ణానగర్, కోదండరామాపురం, ముకుందాపురం, ఆకుపాముల గ్రామాలకు చెందిన 4500 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా నేటికి పూర్తిస్థాయిలో నీరు అందని పరిస్థితి ఉన్నది. ఆయకట్టు రైతులు ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఆశ్రయించడంతో ప్రత్యేక పైపులైన్ కోసం 28 కోట్లు మంజూరు చేశారు. పైపులైన్ నిర్మాణం కోసం సహకరించిన భూమికి పరిహారం రైతులకు అందజేశారు. నిధులు మంజూరు కావడంతో ప్రత్యేక పైపులైన్ పనులు మెగా ఇంజనీరింగ్ వర్క్స్ వారు నెల రోజులుగా ముమ్మరంగా సాగుతున్నాయి. పైపులు సరిపడా డంపింగ్ చేసి, తుక్కు రాకుండా కోటింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పనులు పూర్తయితే నిర్దేశించిన 4500 ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతాయని రైతులు తెలిపారు.

## ప్రపంచ శాంతి కోసం ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలి

ఎఐపిఎస్ఓ జిల్లా అధ్యక్షులు తొగటి మురళి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రపంచ శాంతి కోసం ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపిఎస్ఓ) జిల్లా అధ్యక్షులు తొగటి మురళి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఏఐపిఎస్ఓ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా యుద్ధ వాతావరణం, హింస, సామ్రాజ్యవాద దాడులు పెరుగుతున్న నేపథ్యంలో శాంతి, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రజలు ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. యుద్ధాల వల్ల ముఖ్యంగా మహిళలు, చిన్నారులు, పేదలు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రపంచ శాంతి, ఆయుధ పోటీకి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏఐపిఎస్ఓ నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అక్టోబర్ 3న జరిగే జిల్లా మహాసభలకు శాంతి, ప్రజాస్వామ్యాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా గౌరవ అధ్యక్షులు బొమ్మగాని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు అనంతుల మల్లేశ్వరి, చామల అశోక్ కుమార్, బూర వెంకటేశ్వర్లు, గుగులోతు రాజారాం, ఖమ్మంపాటి రాము, పోలోజు రామాచారి, బాణాల రాము, గాలి రామకృష్ణ పాల్గొన్నారు.

## భక్తులకు ఇబ్బందులు రావొద్దు

వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్ భాస్కర్ రావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** భువనగిరి పట్టణంలోని భువనగిరి చెరువును జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు ఆదివారం పరిశీలించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిమజ్జన ప్రాంతంలో భద్రతా చర్యలు, పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీరు, బారికేడింగ్ తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించా రు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గణేష్ శోభాయాత్రలో విషాదం

గుండెపోటుతో యువకుడి మృతి

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్:** మండల కేంద్రంలో శనివారం రాత్రి నిర్వహించిన గణేష్ శోభాయాత్రలో విషాద ఘటన జరిగింది. మండల కేంద్రానికి చెందిన సింగారపు బాలయ్య(రాము) శోభాయాత్రలో నృత్యం చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు.వెంటనే కుటుంబ సభ్యులు, స్నేహితులు చికిత్స నిమిత్తం హాలియాలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా,అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలయ్య అన్నయ్య కూడా ఏడాది క్రితం ఓ శుభకార్యంలో భోజనం చేస్తుండగా ఆహారం గొంతులో ఇరుక్కుని ఊపిరాడక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.తాజాగా బాలయ్య మృతితో ఒకే కుటుంబంలో వరుస విషాదాలు చోటుచేసుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.మృతునికి భార్య,కుమారుడు,కుమార్తె ఉన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

శోభాయాత్రలో గుండెపోటుతో మృతి చెందిన సింగారపు బాలయ్య విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ పగడాల పున్నమ్మ సైదులు యాదవ్ అంత్యక్రియల ఖర్చు నిమిత్తం కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. తిరుమలగిరి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మృతుడు బాలయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా ,సభ్యుడు నర్సింగ్ వెంకటేశం పార్థివ దేహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.



# అసత్య ప్రచారాలు మానుకోండి

22-ఏ భూములపై చర్చకు బిఆర్ఎస్ సిద్ధపడాలి

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** 22ఏ నిషేధిత భూముల అంశంపై శాసనసభలో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, బిఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారాలు మానుకొని చర్చకు సిద్ధంగా కావాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి హితవు పలికారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్తోందన్నారు. నిషేధిత జాబితాలో ఉన్న భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఇబ్బందులు లేకుండా పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ అంశంపై శాసనసభలో చర్చ జరిగితే గత ప్రభుత్వ హయాంలో జరిగిన వ్యవహారాలు వెలుగులోకి వస్తాయనే ఉద్దేశంతోనే బిఆర్ఎస్ నాయకులు చర్చకు దూరంగా ఉంటున్నారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ శాసనసభకు హాజరై ప్రజా సమస్యలపై చర్చించాలని కోరారు. ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సమస్యలను శాసనసభలో ప్రస్తావించాల్సిన బాధ్యత ఉందన్నారు. కెసిఆర్ కుటుంబానికి సంబంధించిన భూముల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రస్తావించిన అంశాలపై విచారణ జరుపాలని కోరారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లోని భూములపై సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వ భూములు ఉంటే వాటిని గుర్తించి అర్హులైన పేదలకు అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మాజీ మంత్రి జగదీష్ రెడ్డి కుటుంబానికి సంబంధించిన భూములు, ఆస్తులపై కూడా సమగ్ర విచారణ జరుపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రజా సమస్యలు, భూముల అంశాలపై వాస్తవాలను ప్రజ ల ముందుంచేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందన్నారు. సూర్యాపేటలో నిర్వహించిన జాతర మేళాకు సుమారు 40వేల మంది హాజరయ్యారని, ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాలు విజయవంతమయ్యాయని తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, సర్పంచ్ భూక్యా రాజు నాయక్, నాయకులు జ్యోతి కరుణాకర్, పిల్లల రమేష్ నాయుడు, వల్దాస్ దేవేందర్, పాలగాని కృష్ణ, తండు శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 6 వేల వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు

అన్ని ఏర్పాట్లు చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులకు ఆదేశం



**ప్రజాపక్షం/నల్లగొండ:** వినాయక ఉత్సవాలలో భాగంగా ఈ సంవత్సరం నల్గొండ జిల్లా వ్యాప్తంగా సుమారు 6 వేల విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉందని, అందువల్ల నిమజ్జన కేంద్రాలలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.ఆదివారం ఆయన వినాయక నిమజ్జన ఏర్పాట్లపై జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ తో కలిసి రెవెన్యూ, పోలీస్,ఆర్‌డిఓలు, మండల ప్రత్యేక అధికారులు,ఎంపిడీవోలు, తహసీల్దార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనంలో భాగంగా సోమ, మంగళ, బుధవారాలలో ఎక్కువ విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉందని, అందువల్ల అన్ని నిమజ్జన కేంద్రాల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. నీటి కొరత దృష్ట్యా భక్తులు చెరువులు, కుంటలు, నదుల లోపలికి దిగి నిమజ్జనం చేయకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన కేంద్రాల వద్ద లైటింగ్,బారికేడింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టం,క్రేన్లు, మెడికల్ టీంలు, సూపర్ వైజర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైనా నిమజ్జనానికి అవకాశం లేకుంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లుగా బేబీ పాండ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విగ్రహాలతో పాటు చెత్తను నీటిలో వేయకుండా డస్ట్ బిన్లలో వేయాలని, నిమజ్జనంలో పంచాయతీ, మున్సిపల్ అధికారుల పాత్ర కీలకమని అన్నారు. స్థానిక పోలీసులతో పాటు 12వ బెటాలియన్ పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్, ఆపదమిత్ర సేవలను వినియోగించుకోవాలన్నారు.

జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 28 నిమజ్జన ప్రదేశాలను గుర్తించామని,ఈ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, తహసీల్దార్లు, ఎంపీడీవోలపై ఎక్కువ బాధ్యత ఉందన్నారు.శనివారం జిల్లా వ్యాప్తంగా 500 విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు తెలిపారు.ఆది,సోమ,మంగళ,బుధవారాలలో ఎక్కువ మొత్తంలో విగ్రహాలు వస్తాయని,గతంలో చేసిన ఏర్పాట్లను మించి ఈసారి చేయాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో ఆర్‌డిఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

26న ఆలేరులో జరిగే ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్




**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** విద్యారంగ సమస్యల పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల మంజూరీలో ప్రభుత్వం అలసత్వం వహిస్తుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శాంతి కుమార్ విమర్శించారు. ఏఐఎస్ఎఫ్ మండల మహాసభను ఆదివారం గట్టుసింగారం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆయన విమర్శించారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యా సంస్థల్లో సమస్యలు విలయ తాండవం చేస్తుంటే ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుండా ప్రైవేట్ విద్యా రంగాన్ని ప్రోత్సహిస్తుందని ఆయన అన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో కనీస వసతులు లేక విద్యార్థుల తీవ్ర ఇబ్బందులు గురవుతున్న ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆయన దుయ్యబట్టారు. తక్షణమే సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై రాజీ లేని పోరాటాలు నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తక్షణమే పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను మొత్తం ఒకేసారి విడుదల చేయాలని లేనిపక్షంలో మంత్రుల క్యాంప్ కార్యాలయాలను ముట్టడిస్తామని ఆయన తెలిపారు. ఈనెల 26న ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలను , యాదాద్రి భువనగిరి జిల్లా నాలుగవ మహాసభ జయప్రదం చేయుట కొరకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

**అనంతరం నూతన కమిటీ:** మండల అధ్యక్షులుగా చెరుకు లక్ష్మి సాయి, ప్రధాన కార్యదర్శిగా సూరారం జానీ, ఉపాధ్యక్షులుగా చెడే ప్రణయ్, సహాయ కార్యదర్శిగా ముకేష్ కోశాధికారిగా మందుల నవీన్ ఎన్నికయ్యారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐ,కానిస్టేబుల్ ఉచిత శిక్షణ ప్రిలిమినరీ పరీక్షకు విశేష స్పందన



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రానున్న ఎస్ఐ,పోలీస్ కానిస్టేబుల్ నియామక పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత శిక్షణ అందించేందుకు నిర్వహించిన ప్రిలిమినరీ స్క్రీనింగ్ పరీక్షకు విశేష స్పందన లభించింది. ఆదివారం నిర్వహించిన ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 2,250 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబరిచిన 500 మంది అభ్యర్థులను ఎంపిక చేసి,నల్లగొండ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉచిత శిక్షణ అందించనున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ..పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉన్న నిరుద్యోగ యువతకు సరైన మార్గదర్శకత్వం,నాణ్యమైన శిక్షణ అందించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.ఎంపికైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని బాధ్యతగా తీసుకుని క్రమశిక్షణతో శిక్షణకు హాజరై, పట్టుదలతో చదవాలని, శారీరక దృఢత్వంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పోలీస్ ఉద్యోగం కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, సమాజానికి సేవ చేసే గొప్ప అవకాశమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు జామ్లా నాయక్,మక్లా నాయక్,సైదా నాయక్,శీను నాయక్,మోతిలాల్, రమేష్ నాయక్, నానియా నాయక్,శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## డివైడర్‌ను ఢీకొన్న కారు

మంటలు చెలరేగి వైద్యుడు సజీవ దహనం

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో మంటలు చెలరేగి అందులో ప్రయాణిస్తున్న ఓ వైద్యుడు సజీవ దహనమైన సంఘటన ఆదివారం మండలంలోని పిల్లలమర్రి సమీపంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదానికి కారణం అతివేగమా లేక నిద్రమత్తులో ప్రయాణించడమా అన్నది అంతుచిక్కడం లేదు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం మమతా ఆసుపత్రిలో న్యూరో సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ జగదీష్ (50) ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు బ్లాక్ ఓల్వా టిఆర్ నంబర్‌తో ఉన్న కారులో వెళ్తుండగా మార్గమధ్యంలోని పిల్లలమర్రి సమీపంలోని 65వ జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌ను అతివేగంగా ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగడంతో ఆయన సజీవ దహనం అయ్యాడు. రహదారిపై వెళ్తున్న వారు ప్రమాదం జరిగిన విషయం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఫైర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పడం జరిగింది. అప్పటికే మంటల్లో వాహనంతోపాటు జగదీష్ పూర్తిగా కాలిపోయాడు. ఈ ప్రమాదంలో మొదట మృతి చెందిన వ్యక్తి ఎవరన్నది తెలియక పోలీసులు విచారణ ప్రారంభించగా మోతె మండలం మామిళ్ళగూడెం వద్ద ఉన్న టోల్ గేట్ వద్ద ఉన్న సిసి కెమెరాలను పరిశీలించడంతో మృతి చెందిన వ్యక్తి డాక్టర్ కాసకుర్తి జగదీష్‌గా గుర్తించారు. కారులో అతను ఒక్కడే ప్రయాణిస్తున్నట్లుగా తేలింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని పూర్తి దర్యాప్తు చేస్తున్నారు.





## చేనేత సహకార సంఘం డైరెక్టర్లకు సన్మానం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** చేనేత సహకార సంఘం నూతన చైర్మన్‌గా ఎన్నికైన బాల్నే వెంకన్న, పాలకవర్గాన్ని ఆదివారం ప్రభుత్వ విప్,స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం తన నివాసంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేతరంగం అభివృద్ధికి, చేనేతకార్మికుల సంక్షేమానికి సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. నూతనంగా ఎన్నికైన చైర్మెన్, డైరెక్టర్లు సంఘం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు పున్న యాదగిరి,ప్రధాన కార్యదర్శి చిలుకూరి సుజాత,కోశాధికారి అలువాల వెంకటేశ్వర్లు,పద్మశాలి సంఘం అధ్యక్షులు మూడుదుడ్ల కృష్ణమూర్తి,సిల్క్ సహకార సంఘం అధ్యక్షురాలు గోలి పద్మ,డైరెక్టర్లు జెల్లా లక్ష్మీనారాయణ,చిలుకూరి వెంకటేశ్వర్లు,బొప్పని శంభులింగం పాల్గొన్నారు.

## బుల్లెట్ రైలు సాధించేంత వరకూ ఉద్యమం




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జాతీయ రహదారికి సమాంతరంగా సూర్యాపేట మీదుగా బుల్లెట్ రైలు, రైల్వే కారిడార్ సాధించేంత వరకు జరిగే ప్రతి ఉద్యమంలో తెలంగాణ జన సమితి క్రియాశీలకంగా ఉంటుందని లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ నాయక్, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు గోపి, రైతు జన సమితి జిల్లా అధ్యక్షులు కొల్లు కృష్ణారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం 38వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షలో తెలంగాణ జన సమితి నాయకులు దీక్షలో కూర్చొని మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు నాడు ఉమ్మడి రాష్ట్ర పాలకులు నేడు కేంద్ర, రాష్ట్ర పాలకులు అన్యాయం చేస్తూనే ఉన్నారని మండిపడ్డారు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. ఈ దీక్షలో గిరిజన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి సుమన్ నాయక్, ఉపాధ్యక్షులు జాటోతు శ్రీను నాయక్, విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు బొమ్మగాని వినయ్ గౌడ్, యువజన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగు నాయక్, జన సమితి జిల్లా ఉపాధ్యక్షులు పానుకోటి సూర్యనారాయణ, ఫరీద్ తదితరులు కూర్చోగా బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కన్వీనర్ జానకి రాంరెడ్డి వారికి పూలమాలలు వేసి దీక్షకు సంఘీభావం తెలిపారు.

## జర్నలిస్టుల పోరాటపటిమకు కృతజ్ఞతలు




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఇళ్ల స్థలాల సాధన కోసం జర్నలిస్టులు చూపిన పోరాటపటిమకు టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి,ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డిలు మాట్లాడారు.30 ఏళ్లుగా జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వడంలో ప్రభుత్వాలు చేస్తున్న నిర్లక్ష్యంపై టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఈ నెల 18,19 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు విజయవంతమయ్యాయని తెలిపారు.ఈ దీక్షలు ప్రభుత్వ పెద్దలను ఆలోచింపజేస్తున్నాయని పేర్కొన్నారు. ఈదీక్షలకు ప్రతిపక్ష పార్టీల నాయకులు,విద్యార్థి సంఘాలు,ప్రజా సంఘాల నాయకులు,జిల్లాలోని వివిధ మండలాల టీయూడబ్ల్యూజే ప్రతినిధులు, జర్నలిస్టులు విచ్చేసి మద్దతు ఇవ్వడం ప్రభుత్వంపై ఒత్తిడికి దోహదపడిందన్నారు. గతంలో ప్రైవేట్ విద్యా సంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కోసం జరిపిన పోరాటం ద్వారా 50 శాతం ఫీజు రాయితీ జీవో వచ్చిందని,ఆ స్ఫూర్తితోనే తాజా పోరాటం జరిగిందని తెలిపారు.మీ బలం,మీరు ఇచ్చిన మద్దతుతో భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేస్తామని,ఇంటి స్థలాలు వచ్చే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు.వారం రోజుల తర్వాత ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు.ఉద్యమ స్ఫూర్తిని చాటిన జిల్లా జర్నలిస్ట్ లోకానికి జిల్లా కమిటీ సెల్యూట్ చేస్తున్నట్లు తెలిపారు.

## బంగారు నాణేలు తక్కువ ధరకే ఇప్పిస్తామని మోసం

**ప్రజాపక్షం/మర్రిగూడ:** పశ్చిమగోదావరి జిల్లా తణుకు మందపాకకు చెందిన మాచర్ల వెంకటేష్, మండలం లోని శివన్నగూడెం గ్రామానికి చెందిన వ్యక్తిని పరిచయం చేసుకుని తక్కువ ధరకే బంగారు నాణేలు ఇప్పిస్తానని మోసం చేశాడు.పలు విడతలుగా ఆ వ్యక్తి నుంచి రూ.6.20 లక్షలు తీసుకుని పరారయ్యాడు. మోసపోయానని తెలుసుకున్న బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి సైబర్ మోసగాడిని రిమాండ్‌కు తరలించినట్లు నాంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



## అంగరంగ వైభవంగా భజన

**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని మల్కీజ్‌గూడ గ్రామంలోని అంజనేయస్వామి ఆలయంలో వినాయకుడి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాత్యానంద శ్రీకృష్ణ భజన మండలి శ్రీ గురు మాత నిత్యాలంబ దేరంగుల నారాయణమ్మ గారి అధ్వర్యంలో రవీంద్ర భారతి సన్నుతిమండలి నుండి భజన కార్యక్రమం అంగరంగ వైభవంగా సాగింది. మల్కీజ్‌గూడ, దబ్బడ గూడ, గడ్డమల్లయ్యగూడ గ్రామాలనుండి భజన భక్తులు పెద్దెత్తున హాజరైనారు. భజన బృందం గ్రామీణ ప్రాంతం నుండి రాష్ట్ర స్థాయికి ఎదిగారు. ఈ బృందం ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొని వివిధ ప్రశంసలు అందుకున్నారు. గోల్కొండ బోనాల సందర్భంగా కళా బృందం ప్రదర్శనలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం తరఫున అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రవీంద్ర భారతిలో 99 రోజుల ప్రోగ్రాంలో పాల్గొని ప్రశంసలు పొందారు. యాదగిరి గుట్ట బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. భజన బృందానికి ప్రత్యేక అవార్డు రావడం జరిగింది. మల్కీజ్‌గూడ భజన బృందానికి మంచి గుర్తింపు లభించింది. తెలంగాణ రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లాకు, యాచారం మండలం మల్కిజ్‌గూడ గ్రామానికి మంచి గుర్తింపు లభించింది. విజయాలు సాధించి జాతీయ స్థాయిలో రాణించాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

## మట్టి వినాయకులనే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం



మియాపూర్‌లో పలు వినాయక మంటపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ కార్పొరేటర్ శ్రీకాంత్

**ప్రజాపక్షం/మియాపూర్:** మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని మియాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ప్రజలకు పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా మియాపూర్ డివిజన్ పరిధిలోని క్రిష్ణ సాయి ఎన్‌క్లేవ్, జనప్రియ వెస్ట్ సిటీ,బీకే ఎన్‌క్లేవ్, సుభాష్ చంద్రబోస్ నగర్, న్యూ కాలనీ, ఆర్బీఆర్, ఎఫ్‌సీఐ, స్టాలిన్ నగర్ కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఆయన సందర్శించారు. సీనియర్ నాయకులు బండారు మోహన్ ముదిరాజ్, స్థానిక నాయకులు, కాలనీ వాసులతో కలిసి మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ మియాపూర్ డివిజన్ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూనే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వినాయక చవితి సందర్భంగా పిఏసి ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ ఆదేశాల మేరకు మియాపూర్ డివిజన్‌లో అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు శ్రీకాంత్ పేర్కొన్నారు. ప్రజలు ప్రశాంతంగా పండుగ జరుపుకునేలా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, భక్తులు, అభిమానులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఫరూక్‌నగర్:** ఆధ్యాత్మిక చింతనతోనే మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి వివరించారు. ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని డ్రీమ్‌ల్యాండ్, ఏబి విల్లాస్, జిహెచ్‌ఆర్, ఆర్‌టిసి కాలనీ, విజయనగర్, భగత్‌సింగ్, రతన్‌కాలనీ, గంజీ, గాంధీనగర్ కాలనీల్లో ప్రతిష్ఠించిన వినాయకులకు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం వినాయక మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దైవ చింతనతోపాటు తోటి వారికి సాయం చేయడం, ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం ద్వారనే భగవంతుని అనుగ్రహం లభిస్తుందని అన్నారు. గణేష్ ఉత్సవ కమిటీలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడమే కాకుండా సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు అందె బాబయ్య, కౌన్సిలర్లు అనిత రఘునాథ్ యాదవ్, లక్ష్మి ప్రసన్న వేణుగోపాల్, బిఎస్ సుధీర్, గౌస్ జానీ, ఎస్పీ శివ, మాజీ కౌన్సిలర్లు కానుగు అనంతయ్య, నందకిశోర్, ఈశ్వర్‌రాజు, చింటూ, చెట్ల నర్సింలు, సీనియర్ నాయకులు రాయికల్ వెంకట్‌రెడ్డి, అలుగడ్డ ప్రవీణ్, మాజీ ఎంపిటిసి అశోక్‌రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, చక్రంరెడ్డి, దినేష్‌సాగర్, మహేశ్వర్, నడికూడ సంతోష్ యాదవ్, శ్రీశైలం గౌడ్, మేకల వెంకటేష్ యాదవ్, అభిలాష్, ప్రవీణ్, సత్యంలు పాల్గొన్నారు.

## అభివృద్ధి కోసం ఎమ్మెల్యేకు వినతి



**ప్రజాపక్షం/షాబాద్:** విద్య, వైద్యం, ఉపాధి అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యకు షాబాద్ జడ్‌పిహెచ్ఎస్ ఫ్రెడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరుపున అధ్యక్షుడు యాదగిరి ఆదివారం చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం జడ్‌పిహెచ్ఎస్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు యాదగిరి ఎమ్మెల్యే యాదయ్యతో మాట్లాడుతూ.. షాబాద్ మండలంలోని విద్యను అభ్యసిస్తున్న ప్రతి ఒక్కరికి విద్య, వైద్యం, ఉపాధి కల్పించేందుకు జడ్‌పిహెచ్ఎస్ ఫ్రెడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తున్నట్లు వివరించారు. షాబాద్ పాఠశాల భవనం నిర్మాణంకు 2027–28 విద్యా సంవత్సరంలో సుమారుగా రూ.25 కోట్లు మంజూరుకు గాను ప్రణాళిక సిద్ధం చేసి ప్రభుత్వంకు ప్రతిపాధనలు అందజేసిన్నట్లు పేర్కొన్నారు. జూనియర్ కళశాల భవనం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య సానుకులంగా స్పందిస్తూ షాబాద్ మండల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి విద్య, వైద్యం, ఉపాధి అందరికి అందేలా నా వంతు బాధ్యతగా తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిహెచ్ఎస్ ఫ్రెడ్స్ వెల్ఫేర్ అసోసియోజన్ సభ్యులు శ్రీనువాస చారి, సత్యనారాయణ, రాంచంద్రయ్య, హరి కుమార్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

# అన్నదానంలో ఉద్రిక్తత

రంగంలోకి ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్



**ప్రజాపక్షం/సైదాబాద్:** వినాయక మండపం వద్ద జరుగుతున్న అన్నదానం సందర్భంగా మధ్యాహ్నం చోటుచేసుకున్న ఘటన తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. గుర్తుతెలియని వ్యక్తుల కారణంగా నెలకొన్న పరిస్థితులతో బిజెపి, హిందూ సంఘాల నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి సైదాబాద్ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మాదన్నపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే చంచల్‌గూడ జైల్ పక్కనే ఉన్న డబుల్ బెడ్‌రూం దగ్గర ఏర్పాటైన వినాయక విగ్రహం వద్ద మాంసం కవర్ వదిలివెల్లడంతో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. బిజెపి నేతలు అందెల శ్రీరాములు, చీకోటి ప్రవీణ్, నరేందర్‌యాదవ్ తదితరులు తరలివచ్చి నిరసన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన వీడియోలతో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ రంగంలోకి దిగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. పరిస్థితిని పోలీసు ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. సిసికెమెరాల ఆధారంగా దర్యాప్తు చేయాలని హిందూ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. అనూహ్యంగా చోటుచేసుకున్న ఘటనతో పోలీసులు సైతం ఉలిక్కిపడ్డారు. అంతా ప్రశాంతంగా జరుగుతుందనుకుంటున్న తరుణంలో అత్యంత సమస్యాత్మక ప్రాంతంలో దుండగుల చర్యలతో పోలీసులు పూర్తిస్థాయిలో అప్రమత్తం అయ్యారు. శాంతియుతంగా ఉండాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## బిసి ఉద్యమానికి సాహిత్య రంగం భావజాల పునాది

తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్



**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** ఓట్ల కోసం బిసిల మాస్క్ వేసుకుని వస్తున్న ఆదిపత్యవాదుల కుట్రలను సాహిత్య లోకం తిప్పికొట్టాలి.. ఇంకెన్నాళ్లు ఈ కులం జులుం అని బిసి సాహిత్య లోకం ఉప్పొంగాలి.. కుల ఆదిపత్యాలను నేలమట్టం చేసే బహుజన సాహిత్యానికి పట్టాభిషేకం చేయాలని... వెంటాడే కలాలు పుస్తక సంపాదకులు, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వెంటాడే కలాలు.. వెనుకబడిన కులాలు పుస్తక రజతోత్సవ సభలో జూలూరు గౌరీశంకర్ కీలకోపన్యాసం చేశారు. బీసీ సాహిత్యం బాధను నమోదు చేసే దశ నుంచి ప్రశ్నించే దశకు ఎదిగిందని.. వెంటాడే కలాలు ఒక పుస్తకంగా మొదలై పాతికేళ్ల తర్వాత అనేక గొంతులు కలుసుకునే చారిత్రక సందర్భంగా మారిందని.. వెంటాడిన కలాలు ఇప్పుడు గొంతులు పెకలిస్తున్నాయని.. కలిసిన గొంతులు ఒక సామాజిక దృక్పథాన్ని రచించుకునేందుకు బీసీ గొంతుకల రజతోత్సవ కూడలి దగ్గరకు వచ్చాయని.. ఆ దృక్పథమే రేపటి బీసీ ఉద్యమానికి సాంస్కృతిక పునాది కావాలన్నారు. బీసీలకు దక్కాల్సిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అవకాశాలు, ప్రాతినిధ్యం వంటి అంశాలపై సాహిత్య సమాజం విస్తృతమైన చర్చను చేపట్టేందుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీసీ సాహిత్యం బాధను నమోదు చేసే దశ నుంచి ప్రశ్నించే దశకు, ప్రశ్నించే దశ నుంచి ప్రత్యామ్నాయ సామాజిక దృక్పథాన్ని ప్రతిపాదించే స్థాయికి ఎదుగుతుందన్నారు. ఈ సందర్భంగా సెంటర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ, బీసీ కవులు, రచయితలు ఇంత మందిగా ఒకే చోట కూడటం ఒక ఆత్మగౌరవ ప్రకటన అన్నారు. పీడనకు గురి అవుతున్న వర్గాలకు విముక్తి సందేశాన్ని కవులు కళాకారులుగా అందించవలసిన బాధ్యత ఉందని చెప్పారు. బీసీ రచయితల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు గాజోజు నాగభూషణం మాట్లాడుతూ, బీసీ కవులు రచయితలు రాజ్యాధికార దిశగా ముందుకు సాగడానికి భావజాల పాటలు వేయాలన్నారు. ప్రముఖ కవి వనపట్ల సుబ్బయ్య మాట్లాడుతూ, వెంటాడే కలాలు తెలుగు సాహిత్యంలో నిశ్శబ్ద విప్లవం సృష్టించిందన్నారు. రజతోత్సవ సభకు ప్రఖ్యాత విమర్శకులు సంగిశెట్టి శ్రీనివాస్, కాకతీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ చింతం ప్రవీణ్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రముఖ కవులు దెంచనాల శ్రీనివాస్, పాశం యాదగిరి, అంబటి వెంకన్న, సీతారాం, బాణాల శ్రీనివాసరావు, ప్రొఫెసర్ రఘు, జి. విజయలక్ష్మి, జుగాస్ విలి, అన్నవరం దేవేందర్, ప్రొఫెసర్ వి.త్రివేణి, ప్రొఫెసర్ పెబ్బేటి, మల్లికార్జున్, మందవరపు హైమావతి, నాలేశ్వరం శంకరం, ననుమాస స్వామి, ప్రసాదమూర్తి, తగుళ్ళ గోపాల్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## లిఫ్ట్–గోడ మధ్య వేలాడుతున్న వ్యక్తిని కాపాడిన హైడ్రా

గంటన్నరపాటు శ్రమించి ప్రాణాలు రక్షించిన బృందం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లిఫ్ట్‌కు, గోడకు మధ్య ఇరుక్కొని ప్రాణాపాయ స్థితిలో వేలాడుతున్న ఓ వ్యక్తిని హైడ్రా సిబ్బంది సాహసోపేతంగా రక్షించారు. మూసాపేట ఆంజనేయనగర్‌లోని ఓ మూడు అంతస్తుల భవనంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. పాత లిఫ్ట్‌లో సెన్సార్లు సరిగా పనిచేయకపోవడంతో ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఆంజనేయనగర్‌లో నివసించే మురళి (40) తన భార్యతో కలిసి గ్రౌండ్ ఫ్లోర్ నుంచి రెండో అంతస్తుకు లిఫ్ట్‌లో వెళ్లాడు. రెండో అంతస్తులో లిఫ్ట్ ఆగగానే బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా, అదే సమయంలో మూడో అంతస్తుకు వెళ్లేందుకు ఎవరో లిఫ్ట్ బటన్ నొక్కారు. దీంతో క్షణాల్లో లిఫ్ట్ పైకి కదిలింది. ఆ సమయంలో మురళి ఒక కాలు లిఫ్ట్‌లో, మరో కాలు రెండో అంతస్తు వద్ద ఉండటంతో లిఫ్ట్ కదలికకు ఆయన కాలు గ్రిల్స్‌లో ఇరుక్కుపోయింది. లిఫ్ట్‌గోడ మధ్య నలిగిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. లిఫ్ట్‌లోనే ఉన్న మురళి భార్య కేకలు వేయడంతో అపార్ట్‌మెంట్ వాసులు వెంటనే స్పందించి రక్షించేందుకు ప్రయత్నించారు. అయితే ఫలితం లేకపోవడంతో హైడ్రా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. ఆదివారం ఉదయం 9.15 గంటలకు సమాచారం అందుకున్న వెంటనే హైడ్రా డిఆర్ఎఫ్ బృందం రంగంలోకి దిగింది. కూకట్‌పల్లిలోని హైడ్రా డిఆర్ఎఫ్ బృందం మార్షల్ జెడివి ప్రసాద్ నేతృత్వంలో ఉదయం 9.30 గంటలకు ఘటనా స్థలానికి చేరుకుంది. మూడో అంతస్తు, రెండో అంతస్తుల మధ్య గ్రిల్స్‌లో కాలు ఇరుక్కొని వేలాడుతున్న మురళిని బయటకు తీసేందుకు సిబ్బంది దాదాపు గంటన్నరపాటు శ్రమించారు. లిఫ్ట్ గోడను బద్దలు కొట్టి, సనత్ నగర్ ఫైర్ సిబ్బంది అందించిన హైడ్రాలిక్ కట్టర్ సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. చివరకు ఉదయం 10.50 గంటలకు మురళిని సురక్షితంగా బయటకు తీసి సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో మురళి కాలుకు ఫ్రాక్చర్ అయినట్లు వైద్యులు తెలిపారు. ప్రమాద సమయంలో హైడ్రా సిబ్బంది వెంటనే స్పందించి కింద నుంచి పట్టుకుని రక్షించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సహాయక చర్యల్లో సనత్ నగర్ ఫైర్ స్టేషన్ సిబ్బందితో పాటు హైడ్రా డిఆర్ఎఫ్ సభ్యులు మార్షల్ జెడివి ప్రసాద్, ఎర్రసాని అనిల్ కుమార్, జమ్మ రమేష్, వీత రమేష్, పల్లికామిటి గోపి, పోలీసు కానిస్టేబుల్ నరేష్ పాల్గొన్నారు.

## రూ.2.50 కోట్ల అడ్వాన్స్.. ఫ్లాట్ జాడేది?

వ్యాపారిపై చీటింగ్ కేసు..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లో భారీ రెసిడెన్షియల్ కమ్ కమర్షియల్ ప్రాజెక్టు నిర్మిస్తున్నానని, తనకే భూమిపై పూర్తి హక్కులు ఉన్నాయని, అన్ని అనుమతులు వచ్చాయని నమ్మించి రూ.6.08 కోట్ల విలువైన ఫ్లాట్ కోసం రూ.2.50 కోట్ల అడ్వాన్స్ తీసుకుని.. చివరకు నిర్మాణమే ప్రారంభించలేదన్న ఆరోపణలపై ఓ వ్యాపారిపై సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. భూమికి స్పష్టమైన హక్కులు, నిర్మాణ అనుమతులు లేవన్న విషయం తెలిసినా వాటిని దాచిపెట్టి డబ్బు తీసుకున్నారని ఫిర్యాదుదారు ఆరోపించారు. ఫ్లాట్ ఇవ్వకపోగా తీసుకున్న రూ.2.50 కోట్లను కూడా తిరిగి చెల్లించలేదని పేర్కొన్నారు. కేసు వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌కు చెందిన వ్యాపారి అజయ్ గుప్తాకు 2019లో తన స్నేహితుడు మనీష్‌కుమార్ అగర్వాల్ ద్వారా నిఖిల్ ధరివాల్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ నగల వ్యాపార రంగానికి చెందినవారేనని, ఆ పరిచయంతో నిఖిల్ ధరివాల్ తనను సంప్రదించి బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లో నిర్మించనున్న రెసిడెన్షియల్ కమ్ కమర్షియల్ ప్రాజెక్టులో ఫ్లాట్ విక్రయానికి ప్రతిపాదించినట్లు అజయ్ గుప్తా ఫిర్యాదులో తెలిపారు. 2022 ఫిబ్రవరిలో నిఖిల్ ధరివాల్ తనకు బంజారాహిల్స్‌లోని సర్వే నంబర్ 102/4/2లోని 12.02 ఎకరాల భూమిపై పూర్తి యాజమాన్య హక్కులు, స్వాధీనం ఉన్నాయని చెప్పినట్లు ఫిర్యాదుదారు పేర్కొన్నారు. భూమికి స్పష్టమైన, మార్కెట్ చేయదగిన హక్కులు ఉన్నాయని, నిర్మాణానికి అవసరమైన అన్ని అనుమతులు పొందామని, ప్రాజెక్టును చట్టబద్ధంగా నిర్మించి ఫ్లాట్లు విక్రయించే హక్కు తనకు ఉందని చెప్పినట్లు ఆరోపించారు. తన వాదనలకు మద్దతుగా భూమికి సంబంధించిన పత్రాలు, లేఅవుట్, ప్రతిపాదిత నిర్మాణ నమూనాలను చూపించాడని అజయ్ గుప్తా తెలిపారు. 2020 జనవరి 26 తేదీతో ఉన్న లేఅవుట్‌లో సుమారు 9.17 గుంటల విస్తీర్ణంలో రెండు పార్కింగ్ ప్రాంతాలు, జీ ప్లస్ 4 నిర్మాణాల ప్రతిపాదన ఉన్నట్లు పేర్కొన్నారు. వాటిని చూపిస్తూ ప్రాజెక్టుకు అన్ని అనుమతులు ఉన్నాయన్న నమ్మకాన్ని కలిగించారని ఫిర్యాదులో ఆరోపించారు. తనకు 6,400 చదరపు అడుగుల ఫ్లాట్‌ను చదరపు అడుగుకు రూ.9,500 నుంచి రూ.9,501 చొప్పున విక్రయిస్తానని నిఖిల్ ధరివాల్ చెప్పినట్లు అజయ్ గుప్తా తెలిపారు. మొత్తం ఫ్లాట్ ధర రూ.6.08 కోట్లుగా నిర్ణయించారని, అడ్వాన్స్ అందుకున్న మూడు సంవత్సరాల్లో నిర్మాణం పూర్తి చేసి ఫ్లాట్ అప్పగిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఈ హామీలను నమ్మి 2022 ఫిబ్రవరి 24న రూ.2 కోట్లు, మార్చి 8న రూ.50 లక్షలు.. మొత్తం రూ.2.50 కోట్లను రెండు విడతల్లో చెల్లించినట్లు ఫిర్యాదుదారు తెలిపారు. మూడు సంవత్సరాల్లో ఫ్లాట్ అప్పగిస్తానన్న హామీ ఇచ్చినా 2026 నాటికి కూడా నిర్మాణం ప్రారంభం కాలేదని, ఫ్లాట్ ఇవ్వలేదని, రూ.2.50 కోట్లను తిరిగి చెల్లించలేదని అజయ్ గుప్తా పేర్కొన్నారు. ఫిర్యాదు ఆధారంగా సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బిసిలకు రాజ్యాధికారం కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** బీసిలకు రాజ్యాధికారం కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు తీర్మాన్ మల్లన్న ఆరోపించారు. తీన్మార్ మల్లన్న చేపట్టిన బీసి రాజ్యాధికారి పాదయాత్ర ఆదివారం షాద్‌నగర్‌కు చేరుకుంది. స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ముఖ్యకూడలిలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు, ప్రొఫెసర్ జయశంకర్ సార, చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ఇటీవల ఎన్నికల కమీషన్ చేపట్టిన సర్వేలో బీసిల జనాభా అధికంగా ఉన్నట్లు వెల్లడైందని, అందుకే బీసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసిలు రాజకీయంగా, సామాజికంగా తగిన ప్రాధాన్యత ఇవ్వడంలో రాజకీయ పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. బీసిలకు రాజ్యాధికారం సాధించడమే ప్రధాన లక్ష్యంగా ఈ పాదయాత్ర చేపట్టడం జరుగుతుందని వివరించారు. బీసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి బిల్లు పెట్టారే తప్పా నేటి వరకు అమలు చేయడం లేదని వాపోయారు. రాజకీయ పార్టీల నేతలు బీసిలకు ఓటు బ్యాంకుగానే వినియోగిస్తున్నారే తప్పా అభివృద్ధి, సంక్షేమానికి ఏమాత్రం కృషి చేయడం లేదని వాపోయారు. పట్టణంలోని ఎస్టి హాస్టల్‌ను సందర్శించినట్లు మల్లన్న తెలిపారు. హాస్టల్‌లో వసతులు లేవని, బాత్రూమ్‌లు దెబ్బతిన్న పరిస్థితిలో ఉన్నాయని ఆరోపించారు. బీసి, ఎస్సీ, ఎస్టి సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో భూ వివాదాలు, భూ బదలాయింపుల విషయంలో పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పేదల భూములను అక్రమంగా పేరు మార్పిడి చేసుకొని స్వాధీనం చేసుకుంటున్నారని ఆరోపించారు. బీసిలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతోనే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్రలు చేపట్టినట్లు వివరించారు. బీసిల సమస్య పట్ల ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళడం జరుగుతుందని, బిసిలకు రాజ్యాధికారమే లక్ష్యంగా పాదయాత్రలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

**ఎమ్మెల్యే శంకరన్నా.. మీపట్ల ప్రజల్లో బాగాలేదు.. సరిచేసుకోండి**

బడుగు బలహీన వర్గాల బీసి బిడ్డ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరన్నా..మీపట్ల ప్రజల్లో బాగా లేదని.. సరి చేసుకోవాల్సి అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం షాద్‌నగర్ ముఖ్యకూడలిలో ఏర్పాటు చేసిన రోడ్ షోలో తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ అధికార పార్టీ నేత, బడుగుల బీసి బిడ్డ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై ప్రజల్లో అసంతృప్తి ఉందని, సర్వేలు ఏమాత్రం బాగాలేవని, సరి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ సమస్య వచ్చినా చివరకు ఎమ్మెల్యే శంకరయ్య వద్దకు వస్తుందని, పరిష్కారం కాకపోయినా వివాదం మాత్రం జరుగుతుందని వివరించారు. సామాజిక సమీకరణాలపై ఈ నేత వైఖరీ ప్రశ్నిస్తూ ప్రజాక్షేత్రంలో పరిస్థితి ఏమాత్రం బాగాలేదని.. చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.



## ప్రపంచ శాంతికి పోలీస్ శిక్షణార్థుల అడుగులు

ట్యాంక్‌బండ్‌పై విశ్వ శాంతి యాత్రలో
58 మంది టిజిపిఎ శిక్షణార్థుల భాగస్వామ్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాంతి, సోదరభావం, సామరస్యం, మానవతా విలువల పరిరక్షణకు తాము కూడా భాగస్వాములమంటూ పోలీస్ శిక్షణార్థులు అడుగులు వేశారు. ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ అఖిల భారతీయ ఆధ్యాత్మిక సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన 'విశ్వ శాంతి యాత్ర'లో ఆర్‌బివిఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ (టిజిపిఎ)కి చెందిన 58 మంది శిక్షణార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టిజిపిఎ డైరెక్టర్ అభిలాషా బిస్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఔట్‌డోర్ అసిస్టెంట్ డైరెక్టర్ యార్లగడ్డ రాంబాబు పర్యవేక్షణలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ చైతన్యతో పాటు శిక్షణార్థులు శాంతి యాత్రలో పాల్గొన్నారు. విశ్వ శాంతి యాత్ర సంఘం లైజన్‌గా మునీష్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి, సామరస్యం నెలకొనాలని ఆకాంక్షిస్తూ నిర్వహించిన ఈ యాత్రలో వివిధ వర్గాల ప్రతినిధులతో పాటు టీజీపీఏ శిక్షణార్థులు పాల్గొన్నారు. 'విశ్వ శాంతి–మానవతా సమైక్యత' సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. పోలీసు శిక్షణలో కేవలం వృత్తిపరమైన నైపుణ్యాలకే కాకుండా క్రమశిక్షణ, మానవీయ విలువలు, సామాజిక బాధ్యత, శాంతి, సామరస్య భావనలకు టీజీపీఏ ప్రాధాన్యం ఇస్తోంది. ఈ నేపథ్యంలో శాంతి యాత్రలో శిక్షణార్థుల భాగస్వామ్యం సామాజిక బాధ్యత, మానవతా విలువల పట్ల వారి నిబద్ధతను చాటి చెప్పింది. శాంతి కోసం అడుగులు.. సామరస్యం కోసం సంకల్పం.. మానవత కోసం పోలీస్ శిక్షణార్థుల భాగస్వామ్యంగా ట్యాంక్‌బండ్‌పై విశ్వ శాంతి యాత్ర సాగింది.

## పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కంకణబద్ధులై పని చేయాలి



కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బింగి దేవదాస్ గౌడ్

**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** పార్టీ అభివృద్ధికి ప్రతి ఒకరు కంకణ బద్ధులై పని చేయాలని బ్దుల్లాపూర్‌మెట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బింగి దేవదాస్ గౌడ్ అన్నారు. ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాను సారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని చిన్న రావిరాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ, యువజన కాంగ్రెస్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బింగి దేవదాస్ గౌడ్ ఆధ్వర్యంలో, బి బ్లాక్ అధ్యక్షులు భాస్కర్ చారి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ప్రణీత్ యాదవ్, కావడిపల్లి గ్రామ సీనియర్ నాయకులు కోలన్ రవీందర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. గ్రామ సర్పంచ్ కిషన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లింగారెడ్డి, ధర్మారెడ్డి, శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కిష్టయ్య, వెంకటేష్, కమలమ్మ, ఇతర సీనియర్ నాయకుల పర్యవేక్షణలో గ్రామ కాంగ్రెస్ కమిటీ, యువజన కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బింగి దేవదాస్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. స్థానిక ఎంఎల్‌ఏ మల్‌రెడ్డి రంగారెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల తోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తను గుర్తించి సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు దేవదాస్ గౌడ్ తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా చింతల మోహన్ రెడ్డి, చిన్న రావిరాల గ్రామ శాఖ అధ్యక్షులుగా చింతల మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా బంగారి సత్యనారాయణ, సధిపల్లి శివశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కండికోట శివశంకర్ రెడ్డి, నాగిరెడ్డి శివ రెడ్డి ,కోశాధికారి శేఖర్ రెడ్డి, గుర్రం సురేందర్ నేత, ఒంటేదు అశోక్, యువజన కాంగ్రెస్ విభాగంలో గ్రామ శాఖ అధ్యక్షులుగా కారెడ్డి అమూల్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా బండారి శివ, ప్రధాన కార్యదర్శిగా ఒంటేదు శ్రీనివాస్, కోశాధికారిగా ఇంకా శివ, కార్యదర్శిగా సంపంగి అనిల్‌ను నియమించడం జరిగింది.

## ప్రశ్నార్థకంగా వ్యవసాయ రంగం

కరుణించని వరుణుడు..
పంటలను చూసి కన్నీరు పెడుతున్న రైతులు
వాడుతున్న పత్తి, కంది, మొక్కజొన్న పంటలు

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రకృతి గతి తప్పుతున్న నేపథ్యంలో వ్యవసాయ రంగం ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు రాకపోవడం, వచ్చిన కొద్దిపాటి వర్షాలకు సాగుచేసిన పత్తి, మొక్కజొన్న, కంది, ఇతర పంటలు పూర్తిగా వాడుతున్నాయి. వరుణ దేవుడు కరుణించకపోవడంతో సాగుచేసిన పంటలు కళ్ళముదే ఎండిపోతుండటంతో అన్నదాతలు వాటిని చూసి కన్నీరు పెడుతున్నారు. పంటలు చేతికి రాకముందే ఇలాంటి దుస్థితి ఏర్పడితే ఇక వాటి సాగుకోసం పెట్టిన పట్టుబడుల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని అన్నదాతలు అంటున్నారు. ఒకవైపు పంటల సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలని రైతులు మరోవైపు జీవనం ఎలా కొనసాగించాలనే సందిగ్ధంలో రైతులు పడిపోయారు. సహజ సిద్ధంగా ప్రకృతి పరంగా ఏర్పడే బుతు పవనాలు క్రమంగా గతి తప్పుతుండటంతో మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని చెప్పవచ్చు. రోజులు గడుస్తున్న కోసం వర్షాలు క్రమంగా తగ్గుతుండటంతో భూగర్భ జలాలు సైతం అడుగంటి పోతున్నాయి. చెరువులు, కుంటలు వర్షపునీరు లేక వెలవెలబోతున్నాయి. వరుణ దేవుడి కరుణ కోసం ఒకవైపు అన్నదాతలు, మరోవైపు చెరువు, కుంటలు బిక్కు బిక్కు మంటూ ఎదురు చూస్తున్నాయి.

చిప్ పరిశ్రమను లక్ష్యంగా చేసుకోగల సైబర్ దాడుల పట్ల

# అప్రమత్తంగా ఉండాలి

కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్



**న్యూఢిల్లీ :** ప్రపంచ చిప్ సరఫరా వ్యవస్థలో ఇప్పటికే బలమైన స్థానాన్ని కలిగి ఉండే శక్తులు, భారత్ సాధిస్తున్న సెమీకండక్టర్ పురోగతిని ఒక ముప్పుగా భావించే అవకాశం ఉందని ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. దేశ ఎదుగుదలను వ్యతిరేకించే వారినుంచి ఎదురయ్యే సైబర్ దాడులు, ఇతర అంతరాయాల పట్ల ఈ పరిశ్రమ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. 'పిటిఐ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ చిప్‌లను డిజైన్ చేసే, తయారు చేయగల సామర్థ్యం ఉన్న దేశంగా భారతదేశం ప్రస్తుతం ఆవిర్భవిస్తున్నందున, పరిశ్రమ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టంగా హెచ్చరించినట్లు తెలిపారు. ఈ స్థితిని ఇప్పటికే స్థిరపడిన అనేక ఇతర సంస్థలు స్పష్టంగా ఒక ముప్పుగా భావిస్తాయని ఆయన వివరించారు. అనేకదేశాలు భారతదేశాన్ని విశ్వసనీయభాగస్వామిగా పరిగణిస్తూ, తమఉత్పత్తులను ఇక్కడే అభివృద్ధిచేసి, తయారుచేస్తున్నందున, భారతదేశం ఉన్నస్థానాన్ని తేలికగా తీసుకోకూడదని, అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. ఈ విషయంపై తాను నిష్కపటంగా, నిక్కచ్చిగా చర్చించిన వ్యక్తి నుంచి పరిశ్రమ ఇప్పుడు అవగాహనతో ఉందని, వారు తప్పకుండా సరైన చర్యలు తీసుకుంటారన్న ఆశాభావాన్ని మంత్రి అశ్విని వైష్ణవ్ ఆకాంక్షించారు. ప్రపంచ సెమీకండక్టర్ విలువ గొలుసులో తన ఉనికిని మరింత విస్తరించుకోవాలని భారత దేశం కోరుకుంటోంది. తద్వారా, దేశ సాంకేతిక, ఉత్పాదక ఆశయాలకు అనుగుణంగా ఈ రంగం మరింత ముఖ్యమైనదిగా మారుతోంది. చిప్ అసెంబ్లీ, పరీక్షలకు మించి ఈ వ్యవస్థను విస్తరించాలని కూడా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. చిప్ డిజైన్, సెమీ కండక్టర్ పరికరాలు, మెటీరియల్స్, ఫ్యాబ్స్, అధునాతన ప్యాకేజింగ్, పరిశోధన, అభివృద్ధి, ప్రతిభ, అభివృద్ధి మద్దతు ఇవ్వడానికి కేంద్ర మంత్రివర్గం జూలైలో 1,27,500 కోట్ల వ్యయంతో సెమికాన్ 2.0కి ఆమోదం తెలిపింది. మొదటి దశలో సాధించిన ఊపును కొనసాగిస్తూ ఈ కార్యక్రమం రూపొందించబడింది. మొదటి దశ కింద 1.64లక్ష కోట్లకు పైగా పెట్టుబడులతో 12 సెమీకండక్టర్ ప్రాజెక్ట్‌లకు ఆమోదం లభించింది. వీటిలో మైక్రాన్, కేయెన్స్, సీజీ సెమీలతో సహా 5 ప్రాజెక్టులు ఇప్పటికే వాణిజ్య ఉత్పత్తిలో ఉన్నాయి. భారతదేశ ం చిప్ తయారీ ప్రయత్నం, ప్యాకేజింగ్‌కు అతీతంగా వెళ్లి విస్తృతమైన దేశీయ సరఫరా గొలుసును నిర్మించడంలో ఒక సాహసోపేతమైన ప్రణాళిక సూచిస్తుంది. అదే సమయంలో, భారతదేశంలో సెమీకండక్టర్ పరికరాలను తయారు చేయడానికి, అభివృద్ధి చేయడానికి ప్రపంచ కంపెనీలను ఆకర్షించడం కూడా దీని లక్ష్యం. సెమీ కండక్టర్ పథకం రెండవ దశ కింద సుమారు రూ.1లక్ష కోట్ల పెట్టుబడి హామీలు అందినట్లు ప్రభుత్వం ఇటీవల తెలిపింది. ఇప్పటికే ముగిసిన కార్యక్రమంలో పెట్టుబడిదారుల ఆసక్తి పూర్తి స్థాయిలో కేంద్రీకృతమై ఉంది. దేశ చిప్ తయారీ రంగానికి ఒక భారీ ప్రదర్శన వేదిక అయిన సెమికాన్ ఇండియా ఈవెంట్‌లో 2035వరకు అప్లైడ్ మెటీరియల్స్ సంబంధిత బిలియన్ డాలర్ల ఇండియా ప్రణాళిక, లామ్ రీసెర్చ్ సంబంధిత రూ.10,000 కోట్ల పెట్టుబడి ప్రతిపాదన, ధోలేరాలో టాటా ఎలక్ట్రానిక్స్ యొక్క 363ఎకరాల వెండర్ పార్క్, ఫ్యూజిపార్క్‌కు సంబంధించిన రూ.800 కోట్ల సెమీకండక్టర్ మెటీరియల్స్ ప్లాంట్‌తో సహా పలు భారీ ప్రకటనలు వెలువడ్డాయి.

ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్

# పాయల్ మెహతా కన్నుమూత

ప్రధాని మోదీ, అమిత్‌షా, రాహుల్‌గాంధీ, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా సంతాపం



**న్యూఢిల్లీ :** ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ పాయల్ మెహతా ఆదివారం తెల్లవారుజామున ముంబైలో కన్నుమూశారు. 46 ఏళ్ల మెహతా ముంబైలో పర్యటనలో ఉన్నప్పుడు ఆమెకు అనారోగ్య సమస్యలు తలెత్తి, అస్వస్థతకు గురయ్యారు. ఉదయాన్నే అస్వస్థతకు గురవడంతో ఆమెను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె కొద్దిసేపటి తర్వాత మరణించారు. పాయల్ మెహతా మృతిపట్ల ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వ శర్మ, ఇతర కేంద్ర మంత్రులు పాయల్ మెహతా మృతిపట్ల సంతాపం తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ షీలా భట్ తన 'ఎక్స్' పోస్ట్‌లో మాట్లాడుతూ ఆమె ముంబై పర్యటనలో ఉన్నప్పుడు అస్వస్థతకు గురయ్యారు. తెల్లవారుజామున సుమారు రెండు గంటలకు అస్వస్థతకు గురైన మెహతాను ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమెకు చికిత్స అందించే లోపే ఆమె నాడి ఆగిపోయింది'. పాయల్ మెహతా పార్లమెంట్, ప్రభుత్వం, భారతీయ జనతా పార్టీ (బిజెపి) వార్తలు రాయడంలో ప్రసిద్ధి చెందారు. 'పాయల్ మెహతా జీ క్షేత్ర స్థాయికి గట్టి సంబంధాన్ని కలిగి ఉండి, జాతీయ సమస్యలపై లోతైన అవగాహనను తన రిపోర్టింగ్‌కు తీసుకొచ్చిన ఒక కష్టపడిచేసే జర్నలిస్ట్ అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆమె చేసిన పనికి అతీతంగా, ఆమె ఎందరో జీవితాలను స్పృశించిన దయ, ఆప్యాయతకు మెహతా గుర్తుండిపోతారని ప్రధాని నొక్కిచెప్పారు. ఆమె ఆకస్మిక మరణం చాలా విచారకరం. ఆమె కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, సహోద్యోగులకు నా ప్రగాఢ సానుభూతి.ఈ కష్ట సమయంలో వారు మనోధైర్యం పొందాలని కోరుకుంటున్నాను. 'ఓంశాంతి' అని ఆయన అన్నారు. వివిధ సమస్యలపై సవివరమైన సమాచారాన్ని అందించడానికి కట్టుబడి ఉన్న నిష్ణాతురాలైన, వృత్తి నిపుణులుగా పాయల్‌మెహతాను ప్రశంసించారు. ఇంతటి ప్రతిభావంతురాలైన పాత్రికేయురాలైన మెహతా మరణం పాత్రికేయ రంగానికి పూడ్చలేని నష్టమని అమిత్‌షా వ్యాఖ్యానించారు. మెహతా మరణ వార్త విన్న రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.'ఆమె మనల్ని చాలా త్వరగా విడిచివెళ్లిపోయారు. పాయల్ ఎంతో కష్టపడి పనిచేసే,అంకితభావం కలిగిన జర్నలిస్ట్ అని, ఆమె పార్లమెంట్ బీట్‌ను గొప్ప నిబద్ధతతో, వృత్తి నైపుణ్యంతో కవర్ చేశారు' అని రాజ్‌నాథ్‌సింగ్ కీర్తించారు. మెహతా ప్రజా వ్యవహారాలపై లోతైన అవగాహన ఉన్న కష్టపడి పనిచేసే, శ్రద్ధగల పాత్రికేయురాలు' అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే ఆమె మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. మెహతా మరణం పట్ల కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ కూడా విచారం వ్యక్తం చేశారు. 'ఆమె కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహోద్యోగులకు నా ప్రగాఢ సానుభూతి' అని ఆయన రాహుల్‌గాంధీ అన్నారు. మెహతా మరణం పాత్రికేయ రంగానికి తీరని లోటు అని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అన్నారు. పాయల్ మెహతా మరణ వార్త విని తాను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. పాయల్ మెహతా 'చాలా కష్టపడి పనిచేసే జర్నలిస్ట్' అని, ఆమె మరణవార్త విని తాను ది గ్భ్రాంతికి గురయ్యానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫఢ్నవీస్ పేర్కొన్నారు.అస్సాం ముఖ్యమంత్రి హేమంత బిశ్వ శర్మ కూడా సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

హాస్టళ్లలో విద్యార్థునుల సమస్యలపై

# మీ వివరణ ఏమిటి?

ప్రధాని మోదీని నిలదీసిన రాహుల్‌గాంధీ




**న్యూఢిల్లీ :** విద్యార్థునులకు హాస్టళ్ల సమస్యపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ నరేంద్ర మోదీ సర్కార్‌పై విరుచుకుపడ్డారు. ఈ సమస్యపై ప్రధాన మంత్రి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాన్ని నిలదీయడానికి, శనివారం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన తన 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమంలో ఒక విద్యార్థిని చేసిన వ్యాఖ్యలను రాహుల్‌గాంధీ ఉటంకించారు. 'దీపాలు వెలిగించడానికి ప్రభుత్వం దగ్గర డబ్బు ఉంది. మరి మా హాస్టళ్లకు ఎందుకు లేదు?' అని ఇండోర్‌లో ఒక విద్యార్థిని నన్ను అడిగింది. ఆమె చదువుకోవడానికి పల్లెటూరు నుంచి నగరానికి వచ్చింది అని ఆ సంభాషణను రాహుల్‌గాంధీ గుర్తుచేసుకున్నారు. 'హాస్టల్ లేదు, అందుకే ఆమె పిజిలో ఉండాల్సి వస్తోంది. సురక్షితంగా ఉండటానికే లక్షల రూపాయలు ఖర్చు అవుతోంది. నెలసరి అద్దె గురించిన ఆందోళన, నిరాశ్రయురాలినవుతామనే భయం వీటన్నిటి మధ్య ఆమె చదువుకోవాల్సి వస్తోంది' అని గాంధీ తన హిందీ పోస్ట్‌లో పేర్కొన్నారు. నివసించడానికి చోటు లేకపోవడం వల్లే చాలా మంది అమ్మాయిలు చదువు మానేస్తున్నారని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు అన్నారు. 'మరి గృహ భత్యం సంగతేంటి? అది ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పెరగదు, దానికి తోడు అవినీతికి బలి అవుతుంది. నరేంద్ర మోదీ జీ ఆ చిన్నారి ప్రశ్నకు మీ దగ్గర ఏమైనా సమాధానం ఉందా?' అని గాంధీ నిలదీశారు. రాహుల్‌గాంధీ పోస్ట్‌ను ట్యాగ్ చేస్తూ, కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా స్పందించారు. 'పిఆర్ కార్యక్రమాలు. డిజైనర్ దుస్తులు. విలాసవంతమైన కార్లు. విమానాలు. చర్మ సంరక్షణ ఇలా భారతదేశ యువత విద్య తప్ప మిగతా అన్నింటికీ మోదీ వద్ద డబ్బు ఉంది. తగిన మౌలిక సదుపాయాలు లేవు. నాణ్యమైన ఉపాధ్యాయులు లేరు. శిక్షణ లేదు. హాస్టళ్లు లేవు. ఉద్యోగాలు లేవు. ఈ దశలో, ఆయన డిగ్రీ ప్రామాణికత దాదాపు అప్రస్తుతం. విద్య పట్ల ఆయనకున్న ధిక్కార భావమే ఆయన ఎంత విద్యావంతుడో వివరిస్తుంది' అని ఎద్దేవా చేశారు. విద్యారంగంలో కుళ్ళిపోయిన వ్యవస్థ దేశాన్ని ఆవహించిందని, విద్యార్థులు ప్రశ్నలు అడగడాన్ని ఆ వ్యవస్థకు నచ్చడం లేదని, బదులుగా అంధభక్తులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మద్దతుదారులనుద్దేశించి విమర్శకులు సాధారణంగా ఉపయోగించే పదం తమ వాదనను, ద్వేషాన్ని వ్యాప్తి చేయాలని కోరుకుంటోంది' అని అన్నారు. 'వ్యవస్థ'కు అనేక పొరలు ఉన్నాయని ఆరోపించారు. దేశ రాజకీయ, సంస్థాగత, ఆర్థిక జీవితంలోని వివిధ అంశాలపై ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ఆర్ఎస్ఎస్ అధిపతి మోహన్ భగవత్, పారిశ్రామికవేత్తలు గౌతమ్ అదానీ, ముఖేష్ అంబానీలు నియంత్రణను కలిగి ఉన్నారని ఆయన ఆరోపించారు. విద్యార్థులు జిజ్ఞాసతో ఉంటూ, తమ చుట్టూ ఏమి జరుగుతుందో ప్రశ్నిస్తారు కాబట్టే ఈ వ్యవస్థకు సవాలుగా నిలుస్తున్నారని రాహుల్ అన్నారు.

# 'షా ఇన్‌స్టిగేటెడ్ రిమూవల్'

- 'సర్'కు కొత్త అర్థం చెప్పిన కాంగ్రెస్
- ఈ చర్య రాజ్యాంగంపై దాడి అని మండిపాటు



**న్యూఢిల్లీ :** ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితాల 'ప్రత్యేక సమగ్ర సవరణ' (సర్) ప్రక్రియలో పెద్ద ఎత్తున పేర్ల తొలగింపు జరుగుతోందని కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇది వాస్తవానికి 'షా (అమిత్ షా) ప్రేరేపిత ఓటర్ల తొలగింపు' (షా ఇన్‌స్టిగేటెడ్ రిమూవల్) అని, ఇది 'రాజ్యాంగంపై దాడి' అని ఆ పార్టీ ఆరోపించింది. వివిధ రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున తొలగించబడిన ఓటర్ల పేర్లు ప్రధానంగా ఆర్థికంగా, సామాజికంగా అత్యంత వెనుకబడిన, అణగారిన వర్గాలకు చెందినవేనని నిరూపించడానికి తగిన ఆధారాలు ఉన్నాయని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) జూన్ 2025లో బిహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ మొదటి దశను ప్రారంభించిందని, ఆ తర్వాత నవంబర్ 2025లో తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో (యుటిలు) రెండవ దశను చేపట్టిందని తెలిపారు. మొదటి, రెండవ దశలలో మొత్తం 7.8 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయని రమేశ్ పేర్కొన్నారు. సర్ ప్రక్రియకు ముందు ఉన్న ఓటర్ల జాబితాతో పోలిస్తే, ఈ తొలగింపు రేటు 13 శాతంగా ఉందని ఆయన చెప్పారు. 2026 మధ్యకాలంలో 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో మూడవ దశ ప్రారంభమైందని ఆయన తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న మూడవ దశలో, 12 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన గణాంకాల ప్రకారం, మొత్తం 36.06 కోట్ల మంది ఓటర్లలో 6.18 కోట్ల మంది పేర్లు తొలగించబడ్డాయని రమేశ్ ఎత్తిచూపారు. 'తొలగింపు రేటు 17 శాతానికి పైగా ఉంది. అదనంగా, మరో 5.43 కోట్ల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసి, ఓటర్ల జాబితాలో వారి పేర్లను కొనసాగించడానికి అదనపు పత్రాలను సమర్పించాలని కోరారు. దీనివల్ల పేర్లు తొలగించబడే ప్రమాదం మరో 15 శాతం వరకు ఉంది. ఇది అసాధారణంగా అధిక నిష్పత్తి, ఇది మొత్తం సర్ ప్రక్రియలోని నిర్మాణాత్మక లోపాలను ప్రతిబింబిస్తుంది' అని రమేశ్ అన్నారు.

ఇంత భారీ స్థాయిలో పేర్ల తొలగింపు జరిగిన తర్వాత కూడా, ఇంకా 'ధృవీకరణ' అవసరమైన ఓటర్లు ఇంత పెద్ద సంఖ్యలో ఎలా ఉంటారని ఆయన ప్రశ్నించారు. 'దీనివల్ల, భారీ సంఖ్యలో అంటే 32% మంది (లేదా దాదాపు ప్రతి ముగ్గురు ఓటర్లలో ఒకరు) ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయి లేదా తొలగింపు ముప్పును ఎదుర్కొంటున్నారు. ఈ విషయంలో రాష్ట్రాల వారీగా పరిస్థితిని పరిశీలిస్తే.. ఢిల్లీ 53.73%, చండీగఢ్ 52.58% , జార్ఖండ్ 39.57% , ఉత్తరాఖండ్ 35.71% , మేఘాలయ 35.36% , మహారాష్ట్ర (33.88% , తెలంగాణ 48.90% , కర్ణాటక 27.6% , హర్యానా 37.5%, ఒడిశా 23.67% , ఆంధ్రప్రదేశ్ 21.17% , పంజాబ్ 15.23%గా ఉంది. కర్ణాటక, తెలంగాణ, జార్ఖండ్‌లలో తొలగింపు ముప్పును ఎదుర్కొంటున్న ఓటర్ల జాబితాను బహిరంగంగా అందుబాటులో ఉంచారు, తద్వారా ఓటర్లు తమ పేర్లు అందులో ఉన్నాయో లేదో సరిచూసుకోవచ్చు. ఢిల్లీ ఈ జాబితాను సెప్టెంబర్ 19, 2026న మాత్రమే బహిరంగంగా అందుబాటులో ఉంచింది, అదీ ప్రజల ఒత్తిడి మేరకు మాత్రమే అని విమర్శించారు. ఇతర బిజెపి పాలిత రాష్ట్రాలు, పంజాబ్ ఇప్పటివరకు అలా చేయలేదన్నారు. వివిధ రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున జరిగిన ఈ తొలగింపులు ప్రధానంగా మన సమాజంలోని అత్యంత ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన, అణగారిన వర్గాలకు చెందిన ఓటర్లవేనని నిరూపించడానికి తగినన్ని ఆధారాలు ఉన్నాయని రమేశ్ ఆరోపించారు. చాలా ప్రధాన రాష్ట్రాల్లో, సర్ ప్రక్రియ సమయంలో పురుషుల కంటే ఎక్కువ మంది మహిళల పేర్లు ఓటర్ల జాబితా నుండి తొలగించబడ్డాయని ఆయన పేర్కొన్నారు. 'సర్' అనేది వాస్తవానికి 'షా ప్రేరేపిత ఓటర్ల తొలగింపు'గా రమేశ్ అభివర్ణించారు. ఇది మన రాజ్యాంగంపై దాడి అని హోం మంత్రి అమిత్ షాను ఉద్దేశించి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అన్నారు.

# మణిపూర్‌లో మళ్లీ హింస



**ఇంఫాల్ :** మణిపూర్‌లో మరోసారి హింసాత్మక ఘటనలు చెలరేగాయి. భద్రతా దళాలు ఆరుగురు గ్రామస్థులను నిర్బంధించాయన్న ఆరోపణలపై మణిపూర్‌లోని కాంగ్‌పోక్పి జిల్లాలో కుకీ వర్గానికి చెందిన కొందరు హింసాత్మక నిరసనలకు దిగారని అధికారులు తెలిపారు. మోట్‌బంగ్, ఇతర సమీప ప్రాంతాలలో శనివారం రాత్రి 10 గంటల నుండి అర్ధరాత్రి వరకు ఈ నిరసనలు కొనసాగాయని, ఈ సమయంలో ఆందోళనకారులు రోడ్లపై టైర్లను తగలబెట్టి, ప్రభుత్వ వాహనాలపై రాళ్లు రువ్వారని వారు చెప్పారు. ఖోలెన్‌కు చెందిన ఆరుగురు గ్రామస్థులను ఎటువంటి కారణం చెప్పకుండా భద్రతా దళాలు నిర్బంధించాయని ఆందోళనకారులు ఆరోపించారు. జిల్లాలోని నాగాల ప్రాబల్యం ఉన్న చవాంగ్‌కినింగ్ గ్రామానికి సమీపంలో ఉన్న ఖోలెన్‌పై ఇటీవల సాయుధ దుండగులు దాడి చేశారు. నిరసనకారులను చెదరగొట్టడానికి భద్రతా దళాలు పలు దఫాలుగా బాష్పవాయువును ప్రయోగించాయని, అంతేకాకుండా భద్రతా దళాల వాహనాల రాకపోకలను నిరోధించడానికి మోట్‌బంగ్ వద్ద భారీ నిర్మాణ యంత్రాలను ఉపయోగించి జాతీయ రహదారి2 (ఇంఫాల్ నుండి దిమాపూర్)లోని కొన్ని భాగాలను తవ్వారని అధికారులు తెలిపారు. ప్రదర్శనల సందర్భంగా కొందరు ఆందోళనకారులు గాయపడ్డారని, వారిని స్థానిక ఆసుపత్రిలో చేర్చారని వారు తెలిపారు. అదుపులోకి తీసుకున్న గ్రామ వలంటీర్లను భద్రతా దళాలు విడుదల చేయడంతో నిరసనలు సద్దుమణిగాయని ఒక సీనియర్ అధికారి తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని ఆయన తెలిపారు.

# అద్వానీ, సిసోడియాకు ఎన్నికల సంఘం నోటీసులు



**న్యూఢిల్లీ :** 'సర్' (ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియలో భాగంగా ఢిల్లీలో మాజీ ఉప ప్రధాని ఎల్.కె. అద్వానీ, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా వంటి ప్రముఖులకు నోటీసులు జారీ అయ్యాయి. ఓటర్ల సమర్పించిన వివరాలలో అసమానతలు ఉన్నందున 33 లక్షల మందికి ఎన్నికల సంఘం నోటీసులను ఇచ్చింది. 98 ఏళ్ల అద్వానీ, ఆయన కుమార్తె ప్రతిభ, కోడలు గీతికల పేర్లను 2002 నాటి ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ఓటర్ల జాబితాతో సరిపోల్చలేకపోవడంతో వారికి నోటీసులు జారీ చేశారు. అయితే ఆయన కుమారుడు జయంత్ విషయంలో ఈ సరిపోలిక ప్రక్రియ విజయవంతం కావడం విశేషం. వీరంతా న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్లు. సిసోడియా, ఆయన భార్య సీమ, కుమారుడు మీర్‌లకు కూడా నోటీసులు జారీ అయ్యాయి. సిసోడియాకు నోటీసు పంపడానికి ఎన్నికల సంఘం నిర్దిష్ట కారణమేదీ పేర్కొననప్పటికీ, మీర్ విషయంలో 'తల్లిదండ్రుల పేర్లలో అసమానత' ఉన్నట్లు నోటీసులో సూచించారని అధికారులు తెలిపారు. ఆయన భార్య సీమ నోటీసులో 'ఆమె పేరులో వ్యత్యాసం' ఉన్నట్లు పేర్కొన్నారు. ఓటర్లు తమ వివరాల సేకరణ (ఎన్యూమరేషన్) ఫారమ్‌లలో అందించిన వివరాలలో 'తార్కిక అసమానతలు' ఉండటం వల్లే ఈ నోటీసులు జారీ అయ్యాయని ఒక సీనియర్ ఎన్నికల అధికారి తెలిపారు. నోటీసులు అందుకున్న 33.13 లక్షల మంది ఓటర్ల జాబితాలో అద్వానీ, సిసోడియాల పేర్లు ఉన్నాయని ధృవీకరిస్తూ, 'ఆయా ఓటర్లు సమర్పించే పత్రాలు, వాస్తవాల పరిశీలన ప్రక్రియ పూర్తయ్యాక వారి పేర్లు తుది ఓటర్ల జాబితాలో చేర్చబడతాయి' అని ఆయన చెప్పారు. వాస్తవాలు, పత్రాల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోందని, దానికి అనుగుణంగా వివరాల ధృవీకరణ జరుగుతోందని ఆయన తెలిపారు. 'సర్' కింద ఉన్నత స్థాయి ప్రభుత్వ అధికారులు, బ్యూరోక్రాట్లు, రాజకీయ నాయకులతో సహా అనేకమంది ప్రముఖ ఓటర్లకు నోటీసులు జారీ చేయబడ్డాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, మాజీ కేంద్రమంత్రి కపిల్ సిబల్‌లకు కూడా ఇలాంటి కారణాలతోనే నోటీసులు జారీ అయ్యాయని అధికారులు తెలిపారు. ముసాయిదా జాబితాలలో పేర్లు ఉన్న సుమారు 97 లక్షల ఓటర్లలో, వారి గణన పత్రాలలో వ్యత్యాసాలు ఉన్నందున 33.13 లక్షల మందికి నోటీసులు జారీ చేయాలని గుర్తించారు. ఇప్పటివరకు 31.63 లక్షలకు పైగా నోటీసులు జారీ చేయబడ్డాయి.

చెల్లుబాటు ఓట్లు ముమ్మరంగా తొలగింపు,

# చెల్లని ఓట్లు వేగంగా చేర్పు

'సర్' ప్రక్రియపై కపిల్ సిబల్ ఆగ్రహం



**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ ఆదివారం ఎన్నికల సంఘంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చెల్లుబాటు అయ్యే ఓట్లను తొలగించడానికి 'ప్రత్యేక ముమ్మర తొలగింపు', చెల్లని ఓట్లను చేర్చడానికి 'ప్రత్యేక ముమ్మర చేర్పు' అని ఆయన విమర్శించారు. బిజెపిని అధికారంలో ఉంచడమే ఎన్నికల సంఘం ఉద్దేశం అయితే, ఇక ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రయోజనం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఓటర్ల జాబితా 'ప్రత్యేక ముమ్మర సవరణ' (సర్) ప్రక్రియలో భాగంగా, 'గత సర్‌తో సరిపోలనివి' అనే వర్గంలో తనకు, తన భార్యకు నోటీసులు జారీ అయిన తర్వాత సిబల్ ఈ వ్యాఖ్యలు చేశారు.

తనలాంటి వారికే ఇలా జరుగుతుంటే, ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటి, వారు దీన్నంతా ఎలా ఎదుర్కోగలరో ఊహించుకోవచ్చని మాజీ కేంద్ర మంత్రి అన్నారు.

ఆదివారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిబల్ మాట్లాడారు. 'ఆ వ్యక్తి (ప్రధాన ఎన్నికల కమిషనర్) జ్ఞానేష్ కుమార్ ఆ కుర్చీలో ఎందుకు కూర్చున్నారు? ఏ ప్రాతిపదికన ఆయన ఇలా చేస్తున్నారు, ఆయనను ఇలా ఎందుకు చేయనిస్తున్నారు?' అని ప్రశ్నించారు. ముసాయిదా జాబితాలో తన పేరు ఉన్నప్పటికీ తనకు నోటీసు రావడం చూసి తాను దిగ్భ్రాంతికి గురయ్యానని సిబల్ చెప్పారు. ప్రస్తుత ఓటర్ల జాబితాలో ఉన్న తన తండ్రి/తన పేర్లకు, గత సర్ సమయంలో రూపొందించిన ఓటర్ల జాబితాలోని పేర్లకు మధ్య వ్యత్యాసం ఉందని ఆ నోటీసులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. 'ఎవరికి నోటీసు పంపాలి, ఎవరికి పంపకూడదు అనే కనీస విచక్షణ లేకుండా ఎన్నికల సంఘం వ్యవహరిస్తోంది. ప్రజా జీవితంలో ఉన్న మాకే ఇలా జరిగితే, ఇక సామాన్యుడి పరిస్థితి ఏమిటి? వారు దీన్నంతా ఎలా ఎదుర్కోగలరు?' అని స్వతంత్ర రాజ్యసభ ఎంపి అన్నారు. 'ఈ రోజు వరకు, నాకు పంపిన నోటీసు భౌతిక ప్రతి నాకు అందలేదు. నా దగ్గర ఆ కాపీ లేదు; అది ఇక్కడ అందజేయబడలేదు, నా కార్యాలయంలోనూ లేదు. ఒకవేళ నాకు దీని గురించి తెలియకపోతే, వారు ఇలాంటి నోటీసులే పంపి నా పేరును తొలగించేవారు; అప్పుడు నేను సుప్రీంకోర్టులో పిటిషన్ వేసి 'దయచేసి నా పేరును తొలగించవద్దు' అని చెప్పాల్సి వచ్చేది. ఈ దేశంలో ఏం జరుగుతోంది?' అని సిబల్ అన్నారు. 'ఇది ఎలాంటి ప్రత్యేక ముమ్మర సవరణ? ప్రత్యేక ముమ్మర తొలగింపు, ప్రత్యేక ముమ్మర చేర్పు అంటే చెల్లుబాటు అయ్యే ఓట్లను తొలగించడం, చెల్లని ఓట్లను చేర్చడం. ఇదంతా అదే కదా' అని ఆయన అన్నారు. 'ఒకవేళ మీరు బిజెపిని అధికారంలోకి తీసుకురావాలనుకుంటే, ఇక ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రయోజనం ఏమిటి?' అని సిబల్ ప్రశ్నించారు. అక్రమ లేదా కల్పిత ఓటర్లను జాబితాలో చేర్చడం, అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించడం వంటి పనులు 'ప్రత్యేక సమగ్ర సవరణ' ప్రక్రియలో భాగంగా జరుగుతున్నాయని సిబల్ ఆరోపించారు.

# యుపిలో 151 చోట్ల అంబేద్కర్ విగ్రహాలు ధ్వంసం

బిజెపి పాలనలో కేవలం 14 అరెస్టులే : ఎస్‌పి చీఫ్ అఖిలేశ్



**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లో అంబేద్కర్ విగ్రహాల కూల్చివేతపై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ బిజెపి సర్కార్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కాషాయ పార్టీ పాలనలో 72 జిల్లాల్లో బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ విగ్రహాలు 151 చోట్ల ధ్వంసం కాగా, ఇప్పటివరకు కేవలం 14 అరెస్టులు మాత్రమే జరిగాయన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని బిజెపి భావించినప్పటికీ అందులో విఫలమైనందుకే ఈ విధ్వంసకాండ ఉద్దేశపూర్వకంగా జరిగిందని ఆయన ఆరోపించారు. 'బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ విగ్రహాలే అత్యధికంగా ధ్వంసం చేయబడ్డాయి. బిజెపి ప్రభుత్వ హయాంలో 72 జిల్లాల్లో 151కి పైగా (అంబేద్కర్) విగ్రహాలు ధ్వంసం లేదా కూల్చివేశారు' అని ఆదివారం లక్నోలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ యాదవ్ చెప్పారు. బిజెపి, దాని భావజాలం కలిగిన వారు దాడి చేసిన పుడల్లా, మొదటగా లక్ష్యంగా చేసుకునేది చేతిలో ఉండే రాజ్యాంగ ప్రతిని అని ఆయన అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ మొత్తం 151 కేసులను నమోదు (డాక్యుమెంట్) చేయగలిగిందని ఆయన తెలిపారు. 'మొత్తంగా మేము 151 కేసులను నమోదు చేయగలిగాము. సగటున లెక్కించి చూస్తే, ఈ ప్రభుత్వ హయాంలో ఏటా 15కి పైగా విగ్రహాలు ధ్వంసం చేయబడ్డాయి. అత్యధిక ఘటనలు బల్లియాలో జరిగాయి, ఆ తర్వాత ఆజమ్‌గఢ్, మథురలో జరిగాయి. గోరఖ్‌పూర్‌లో కూడా విగ్రహాలు ధ్వంసం చేయబడ్డాయి. నమోదు కాని, లెక్కలోకి రాని కేసులు కూడా ఉండవచ్చు' అని ఆయన అన్నారు. ప్రభుత్వ గణాంకాలను ఉటంకిస్తూ, కేవలం 14 కేసుల్లో మాత్రమే అరెస్టులు జరిగాయని యాదవ్ చెప్పారు. 45 ఘటనల్లో గుర్తు తెలియని వ్యక్తులపై కేసులు నమోదయ్యాయి. ఎనిమిది సందర్భాల్లో నిర్దిష్ట వ్యక్తుల పేర్లతో ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. 84 కేసుల్లో ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. బిజెపి ప్రభుత్వం అంబేద్కర్ పట్ల గానీ, ఆయన విగ్రహాల పట్ల గానీ, లేదా ఆయన అనుచరుల పట్ల గానీ గౌరవం చూపదని యాదవ్ ఆరోపించారు.

ఇండియా కూటమి 'బలోపేతానికి'..

# 'అస్త్రం'గా నందిగ్రామ్ ఉప ఎన్నిక

టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ కాంగ్రెస్‌కు మద్దతు-బిజెపికి 'చెక్' ప్రయత్నం

**కోల్‌కతా :** జాతీయ స్థాయిలో బిజెపి దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకు పశ్చిమ బెంగాల్ నుంచే మోదీ ప్రభుత్వానికి ఒక గట్టి షాక్ ఇచ్చేందుకు మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ త్వరలో జరుగబోయే నందిగ్రామ్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరుగనున్న ఉప ఎన్నిక సందర్భంగా సంకేతాలు పంపుతున్నారు. నందిగ్రామ్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మమతా బెనర్జీ మద్దతు తెలపడం, దశాబ్దాల నాటి రాజకీయ వైరుధ్యానికి భిన్నమైన పరిణామమని పరిశీలకులు భావిస్తున్నారు. తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో, పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో ప్రతిపక్ష రాజకీయాల పున: సమీకరణకు ఇది సంకేతంగా నిలుస్తోంది. కోల్‌కతాలో ముఖ్యమంత్రి సువేందు అధికారితో సమావేశమైన తర్వాత, తన వర్గానికి చెందిన అభ్యర్థి సంచితా ప్రధాన్ డే అక్టోబరు 6 నాటి పోటీ నుంచి తప్పుకున్న కొన్నిగంటలకే, మిలన్ ప్రధాన్‌కు మద్దతు ఇవ్వాలని మమతా బెనర్జీ నిర్ణయించారు. ఈలోగా, పార్టీ అంతర్గత వివాదం నేపథ్యంలో, నందిగ్రామ్, రేజినగర్‌లో జరగబోయే ఉప ఎన్నికల కోసం ఎన్నికల సంఘం తృణమూల్ కాంగ్రెస్ సాంప్రదాయ నామాన్ని, 'జోరా ఘాష్ ఫుల్' గుర్తును నిలిపివేసి, మమతా బెనర్జీ వర్గానికి, ఆమె అసమ్మతివాదులకు వేర్వేరు పేర్లు, గుర్తులను కేటాయించింది. సెప్టెంబరు 18న ప్రధాన్‌కు మద్దతు ప్రకటిస్తూ, మమతా బెనర్జీ కాంగ్రెస్‌ను 'సోదర పార్టీ'గా, 'సహజ మిత్ర పక్షంగా' అభివర్ణించారు. ఆమె మాట్లాడుతూ దేశ విస్తృత ప్రయోజనాలను పరిగణనలోనికి తీసుకుని, ఇండియా కూటమిని బలోపేతం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె చెప్పారు. ప్రతిపక్ష కూటమి భవిష్యత్తు గురించి బెంగాల్ నుంచే ఒక సందేశం పంపాలని అనుకుంటున్నట్లు బెనర్జీ తెలిపారు. అయితే, ఈ రాజీ ప్రతిపాదన చేసిన సమయం ఈ చర్యకు స్పష్టమైన, వ్యూహాత్మక కోణాన్ని ఇస్తుంది. మమతా బెనర్జీ వర్గం బెంగాల్‌లో మొదట ఒక అభ్యర్థిని నిలబెట్టింది. కానీ ఆ నామినీ వైదొలగిన తర్వాతే పోటీ నుంచి వైదొలగింది. అందువల్ల, ఆమె కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడం అనేది, బిజెపి వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా నిరోధించే ప్రయత్నంతో పాటు, తన వర్గానికి ఎదురవుతున్న అసాధారణమైన క్లిష్ట పరిస్థితికి రాజకీయ ప్రతిస్పందనగా కూడా ఇది నిలుస్తుందని పరిశీలకులు అంటున్నారు. 2007లో నందిగ్రామ్ భూమికి సంబంధించిన కేసులో ప్రధాన్‌ను అరెస్ట్ చేసిన తర్వాత ఈ పరిణామం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. మమతా బెనర్జీ ప్రకటన వెలువడిన కొద్ది సేపటికే జరిగిన ఆందోళనలో పాల్గొని జైలుపాలయ్యారు. అయితే, ఇందులోని వైరుద్ధ్యాన్ని గమనించలేం. మమతా బెనర్జీ స్వయంగా కాంగ్రెస్ పార్టీ నుంచే ఉద్భవించారు. 1990ల చివరిలో, ఆ పార్టీ నుంచి విడిపోయి లెఫ్ట్ ఫ్రంట్‌ను, అలాగే, సిపిఐ(ఎం) పార్టీకి కాంగ్రెస మద్దతు ఇవ్వడం ఆమె భావించిన దాన్ని సవాల్ చేసే సాధనంగా టిఎంసిని స్థాపించారు. అయినప్పటికీ, ఒక పెద్ద రాజకీయ ప్రత్యర్థిని ఎదుర్కొనేటప్పుడు , ఈరెండు పార్టీలు కాలానుగుణఃగా ఒకదానికొకటి తిరిగి చేతులు కలుపుకుంటూనే ఉన్నాయి. మమతా బెనర్జీ ఎన్‌డిఏతో సంబంధాలు తెంచుకున్న తర్వాత, వారు 2001 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలలో కలిసి పోరాడారు. ఆపై 2009 లోక్‌సభ ఎన్నికల సమయంలో మళ్లీ చేతులు కలిపారు. 2011లో కాంగ్రెస్, టిఎంసిలు సంయుక్తంగా పశ్చిమబెంగాల్‌లో లెఫ్ట్ ఫ్రంట్ యొక్క 34ఏళ్ల పాలనకు ముగింపు పలకడంతో ఈ కూటమి అత్యున్నత స్థాయికి చేరుకుంది. అయితే, విధానపరమైన అంశాలు, సీట్ల పంపకం, రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై విభేదాలు తీవ్రతర ం కావడంతో, ఆ భాగస్వామ్యం తదనంతరం కుప్పకూలింది. మమతా బెనర్జీ 15ఏళ్ల పాలనలో ఈ సంబంధం మరింత తీవ్రమైంది. తమ సంస్థను రాజకీయంగా అణచివేస్తోందని కాంగ్రెస్ నాయకులు తృణమూల్ కాంగ్రెస్‌పై పదేపదే ఆరోపించగా, కాంగ్రెస్‌ను ఒక అసమర్థ శక్తిగా, దాని పతనం బిజెపి, వామపక్షాలకు ప్రయోజనం చేకూర్చిందని తృణమూల్ కాంగ్రెస్ చిత్రీకరించింది.



## జిన్‌పింగ్‌కు ట్రంప్ ఎర్ర తివాచీ

### వచ్చే గురువారం విందుకు ఏర్పాట్లు

**వాషింగ్టన్:** ప్రపంచం కీలక దశలో ఉన్న తరుణంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అమెరికాలో పర్యటనకు సిద్ధమయ్యారు. రష్యాను ఆర్థికంగా దెబ్బతీసేందుకు ఆంక్షల బిల్లు ఆమోదించిన వారం రోజుల తర్వాత జిన్‌పింగ్ అమెరికాలో పర్యటించనున్నారు.ఈ ఆంక్షల చట్టం ప్రధానంగా చైనాను ఉద్దేశించినదే కావడంతో ట్రంప్–జిన్‌పింగ్ శిఖరాగ్ర సమావేశం మరింత ప్రాముఖ్యత సంతరించుకుంది. ట్రంప్ ఎన్ని విమర్శలు చేసినప్పటికీ, చైనా చాలా సాత్వికంగానే స్పందిస్తూ వచ్చింది.గత అధ్యక్షుడు జో బైడెన్ మూడుసార్లు జిన్‌పింగ్‌ను కలిశారు. ట్రంప్ కూడా చైనాను సందర్శించి ఇప్పుడు జిన్‌పింగ్‌ను అమెరికా రప్పించడం ద్వారా పరస్పర ఆదాన ప్రదానాలు సాధించారు. రెండు అగ్రదేశాల నాయకులు సౌకర్యవంతమైన పద్ధతులలో కమ్యూనికేషన్స్ కొనసాగిస్తున్నారనడానికి ఇదొక సంకేతం.

ట్రంప్ ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తారో తెలియదు. ఆయన గాంభీర్యంగా మాట్లాడతారు. చాలా సందర్భాలలో వెనక్కి జారిపోతారు.ఇరాన్ విషయంలో పదే పదే ఇలాంటి ఆయన ప్రవర్తన అమెరికా వైభవం కోల్పోయిందనే భావనకు దారితీశాయి.చైనా వల్ల అమెరికా పరిశ్రమలు నాశనమయ్యాయని,ఆమెరికా ఆర్థిక వ్యవస్థకు చైనా పెద్ద శత్రువు అని ప్రకటించిన తర్వాత ట్రంప్ అధికారంలోకి వచ్చారు. చైనాపై సుంకాల ద్వారా ప్రతీకారం తీర్చుకునే ప్రయత్నం చేశారు. చైనా కూడా దీటుగా ఎదురు నిలబడింది. ప్రతీకార సుంకాలు విధించింది. కృత్రిమ మేధ విషయంలోనూ చైనా ముందంజలోనే ఉంది. అమెరికా ఎప్పుడు నెంబర్ వన్‌గా ఉంటుందని ట్రంప్ చెబుతుంటారు. కానీ అందుకు అవసరమైన కీలక ఖనిజాలు చైనా నుండి ట్రంప్ తీసుకోవాలి.చైనాపై అధిక సుంకాలు,ఎగుమతి ఆంక్షలు విధించాలన్న ఆయన మొదటి ప్రయత్నం విఫలమైంది. చైనా పట్ల ట్రంప్ ఆచరణలో రాజీధోరణి,మాటల్లో దాడిచేయడానికి సిద్ధపడినంత పదును చూపిస్తున్నారు.ట్రంప్ విన్యాసాలన్నింటినీ చైనా నేత జిన్‌పింగ్ ప్రశాంతంగా గమనిస్తూ కూర్చున్నారు.ప్రపంచదేశాలతో తన వాణిజ్యాన్ని విస్తరించుకున్నారు. కొత్త మార్కెట్లను విస్తరించుకున్నారు. భద్రతామండలిలో,బ్రిక్స్‌లో తన బలం పెంచుకున్నారు.మాటల్లో ట్రంప్,చేతల్లో జిన్‌పింగ్ తమ తమ ఆధిపత్యాలు ప్రదర్శిస్తున్న తరుణంలో ట్రంప్ రాజీధోరణికి వచ్చినట్లు కనిపిస్తున్నది.

ఈ ఏడాది రెండోసారి జిన్‌పింగ్‌తో ట్రంప్ సమావేశం జరుపుతున్నారు.వాషింగ్టన్‌లో పర్యటిస్తున్న జిన్‌పింగ్‌కు ట్రంప్ ఎర్ర తివాచీ సిద్ధం చేశారు. బ్రహ్మాండమైన విందు సిద్ధం చేశారు. వైట్‌హౌస్ సౌత్ లాన్‌లో జిన్‌పింగ్ కోసం ఒక తాత్కాలిక హెలీపాడ్‌ను సిద్ధం చేయించారు.అంతర్జాతీయ సమావేశాల్లో మరోరెండుసార్లు వీళ్ళిద్దరూ కలుసుకునే అవకాశాలున్నాయి.దేశాలమధ్య పరస్పర గౌరవం,సమానత్వం,మర్యాద ఉండాలని,ఏకపక్ష ఆధిపత్య ధోరణులకు కాలం చెల్లిందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పదే పదే ఉద్ఘాటిస్తున్న తరుణంలో ట్రంప్ చైనాతో సాధారణ సంబంధాలకోసం ఎదురుచూస్తున్నారు.

# చర్చల పునరుద్ధరణకు ఇరాన్ ఏడు షరతులు

- స్వయంకృతాపరాధాల ఊబిలో ట్రంప్
- బయటపడాలంటే షరతులు ఒప్పుకోవడమే మార్గం
- ఇరాన్ సుప్రీం కౌన్సిల్ కార్యదర్శి రెజాయి హెచ్చరిక
- రియాద్‌పై హౌతీల దాడి: సౌదీ దిగ్భ్రాంతి
- శరవేగంగా విస్తరిస్తున్న పశ్చిమాసియా యుద్ధం
- వీకెండ్ మధ్యలోనే ముగించి వైట్‌హౌస్‌కు ట్రంప్
- హౌతీలపై దాడులకు యత్నాలు!

**వాషింగ్టన్:** పశ్చిమాసియాలో యుద్ధం శరవేగంగా విస్తరిస్తోంది. ఇరాన్ మద్దతుగల హౌతీలు కొత్త ప్రాంతాలను ఆక్రమించి సౌదీ అరేబియాపై దాడులను ఉద్ధృతం చేసి ఆ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేయడంతోపాటు, చర్చలు పునఃప్రారంభించడానికి ఇరాన్ అమెరికాకు ఏడు షరతులు విధించడం, హౌతీల తలనొప్పి భరించలేక ప్రత్నామాయ మార్గాలను, స్వల్పకాలిక దాడులు చేయాలని ట్రంప్ ఆలోచించడం వంటి అనేక పరిణామాలు గడచిన ఇరవైనాలుగ్గంటల్లో చోటుచేసుకున్నాయి.

సౌదీ అరేబియా రాజధాని రియాద్‌పైన, ఎర్ర సముద్రంలోని ఇంధన కేంద్రాలపైన బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేశామని హౌతీ తిరుగుబాటు సైన్యాలు ప్రకటించాయి. ఈ దాడులతో పేలుడు శబ్దాలు వినిపించాయి. రి యాద్ విమానాశ్రయం సమీపంలో దట్టమైన పొగలు కమ్ముకుని,రియాద్ నుండి విమాన రాకపోకలు జాప్యమవుతున్నాయని సంకేతాలు వెలువడ్డాయి.ఐతే ఒక బాలిస్టిక్ క్షిపణిని అడ్డుకుని ధ్వంసం చేసినట్లు సౌదీ అధికారులు చెప్పారు. జులైలో హౌతీలు దాడులు ప్రారంభించినప్పటినుండీ మొదటిసారి రియాద్‌కు దాడుల సమస్య ఎదురైంది. బిష్, తైఫ్,ఫరాసన్,యాన్బు నగరాలలో ప్రజలను లక్ష్యంగా చేసుకున్న ప్రయత్నాలను అడ్డుకున్నట్లు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాల అధికార ప్రతినిధి చెప్పారు. అదే సమయంలో అమెరికా ఒక ప్రకటన చేస్తూ, పశ్చిమాసియాలో అమెరికన్లు అప్రమత్తంగా ఉండాలని, విమానప్రయాణాల జాప్యానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించింది. ఈ ఘర్షణ తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని పేర్కొంది. ఎర్ర సముద్రాన్ని, ఈ తీర ప్రాంతాలను స్వాధీనంలోకి తెచ్చుకుని చమురు వాణిజ్య నౌకలను శాసిస్తున్న దశకు చేరిన హౌతీలు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు పెద్ద తలనొప్పిగా మారారు. హౌతీల దాడులు,ఇరాన్ కొత్త షరతుల నేపథ్యంలో డోనాల్డ్ ట్రంప్ క్యాంప్ డేవిడ్ నుండి తన వీకెండ్ సెలవును కుదించుకుని హుటాహుటిన దేశరాజధానికి చేరుకుని వార్‌రూమ్‌లో ఆలోచనలు చేస్తున్నారు. బహుశా హౌతీలపై స్వల్పకాలిక దాడులు జరిగే అవకాశాలు ఉన్నాయని ఊహాగానాలు సాగుతున్నాయి.మరోవైపు ఇరాన్ విధించిన షరతుల గురించి కూడా ట్రంప్ ఆలోచన చేస్తున్నారు.



కాగా, ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ ప్రభుత్వం డోనాల్డ్ ట్రంప్ పాలనాయంత్రాంగానికి ఏడు షరతులను విధించినట్లు ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మేజర్ జనరల్ మొహ్సేన్ రెజాయి తెలియజేశారు. షరతతులు అంగీకరించేవరకూ హోర్ముజ్ జలసంధి మూసే ఉంటుందని కూడా స్పష్టం చేశారు. ఖతార్‌కు చెందిన మధ్యవర్తులను ఉపయోగించుకుని ఈ ఏడు షరతులను ఇప్పటికే అమెరికాకు తెలియజేసినట్లు ఎక్స్ వేదికగా ఆయన ఆదివారం చెప్పారు. గతంనుండీ అమెరికాకు ఇరాన్ చెబుతున్న అనేక చాలా అంశాలు ఈ షరతుల్లో పునరావృతమయ్యాయి. తక్షణం యుద్ధాన్ని శాశ్వత ప్రాతిపదికపై నిలిపివేయడం,పశ్చిమాసియా నుండి అమెరికా దళాలు ఖాళీచేసి వెళ్ళిపోవడం,స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను తిరిగి స్వాధీనం చేయడం, ఇజ్రాయెల్‌ను అదుపు చేయడం వంటివన్నీ షరతులలో ఉన్నాయి. ''మా షరతులు చాలా స్పష్టమగా ఉన్నాయి, మా వైఖరిలో ఎలాంటి సందేహాలు లేవు, ఇరాన్ సార్వభౌమాధికారాన్ని అమెరికా తిరస్కరిస్తోంది, ప్రాదేశిక స్థిరత్వానికి భంగం కలిగిస్తోంది, డోనాల్డ్ ట్రంప్ తన స్వయంకృతాపరాధాలనుండి బయటపడాలి, ఆయన తన స్వయంకృతాపరాధాలలో కూరుకుపోయారు, ఆ ఊబిలోంచి బయటపడాలంటే ఇరాన్ విధించిన తాజా ఏడు షరతులు అంగీకరించడంతప్ప మరో మార్గంలేదు'' అని ఎక్స్ వేదికగా రెజాయి హెచ్చరించారు. అమెరికా ఓడిపోయిందని, భేషజాలు పోతోందని, యుద్ధ సామాగ్రిలేక ఆర్థిక ఆంక్షలు అమలు చేయాలని ఇతర దేశాలను అడుగుతోందని, ఇతర దేశాల సార్వభౌమాధికారాలను శాసిస్తోందని విమర్శించారు. రష్యా–ఇరాన్ దేశాలను ఏకకాలంలో లొంగదీసేందుకు అమెరికా కాంగ్రెస్ ద్వారా ఆంక్షల చట్టాన్ని తెచ్చి విశేషాధికారాలను ట్రంప్ తన గుప్పెట్లో బిగించిన తరుణంలో ఇరాన్ నుండి ఈ షరతుల హెచ్చరిక వచ్చింది.

ఇదిలా ఉండగా హౌతీ దళబూలు ఎర్ర సముద్రం తీర ప్రాంతాలను ఆక్రమించి ముఖ్యమైన సముద్రప్రాంతాలను తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. ఎర్ర సముద్రం రేవు నగరం మోఖాను పది రోజుల క్రితమే స్వాధీ నం చేసుకున్నాయి. ఈ పరిణామం సౌదీ అరేబియాకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. మరోవైపు లక్షల మంది యెమెన్ ప్రజలు గతానుభవాల దృష్ట్యా ఇళ్ళువదలి పారిపోతున్నారు.అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన యెమెన్ ప్రభుత్వంతో హౌతీలు 2014లోనే యుద్ధం ప్రారంభించారు. ఈ అంతర్యుద్ధం తర్వాత 2022 లో ఒప్పందం కుదిరింది. అప్పటినుండీ సౌదీ అరేబియాను దెబ్బతీసేందుకు హౌతీలు కాచుకుని ఉన్నారు. అమెరికాతో యుద్ధం తమ లక్ష్యం కాదని, తమపై దిగ్బంధనం విధించిన సౌదీఅరేబియాను ఆర్థికంగా దెబ్బతీయడమే తమ లక్ష్యమని హౌతీ దళాలు చెబుతున్నాయి.

### చమురు తరలింపుపై సెంట్‌కామ్ వాదనను ఇరాన్ తిరస్కృతి

గడచిన రెండు నెలలుగా హోర్ముజ్ జలసంధి నుండి ఒక బిలియన్ బ్యారెల్స్ చమురును బయటకు తరలించామని, 2000 వాణిజ్య నౌకలకు రక్షణ ఇచ్చామని అమెరికా సెంట్‌కామ్ కమాండర్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ ఎక్స్ వేదికగా చేసిన ప్రకటనను ఇరాన్ సాయుధ బలగాల అధికార ప్రతినిధి బ్రిగేడియర్ అబుల్ ఫజల్ షెకార్చీ బలంగా తిరస్కరించారు. ట్రంప్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని, హోర్ముజ్ జలసంధి పూర్తిగా ఐఆర్‌జిసి బలగాల అధీనంలో ఉందని ఆయన చెప్పారు. దురాక్రమణకు పాల్పడిన అమెరికా సైన్యాలను తరిమికొట్టామని ఆయన చెప్పారు. ఐతే జలసంధి పూర్తిగా తమ కనుసన్నల్లోనే ఉందని ట్రంప్ వాదిస్తున్నారు. సెంట్‌కామ్ దళాల భద్రత నడుమ గడచిన రెండు నెలల్లో 100 కోట్ల బ్యారెళ్ళ చమురును జలసంధి నుండి తరలించామనడం అపహాస్యంగా,హాస్యాస్పదంగా ఉందని, ఇవన్నీ అసత్యవాదనలని అన్నారు. సెంట్‌కామ్ దళాలు వాస్తవాలను ప్రతిబింబించకుండా ఒక విఫల మానసిక యుద్ధ కుతంత్రాన్ని చాటి చెబుతున్నాయన్నారు. హోర్ముజ్‌జలసంధిలో అలసిపోయిన ఉగ్రవాద అమెరికా సైన్యాలకు మానసిక ధైర్యాన్ని ఇచ్చేందుకు, అమెరికా కోల్పోయిన ఆర్థిక,మానవ నష్టాలనుసమర్థించుకోవడానికి ఇలాంటి అసత్యాలను ప్రచారం చేస్తున్నారని అబుల్ ఫజల్ షెకార్చీ విమర్శించారు.

## ట్యునీషియాలో నిరసన ప్రదర్శన

- దేశాధ్యక్షుడి రాజీనామాకు డిమాండ్
- జైలు నుండి ప్రతిపక్షాలు, జర్నలిస్టులను విడుదల చేయాలి

**ట్యునిస్:** ఉత్తర ఆఫ్రికా మొఘర్బు ప్రాంత దేశం ట్యునీషియాలో ప్రజలు తీవ్ర అసంతృప్తితో వీధుల్లోకి వచ్చారు. దేశాధ్యక్షుడు కైస్ సయీద్ (68)పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ట్యునీషియాలో ప్రజలు భారీ నిరసన ప్రదర్శన జరిపారు. 2019 నుండీ ఆయన దేశాధ్యక్ష పదవిలో కొనసాగుతున్నారు. పదవికి సయీద్ రాజీనామా చేయాలని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని వారు కోరారు. జైలులో నిర్బంధించిన ప్రతిపక్షాల నాయకులను, జర్నలిస్టులను, ఇతర ప్రజాసంఘాల నాయకులను విడుదల చేయాలని ప్రజలు కోరారు. దేశాధ్యక్షుడికి వ్యతిరేకంగా గతనెలలో కూడా ప్రజలు ఇదేవిధంగా వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేశారు.2021 జులైలో అధ్యక్షుడు సయీద్ పార్లమెంటును రద్దుచేశారు. ప్రతిపక్షాలను జైలులో పెట్టారు. ఏకపక్షంగా దేశాన్ని పాలిస్తున్నారు. దేశంలో పరిస్థితులు, జీవన స్థితిగతులు దిగజారాయి. దీంతో ప్రజలు వీధుల్లోకి వస్తున్నారు.న్యాయ వ్యవస్థలో అవినీతిపై తాను పోరాటం చేస్తున్నానని ప్రకటించిన దేశాధ్యక్షుడు సుప్రీం జ్యుడీషియల్ కౌన్సిల్‌ను రద్దుచేశారు. పెద్ద సంఖ్యలో న్యాయమూర్తులను పదవుల నుండి తొలగించారు. అంతర్జాతీయ హక్కుల సంఘాలు ఆయన చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాయి. న్యాయ వ్యవస్థ స్వతంత్రతను కబళించారని ఈ సంఘాలు దుమ్మెత్తిపోశాయి.ప్రతిపక్షాలు జైలులో ఉన్నప్పటికీ ప్రజలు వీధుల్లోకి వస్తున్నారు. దీంతో ట్యునీషియా అధ్యక్షుడిపై రోజు రోజుకూ ఒత్తిడి పెరుగుతోంది.''ఈ వైఫల్యాలు చాలు, ఈ నియంతృత్వం చాలు కట్టిపెట్టండి,దేశం పతనమవుతోంది'' అని ప్రజలు నినాదాలు చేశారు. 1990వ దశకంలో వైద్యుడుగా పనిచేసిన కైస్ సయీద్ ఆ తర్వాత అరబ్‌లీగ్ జనరల్ సెక్రటేరియట్ సభ్యుడుగా పనిచేశారు.ఇష్టలేకపోతే గెలిచిన ప్రజాప్రతినిధులను వెనక్కు పిలిచే అధికారాలు ప్రజలకు ఇస్తానని హామీ ఇచ్చి 2019 అధ్యక్ష ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. మానవహక్కులలో నిపుణుడైన సయీద్ చివరకు నియంతగా అవతరించారు. ముస్లిం ప్రపంచంపై యుద్ధం ప్రకటించిన ఇజ్రాయెల్‌తో సాధారణ సంబంధాలను ఆయన తిరస్కరించారు.





## కుటుంబ ఆస్తులే ఎక్కువ!

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించింది. ఈ బృందంలో ఎంపిలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మల్లు రవి, బలరాం నాయక్, అనిల్ యాదవ్, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్,బీర్ల ఐలయ్య,నవీన్ యాదవ్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ తదితరులు పాల్గొనగా. కాంగ్రెస్ పార్టి నాయకులు టిపిసిసి అధికార ప్రతినిధి సతీష్, టిపిసిసి సభ్యుడు షాబాద్ దర్శన్, మున్సిపల్ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సత్యనారాయణ,మాజీ అధ్యక్షుడు మాణయ్య, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. పర్యటన సందర్భంగా భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, నిజాం నవాబులు సుదీర్ఘకాలం పాలించి సంపాదించిన ఆస్తుల కంటే భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) నేతలు పదేళ్ల అధికార కాలంలో భారీగా ఆస్తులు కూడబెట్టుకున్నారని ఆరోపించారు. మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి భారీ అప్పులు మిగిల్చారని విమర్శించారు."కేసీఆర్ కుటుంబానికి వందల, వేల ఎకరాల భూములు ఎలా వచ్చాయి? 2004, 2009 ఎన్నికల అఫిడవిట్లలో చూపించని భూములు ఇప్పుడు ఎలా సమకూరాయి? ఉద్యమం పేరుతో ఆస్తులు సంపాదించారా? అధికారంలో ఉన్న సమయంలో అక్రమంగా భూములు కూడబెట్టారా?" అని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. కెటిఆర్ తమ కుటుంబం పూర్వీకుల నుంచే ఆస్తులు కలిగి ఉందని చెబుతున్న నేపథ్యంలో 2004, 2009, 2014 ఎన్నికల అఫిడవిట్లలో పేర్కొన్న ఆస్తులకు, ప్రస్తుతం వెలుగులోకి వస్తున్న భూములకు మధ్య వ్యత్యాసం ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ ఫాంహౌస్ సమీపంలో ఉన్న సుమారు 300 ఎకరాల అసైన్డ్ భూములకు పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పట్టాలు ఎందుకు ఇవ్వలేదని చామల ప్రశ్నించారు. తొమ్మిది జిల్లాల్లోని 24 మండలాలు, 30 గ్రామ పంచాయతీల పరిధిలో 450 ఎకరాలకు పైగా భూములు కేసీఆర్ కుటుంబానికి ఎలా వచ్చాయనే అంశంపై సమగ్ర విచారణ జరగాలని కోరారు. ఈ ఆరోపణలపై సంబంధిత భూముల రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలు, ఎన్నికల అఫిడవిట్లు, రెవెన్యూ రికార్డుల ఆధారంగా వాస్తవాలు తేలాల్సిన అవసరం ఉందన్నారు. అజీజ్ నగర్‌లోని సర్వే నంబర్ 76లో హరీశ్‌రావుకు సంబంధించినదిగా చెబుతున్న ఫాంహౌస్ ఉందని చామల ఆరోపించారు. హిమాయత్‌సాగర్ జలాశయం ఎఫ్‌టిఎల్ పరిధి,రిజర్వాయర్ ప్రాంతానికి సంబంధించిన అంశాలపైనా విచారణ జరగాలని కోరారు. ఇదే విధంగా సిద్దిపేటలోని రంగనాయకసాగర్ ప్రాంతంలో హరీశ్‌రావు ఫాంహౌస్ నిర్మాణానికి సంబంధించి గతంలోనూ కాంగ్రెస్ నేతలు పలు ఆరోపణలు చేశారు.ఆ భూముల కొనుగోలు, ప్రాజెక్టు అలైన్‌మెంట్ మార్పులపై ఈడీ విచారణ జరపాలని చామల డిమాండ్ చేసిన విషయం కూడా తాజా వార్తల్లో నమోదైంది. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ఫాంహౌస్ నిర్మాణం అసైన్డ్ భూములకు సంబంధించినదని,అక్కడ డ్రగ్స్ పార్టీలపై గతంలో ఆరోపణలు వచ్చాయని చామల పేర్కొన్నారు. ఫాంహౌస్‌ల పేరుతో జరుగుతున్న వ్యవహారాలపై సమగ్ర దర్యాప్తు అవసరమన్నారు.



### ప్రజల ముందుకు వాస్తవాలు తీసుకొస్తాం

తెలంగాణలో ఫాంహౌస్ సంస్కృతి ఎప్పటి నుంచి మొదలైందో ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కెసి ఆర్ కుటుంబ ఆస్తులకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించిన అంశాల ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపడుతున్నామని తెలిపారు. కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావుతో పాటు మరికొంత మంది బిఆర్ఎస్ నేతలకు సంబంధించిన భూములు,ఫాంహౌస్‌లపై పత్రాలు, రికార్డులను పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుంచుతామని ఆయన అన్నారు.

## 'అగ్ని'పరీక్ష

(మొదటి పేజీ తరువాయి)

కావాలని విజ్ఞాపనపై సంతకంచేసిన ప్రముఖులు కోరారు. ఎల్‌నినో ఉత్పత్తిస్థానమైన పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయని, ఇది ఉపఖండంలో తీవ్ర వేడికి, కరువు పరిస్థితులకు దారితీస్తుందని చెప్పారు. ఈనెలారంభంలో ప్రపంచ వాతావరణ సంస్థ ఒక ప్రకటన చేస్తూ, ఎల్‌నినో సూపర్ ఎల్‌నినోస్థాయికి చేరిందని, రాబోయేనెలల్లో ఇది తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని, 2027 ఫిబ్రవరి వరకూ ఈ దారుణ ప్రకృతి వైపరీత్యాలు కొనసాగుతాయని పేర్కొంది. ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్రంలోని పరిశోధనాజోన్‌లో ఉపరితల జలాలు బాగా వేడెక్కిపోవడాన్ని ఎల్‌నినో అని పిలుస్తారు.పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు 0.5 డిగ్రీల సెల్సియస్ పరిమితిని దాటిపోయాయి. గడచిన ఆగస్టునెలలో 2.6 డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. గడచిన 1000 సంవత్సరాలలో ఎన్నడూలేనిరీతిలో అత్యధికంగా నాలుగు డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని ప్రపంచ వాతావరణసంస్థ అంచనాలు తెలియజేశాయి.ఈ స్థాయి తీవ్రతగల ఎల్‌నినో భారతదేశ ప్రజలు,పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని శాస్త్రవేత్తలు తమ విజ్ఞాపనలో పేర్కొన్నారు. దీనివల్ల దావానలాలు,వర్షారణ్యాలలో మహావృక్షాలు జీవచ్ఛవాలుగా మార డం, కరువు, తీవ్ర వేడి పరిస్థితులు తలెత్తుతాయని తెలియజేశారు.దేశంలో రైతులు, మత్స్యకారులు, గొర్రెలకాపరులకు విపత్కరమైన పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు.దేశంలో పండ్ల ఉత్పత్తిలో జాప్యం,జంతు ప్రవృత్తిలో మార్పులు చాలా సూక్ష్మంగా ఉంటాయని, వాటిని పనిగట్టుకుని పరిశీలించాల్సి ఉందని క్షేత్రస్థాయి నిపుణులకు తెలియజేశారు.ఈ సహజవ్యవస్థలలో మార్పులను సామాజిక సమీకరణల ద్వారా జాగ్రత్తగా అధ్యయనం చేయాలని వారు కోరారు.

ఈ ఏడాది నవంబరు నుండి వచ్చే ఏడాది వరకూ దీని ప్రభావం ఉంటుంది.''దీంతోపాటే పగడపు దిబ్బలు తమ వైభవం కోల్పోయి బాగా తెల్లబడిపోవడం,దావానలాలు విస్తృతం కావడం, దేశానికి వర్షపాతాన్ని ఇచ్చే అరణ్యాలలో కీలకమైన మహావృక్షాలు జీవం కోల్పోవడం, కరువు, తీవ్రమైన వేడి పరిస్థితులు బలంగా వచ్చే అవకాశాలు ఉన్నాయి.

**భవిష్యత్ భారతావని రక్షణకు క్షుణ్ణంగా అధ్యయనం చేద్దాం: మాథ్యూ**

శాస్త్రవేత్తలు చేసిన విజ్ఞప్తిపై సంతకం చేసిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రోపికల్ మెటియోరాలజీ శాస్త్రవేత్త రాక్సీ మాథ్యూకోల్ తోటి పరిశోధకులకు,క్షేత్రస్థాయి నిపుణులకు ఈ క్రింది విధంగా చెప్పారు.''భారతదేశంలో వర్షాకాలం వర్షపాతం లోటుతో ముగుస్తుంది. కానీ ఆ ప్రభావం అక్కడితో ఆగిపోదు,అది మొత్తం ఆ సీజన్ అంతటా వ్యాపిస్తుంది. నేల బీటలు వారుతుంది, భూమిలో తేమశాతం బాగా క్షీణించిపోతుంది.నీటి నిల్వలు తగ్గిపోతాయి. భూమిపైన,సముద్రంపైన వేడిగాలులు పంటలపైన, ప్రజల జీవనాధారంపైన,అరణ్యాలలో కార్చిచ్చులరూపేణా ప్రభావం చూపిస్తాయి. కంటికి కనిపించే జీవవైవిధ్యంలో భారీ మార్పులు సంభవిస్తాయి.వీటిని మనం గ్రంథస్థం చేయాలి, డాక్యుమెంటరీలుగా తీసుకురావాలి.దృశ్యమాధ్యమ పద్ధతిలో ప్రజల జీవన స్థితిగతులను నిక్షిప్తం చేయాలి, ఆ ప్రభావాలను తదుపరి క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి.ఈ మార్పులు జరుగుతున్న సమయంలో మన అధ్యయనం ద్వారా మిగిలిన పర్యావరణ వ్యవస్థలను కాపాడుకోవాలి.ఇప్పటికే ఈ వ్యవస్థలు బలహీనపడుతున్నాయి. ఈ బలహీనపడే ఒత్తిడిని, ఆ తీవ్రతను తగ్గించే ప్రయత్నం చేయాలి. ఈ అసాధారణమైన,ఎన్నడూలేని కీలక పరిస్థితులను ముందుగానే గ్రహించాం కాబట్టి, వాటిని అధ్యయనం చేసేటప్పుడు చిత్త శుద్ధితో ఉంటే, ఈ అనుభవాలు,పరిణామాలు అస్థిరమైన భవిష్యత్ భారతదేశాన్ని అప్రమత్తం చేసుకోవడానికి, దీర్ఘకాలిక ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడానికి ఉపయోగపడతాయి, మనం ఈ పరిస్థితులనుండి నేర్చుకున్నామంటే అది మన భవిష్యత్తును జాగ్రత్త చేసుకోవడానికి ఉపయోగపడేదే. ఈ తీవ్ర పరిస్థితులను నిక్షిప్తం చేయడం ద్వారా గుణపాఠాలతో ప్రణాళికాబద్ధ చర్యలకు వీలు కలుగుతుంది'' అని మా థ్యూకోల్ తోటి శాస్త్రవేత్తలను,క్షేత్రస్థాయి నిపుణులను సమాయత్తం చేశారు.

అదేవిధంగా నేచర్ కన్జర్వేషన్ బయాలజిస్టు రోహన్ అర్థర్ తన అనుభవాలను వివరించారు. రాబోయే పరిస్థితులకు సంబంధించిన భయానకమైన అంచనాలను వివరించారు.గతంలో ఎల్‌నినోకు సంబంధించి భారతదేశంలో ఎంతో అందమైన పగడపు దిబ్బలలో హృదయవిదారకమైన భయానక మార్పులు చూశానని చెప్పారు. ఈ పగడపు దిబ్బలు సాధారణంగా ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకుని నిలబడతాయని,కానీ అవి తమ వైభవం కోల్పోతే తిరిగి పుంజుకుని నిజమైన పగడపు దిబ్బలుగా పూర్వ వైభవం సంతరించుకోవడానికి కనీసం దశాబ్దాల కాలం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 2024లో ప్రధానంగా ఎల్‌నినో వచ్చిందని, రెండు సంవత్సరాల తర్వాత ఈ పరిస్థితిని తాను గమనించానని చెప్పారు. ప్రస్తుతం వేడిగాలుల తీవ్రత ఊహిస్తే భయపెడుతోందన్నారు.

**వచ్చే ఏడాది భారత్‌కు లిట్మస్ టెస్ట్**

నేషనల్ సెంటర్ ఫర్ బయలాజికల్ సైన్స్‌లో శాస్త్రవేత్త జయశ్రీ రత్నం కూడా ఈ ప్రకటనపై సంతకం చేసినవారిలో ఉన్నారు. ఆమె ఈ క్రిందివిధంగా స్పందించారు.''రాబోయే సంవత్సరం వినాశకరంగా ఉంటుంది.ఈ సూపర్ ఎల్‌నినో భారతదేశ ఉపఖండ ప్రకృతికి,సమాజానికి ఒక లిట్మస్ టెస్ట్‌గా ఉంటుంది. అంటే ఇది ఒక నిర్ణయాత్మకమైన పరీక్ష.విస్తృతమైన ఫలితాలను అంచనావేయడానికి అవసరమైన నిర్ణయాత్మకమైన కొలమానం.దీనిని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. దీనివల్ల మన పరీక్షలో ఎల్‌నినో లక్ష్యం,దాని ఫలితాలు ప్రస్తుత పరిస్థితుల్లో ఎలా ఉన్నాయో రుజువు అవుతాయి. నిజం చెప్పాలంటే భారతదేశంలో ఉష్ణమండల అడవులకు, వృక్షాలకు, ఈ వేడిగాలులు, ఎండలు అగ్నిపరీక్ష. పెద్ద అడవులు,చెట్లు నాశ నం లేనివిగా కనిపించవచ్చు. కానీ ఇప్పటికే పశ్చిమ కనుమల్లో చాలా వృక్షాలు పరిమితి దాటిన వేడికి గురయ్యాయి.అవి తట్టుకోగలవు. కానీ ప్రత్యేకించి భారీ వృక్షాలు దీర్ఘకాలంపాటు నీటి కొరత ఎదుర్కొంటాయి.నీరులేక అల్లాడిపోతాయి. ముఖ్యంగా నగరాలలో కూడా కాంక్రీటు అరణ్యాలలో వృక్షాలు ప్రమాదానికి గురవుతాయి.రాబోయే ఎల్‌నినో చెట్లు,ఇతర మొక్కలపై ఏ విధంగా ప్రభావం చూపిస్తుందో అర్థం చేసుకోవాలి.మిగిలిన జీవజాలం అంతా మనుగడ సాగించాలంటే ఇదే మనకు పునాది'' అని జయశ్రీ రత్నం పేర్కొన్నారు.

## బాసటగా నిలవాలి

(మొదటి పేజీ తరువాయి)



స్వాతంత్ర్య సమరయోధులు కందిమళ్ల ప్రతాపరెడ్డి, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ ఎంఎల్ (మాస్ లైన్) రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, ప్రముఖ ఆర్థిక, రాజకీయ వేశ్లేషకులు పరకాల ప్రభాకర్, రిటైర్డ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ తదితరులు ప్రసంగించారు. పశ్య పద్మ మాట్లాడుతూ దేశ కాలమాన పరిస్థితులకు అనుకూలంగా మార్క్సిజం సిద్ధాంతాన్ని ఎలా మలుచుకోగలమనే అంశంపై ఒక స్పష్టతకు రావలసిన అవసరం ఉందని, తద్వారా వామపక్ష పార్టీల బలమైన ఐక్యతను సాధించడానికి, కోట్లాది ప్రజలపై ప్రభావాన్ని కలిగించడానికి ముందడుగు వేయాలన్నారు. సైద్ధాంతికపరమైన ఆలోచనలలో ఏమైనా వైరుధ్యాలు ఉంటే కూర్చుని సమీక్షించుకోవడానికి వామపక్ష పార్టీలన్నీ ముందుకు రావాలన్నారు. ప్రజా సంఘాలు కలిసి పనిచేయడం, కొన్ని సందర్భాలలో వామపక్ష పార్టీలు సమస్యలపై పనిచేస్తున్నాయని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎక్కడికక్కడ స్వతంత్రంగానే ప్రజా ఉద్యమాలు, పోరాటాలు సాగుతున్న నేపథ్యంలో విశాల ప్రజా వేదికలలో వామపక్షాలు ప్రధాన పాత్ర వహించాలని ఆమె అన్నారు.ఢిల్లీలో జరిగిన రైతాంగ ఉద్యమం సందర్భంగా రైతుల భాగస్వామ్యంతో పాటు ఉద్యమ విజయంలో వామపక్ష పార్టీలు కీలకమైన పాత్రను వహించాయి. అలాగే ప్రస్తుతం కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా కలిసి కొనసాగిస్తున్న పోరాటాలు, ఉద్యమాలు బలపడేందుకు ఐక్యతతో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జస్టిస్ చంద్రకుమార్ వామపక్ష పార్టీలు ఐక్యం కావాలని దేశ ప్రజలు చాలా కాలంగా ఆకాంక్షను వ్యక్తం చేస్తున్నారని, ఆ దిశగా వామపక్ష పార్టీలు తమ ప్రయాణం సాదించగాలన్నారు. సదస్సులో హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్‌పోర్టుకు టెండర్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన నిర్మాణ పనుల నిమిత్తం తాజాగా అధికారిక టెండర్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా వరంగల్ గడ్డపై మళ్లీ విమాన సర్వీసులు నడిపించేందుకు మార్గం సుగమమైంది.విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం, ఎయిర్‌పోర్టు ప్రాంగణంలో అత్యాధునిక సౌకర్యాలతో పలు కీలక భవనాలను నిర్మించనున్నారు. ఇందులో ప్రధానంగా ప్రయాణికుల రాకపోకల కోసం విశాలమైన డొమెస్టిక్ టెర్మినల్ బిల్డింగ్, విమానాల రాకపోకలను పర్యవేక్షించేందుకు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్ నిర్మాణం జరగనుంది.అలాగే విద్యుత్ సరఫరా నిమిత్తం ఎలక్ట్రిక్ సబ్‌స్టేషన్, అత్యవసర సేవల కోసం ఫైర్ స్టేషన్, మెయింటెనెన్స్ పనుల కొరకు ఈఅండ్‌ఎం వర్క్ షాప్ నిర్మాణాలను చేపట్టనున్నారు. ఈ పనులన్నింటినీ కాంట్రాక్టు దక్కించుకున్న ఏజెన్సీ కచ్చితంగా 18 నెలల కాలపరిమితిలోగా పూర్తి చేయాల్సి ఉంటుందని నిబంధనల్లో స్పష్టం చేశారు.ఈ టెండర్ ప్రక్రియకు సంబంధించి కీలక తేదీలను ఏఏఐ ఖరారు చేసింది.ఈ నెల 28వ తేదీన కాంట్రాక్టర్లు, బిడ్డర్ల కోసం ప్రీబిడ్ సమావేశం నిర్వహించనున్నారు. ఆసక్తి గల సంస్థలు నవంబరు 3వ తేదీ వరకు తమ బిడ్లను ఆన్‌లైన్‌లో దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. నవంబరు 9వ తేదీన టెక్నికల్ బిడ్లను, నవంబరు 30వ తేదీన ఫైనాన్షియల్ బిడ్లను అధికారులు పరిశీలించి తెరవనున్నారు. ఈ పనులు త్వరలోనే ప్రారంభమై పూర్తయితే, వరంగల్ ప్రాంతం పారిశ్రామిక, పర్యాటక, రవాణా రంగాల్లో అపూర్వమైన అభివృద్ధిని సాధించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఐక్య పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

విధాన నిర్ణయాలు..ఓబిసిల తక్షణ బాధ్యతలు, భవిష్యత్ కార్యాచరణ' అంశంపై నిర్వహించిన జాతీయ ఓబిసి సదస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, జహీరాబాద్ ఎంపి సురేష్ కుమార్ షెట్కర్, ఎఐసిసి సెక్రటరీ సచిన్ సావంత్, బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కులగణన చేపట్టి సమగ్ర ఎంపిరికల్ డేటాను సేకరించిందన్నారు. కేబినెట్ చర్చ, శాసనసభ తీర్మానం, రాజ్యాంగపరమైన ప్రక్రియలు పూర్తి చేసి గవర్నర్ ఆమోదంతో నివేదికను కేంద్రానికి పంపినట్లు తెలిపారు. బిసిలకు రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలంటే కచ్చితమైన గణాంకాలు అవసరమని మంత్రి అన్నారు.

**50 శాతం పరిమితిపై పునరాలోచన..**

ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని, బిసిలకు వారి జనాభా ప్రాతిపదికన న్యాయం జరిగే విషయంలో 50 శాతం రిజర్వేషన్ పరిమితి అడ్డంకిగా మారకూడదన్నారు. బిసిల జనాభా, సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర డేటా ఆధారంగా రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**దేశవ్యాప్త ఉద్యమానికి పిలుపు..**

వి.హనుమంతరావు మాట్లాడుతూ బిసి కులగణన కోసం కాంగ్రెస్ జాతీయ స్థాయిలో వంద రోజుల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం రాహుల్ గాంధీ నాయకత్వంలో ఢిల్లీలో భారీ బహిరంగ సభ నిర్వహించి కేంద్రంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు. ఎంపి సురేష్ కుమార్ షెట్కర్ మాట్లాడుతూ తెలంగాణను రోల్ మోడల్‌గా తీసుకుని కేంద్రం జనగణనలో కులగణన చేపట్టాలని కోరారు. కుల్కచర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఓబిసి కాలమ్ చేర్చే వరకు దేశవ్యాప్తంగా ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు. విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ జనగణనలో ఓబిసి కాలమ్‌తో పాటు ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సదస్సులో రాష్ట్రీయ ఓబిసి మహాసంఘ్ అధ్యక్షుడు భబన్ రావు తైవాడే, ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకర్‌రావు, బి.మణిమంజరి, కనకాల శ్యామ్ కుర్మా, ప్రొఫెసర్ సంఘని మల్లేశ్వర్, పిఎల్ విశ్వేశ్వరరావు, కుందారం గణేషాచారి, జాజుల లింగం గౌడ్, తారకేశ్వరితో పాటు జాతీయ స్థాయిలోని వివిధ ఓబిసి సంఘాల నాయకులు, మేధావులు, ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఓబిసి నేతలు పాల్గొన్నారు.

# ఆసియా క్రీడల్లో భారత్‌కు తొలి పతకం

## బ్యాడ్మింటన్ క్వార్టర్ ఫైనల్లో సింధు బృందం!



జపాన్ వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత్‌కు తొలి పతకం వచ్చేసింది. ఆటలు మొదలైన రెండో రోజే షూటర్ల బృందం రజతంతో మెరిసింది. ఆదివారం నిర్వహించిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగం ఫైనల్లో సత్తా చాటిన సోనమ్ ఉత్తమ్ మస్కర్, ఎలవెనిల్ వలరివన్, విదర్భా వినోద్లతో కూడిన త్రయం సిల్వర్ మెడల్ అందించింది. మరోవైపు మహిళల బ్యాడ్మింటన్ బృందం అదిరే విజయంతో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది.

ఇరవయ్యో ఆసియా క్రీడల్లో షూటర్ల బృందం భారత్‌కు తొలి పతకం అందించింది. నొగయాలో ఆదివారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో సోనమ్ ఉత్తమ్ మస్కర్, ఎలవెనిల్ వలరివన్, విదర్భా వినోద్‌లతో కూడిన టీమిండియా త్రయం సిల్వర్ మెడల్ ముద్దాడింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో అగ్రస్థానంలో నిలిచిన మన షూటర్లు.. ఫైనల్లో మాత్రం కాసింత తడబడ్డారు. చైనా బృందం 1,904.2 పాయింట్లతో రికార్డు నెలకొల్పగా.. జపాన్ షూటర్లను వెనక్కి నెడుతూ భారత త్రయం 1898.0 పాయింట్లు సాధించింది. కేవలం 0.9 పాయింట్ల తేడాతో ఆతిథ్య దేశ షూటర్లు కాంస్యం తో సరిపెట్టుకున్నారు. సింగిల్స్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పోటీల్లోనూ మెరిసిన వలవరిన్ వెండి వెలుగులు విరజిమ్మింది.

**సింధు చెలరేగగా....**

మహిళల బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు చెలరేగడంతో భారత బృందం క్వార్టర్ ఫైనల్ చేరింది. తొలి రౌండ్‌లో కజకిస్థాన్ షట్లర్లకు సింధు, ఉన్నాటి హుడా, తన్వీ శర్మలు చుక్కలు చూపించారు. కమలియాపై వరస సెట్లలో విరుచుకుపడిన తెలుగు తేజం 21 7, 219తో విజయం సాధించింది. అంతకు ముందు.. ఉన్నాటి 217, 2119తో అలిస్సాపై, తన్వి 215, 2110తో దయానాపై గెలుపొందారు. మొత్తంగా ముగ్గురు కలిపి 65 నిమిషాల్లోనే ప్రత్యర్థులను మట్టికరిపించగా.. భారత బృందం దర్జాగా క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది.

**గోల్స్ వర్షం**

ఆసియా క్రీడల అరంభ పోరులో భారత హాకీ జట్లు అదరగొట్టాయి. మహిళల, పురుషుల హాకీ జట్లు గోల్స్ వర్షంతో ముందంజ వేశాయి. ఉజ్బెకిస్థాన్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 19–0తో మహిళల జట్టు ఘన విజయం సాధించింది. అనంతరం ఇండోనేషియాపై దిల్ప్రీత్ నాలుగు, సుఖ్జీత్ రెండు గోల్స్‌తో విజృంభించగా 13–1తో ఓడించింది హర్మన్‌ప్రీత్ సింగ్ సేన.

# బంగ్లాపై భారీ విజయంతో ఫైనల్‌కు భారత్



ఇటీవలే ఎనిమిదోసారి ఆసియా కప్‌ను ఒడిసిపట్టిన భారత మహిళల జట్టు ఆసియా క్రీడల్లో ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆదివారం రెండో సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌పై ఓపెనర్ షఫాలీ వర్మ(100 నాటౌట్) మెరుపు శతకంతో విరుచుకుపడగా అలవోకగా పసిడి పోరుకు అర్హత సాధించింది టీమిండియా. 196 పరుగుల ఛేదనలో ఏమాత్రం పోటీ ఇవ్వని బంగ్లా 81 పరుగులకే ఆలౌటైంది. దీప్తి శర్మ(3–7), నందిని శర్మ(3–25)లు చెలరేగగా.. 114 రన్స్ తేడాతో నెగ్గిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన దర్జాగా ఫైనల్ చేరింది. ఫెండింగ్ ఛాంపియన్‌గా ఆసియా క్రీడల్లో అడుగుపెట్టిన భారత జట్టు అదిరే ఆటతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. క్వార్టర్ ఫైనల్లో జపాన్‌ను చిత్తుగా ఓడించిన టీమిండియా.. సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌ను మట్టికరిపించింది. తొలుత ఓపెనర్ షఫాలీ వర్మ (100 నాటౌట్: 49 బంతుల్లో 3 ఫోర్లు, 9 సిక్సర్లు) తుఫాన్ ఇన్నింగ్స్‌తో సగం ఓడిన బంగ్లా.. బ్యాటర్ల తడబాటుతో 15.4 ఓవర్లలోనే మ్యాచ్‌ను అప్పగించేసింది.

**షఫాలి సునామీ**

బిగ్ మ్యాచ్ ప్లేయర్‌గా అవతరించిన షఫాలీ వర్మ సెమీఫైనల్లో రెచ్చిపోయింది. బంగ్లాదేశ్ బౌలర్లను బెంబేలెత్తిస్తూ ఓపెనర్ స్మృతి మంధాన(37)తో కలిసి శుభారంభమిచ్చింది. తొలి వికెట్‌కు 72 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని నహిదా అక్తర్ విడదీసింది. మంధాన ఔటయ్యాక.. కమలిని(3) నిరాశపరిచింది. కానీ, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(40) జతగా షఫాలి బౌండరీలతో విరుచుకుపడింది. ఆఖరి వరకు క్రీజులో నిలిచిన తను.. భారత జట్టుకు 195 పరుగుల భారీ స్కోరందించింది.

టీమిండియా నిర్దేశించిన 196 పరుగుల భారీ ఛేదనలో బంగ్లా ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. ప్రత్యర్థిని టాపార్డర్‌ను దీప్తి శర్మ (3–7), బర్త్ డే గర్ల్ నందిని శర్మ(3–25) వణికించారు. వీరిద్దరూ చెరో మూడేసి వికెట్లతో చెలరేగగా.. బంగ్లా 81 పరుగులకే కుప్పకూలింది. దాంతో.. 114 పరుగుల భారీ విజయంతో ఫైనల్లో అడుగుపెట్టింది భారత్. తొలి సెమీస్‌లో గెలుపొందిన శ్రీలంకను పసిడి పోరులో టీమిండియా ఢీకొట్టనుంది. సెప్టెంబర్ 22 మంగళవారం ఫైనల్ మ్యాచ్ జరుగనుంది.

# ఆరోగ్యం

# ఆరోగ్య రంగంలో ఎఐ



ఆరోగ్యరంగంలో కృత్రిమ మేధస్సు (ఎఐ) వినియోగం రోజురోజుకూ విస్తరిస్తోంది. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం, ఎక్స్‌రేలు, సిటి స్కాన్లు, ఎంఆర్‌ఐ చిత్రాలను వేగంగా విశ్లేషించడం, రోగి వైద్య చరిత్రను పరిశీలించడం, చికిత్సకు సంబంధించిన సమాచారాన్ని సమీకరించడం వంటి అనేక పనుల్లో ఎఐ కీలక పాత్ర పోషిస్తోంది. దీంతో వైద్య సేవలు మరింత వేగంగా, సమర్థవంతంగా అందే అవకాశాలు పెరుగుతున్నాయి. అయితే, ఎఐ ఎంత అభివృద్ధి చెందినా.. వైద్యుల స్థానాన్ని పూర్తిగా భర్తీ చేయలేదని ఆరోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒక రోగి పరిస్థితిని కేవలం పరీక్షల ఫలితాల ఆధారంగా మాత్రమే కాకుండా, అతని శారీరక, మానసిక స్థితి, కుటుంబ పరిస్థితులు, ఇతర ఆరోగ్య సమస్యలు వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఇటువంటి సమగ్ర వైద్య నిర్ణయాల్లో మానవ అనుభవం, క్లినికల్ అవగాహన, వివేచన ఎంతో అవసరమని వారు పేర్కొంటున్నారు. అలాగే, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు ధైర్యం చెప్పడం, వారి కుటుంబ సభ్యులతో సానుభూతితో మాట్లాడటం, చికిత్సలో ఎదురయ్యే నైతిక సందిగ్ధ పరిస్థితులను పరిష్కరించడం వంటి బాధ్యతలను ఎఐ నిర్వహించలేదని నిపుణులు చెబుతున్నారు. రోగి–వైద్యుడి మధ్య ఉండే విశ్వాసం, మానవీయ స్పర్శ, భావోద్వేగ అనుబంధం వైద్య సేవల్లో అత్యంత కీలకమైన అంశాలని వారు గుర్తు చేస్తున్నారు. భవిష్యత్తులో ఎఐను వైద్యుల సహాయక సాధనంగా వినియోగించడం వల్ల వ్యాధులను మరింత ఖచ్చితంగా గుర్తించడం, చికిత్సను వేగవంతం చేయడం, వైద్యపరమైన పొరపాట్లను తగ్గించడం సాధ్యమవుతుంది. అయితే తుది వైద్య నిర్ణయం, రోగి పరిస్థితికి అనుగుణంగా చికిత్స ఎంపిక, బాధ్యతాయుతమైన సేవలను అందించడం మాత్రం వైద్యుల చేతుల్లోనే ఉండాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అందువల్ల, ఆరోగ్య రంగంలో ఎఐ అనేది వైద్యులకు ప్రత్యామ్నాయం కాకపోయినప్పటికీ, వారి పనితీరును మరింత సమర్థవంతంగా చేసే ఆధునిక సాంకేతిక సహాయక సాధనమని వారు అభిప్రాయపడుతున్నారు.




## స్టాటిన్ మందుల వాడకానికి ‘రిస్క్ కాలిక్యులేటర్’!

గుండెపోటు, పక్షవాతం వంటి గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించేందుకు ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ఉపయోగించే ‘స్టాటిన్’ మందుల విషయంలో రోగుల్లో ఉన్న ఒక ప్రధాన ఆందోళన కండరాల నొప్పులు, బలహీనత వంటి దుష్ప్రభావాలు. ఈ భయంతో చాలా మంది వైద్యుల సలహా లేకుండానే మందులను మధ్యలోనే నిలిపివేస్తుంటారు. దీంతో గుండె జబ్బుల ప్రమాదం మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ఈ సమస్యకు పరిష్కారంగా బ్రిటన్‌కు చెందిన పరిశోధకులు ఒక కొత్త ‘రిస్క్ కాలిక్యులేటర్’ను అభివృద్ధి చేశారు. ఈ డిజిటల్ సాధనం ద్వారా ఒక వ్యక్తి వయస్సు, లింగం, శారీరక ఆరోగ్యం, ఇతర వ్యాధులు, తీసుకుంటున్న మందులు వంటి వివరాల ఆధారంగా స్టాటిన్ మందుల వల్ల తీవ్రమైన కండరాల దుష్ప్రభావాలు వచ్చే అవకాశాన్ని వ్యక్తిగతంగా అంచనా వేయవచ్చు. దీంతో ప్రతి రోగికి తగిన చికిత్సను మరింత ఖచ్చితంగా నిర్ణయించే అవకాశం ఉంటుంది. సుమారు 98 శాతం మంది రోగుల్లో స్టాటిన్ మందుల వల్ల తీవ్రమైన కండరాల సమస్యలు వచ్చే ప్రమాదం చాలా తక్కువగా ఉందని తేలడం ఈ పరిశోధనలో అత్యంత ఆసక్తికరమైన విషయం. అంటే, చాలామంది రోగులు అనవసర భయాలతోనే మందులను నిలిపివేస్తున్నారని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఈ కొత్త రిస్క్ కాలిక్యులేటర్ అందుబాటులోకి వస్తే, రోగులు తమ వ్యక్తిగత ప్రమాద స్థాయిని తెలుసుకుని వైద్యుల సూచన మేరకు చికిత్సను నమ్మకంగా కొనసాగించే అవకాశం ఉంటుంది. ఫలితంగా గుండెపోటు, పక్షవాతం వంటి ప్రాణాంతక సమస్యలను నివారించడంలో స్టాటిన్ మందుల ప్రయోజనం మరింతగా పెరుగుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే, వైద్యుల సలహా లేకుండా స్టాటిన్ మందులను ప్రారంభించడం లేదా నిలిపివేయడం సరికాదని వారు స్పష్టం చేస్తున్నారు.

## విద్యుత్ సంకేతాలు విడుదల చేసే ఎముకలు!

మీ ఎముకలు ఒత్తిడిలో ఉన్నప్పుడు చిన్న విద్యుత్ సంకేతాలను ఉత్పత్తి చేస్తాయని మీకు తెలుసా? మీరు నడిచినా, పరుగెత్తినా, ఏదైనా బరువు ఎత్తినా... మీ ఎముకలు సున్నితమైన విద్యుత్ సంకేతాలు పంపిస్తాయి. ఇంకా ఆశ్చర్యమేమిటంటే, మీ శరీరం వాటిని నిజంగానే వింటుంది! ఈ సూక్ష్మ విద్యుత్ తరంగాలు మీ శరీరానికి ఒత్తిడి ఎక్కడ ఉందో తెలుపుతాయి, దాంతో ఆ ప్రాంతంలో ఎముక కణజాలాన్ని బలపరచాలా, మరమ్మతు చేయాలా అని శరీరం నిర్ణయిస్తుంది. ఇది మన లోపలే ఉండే ఒక నిర్మాణ బృందం లాంటిది. ఎప్పటికప్పుడు ఎముకల దృఢతను పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట మరమ్మతుకు సూచనలు ఇస్తూ ఉంటుంది. కాబట్టి మీరు తర్వాత శారీరకంగా చురుకుగా ఉన్నప్పుడు, మీరు కేవలం కండరాలను బలపరుస్తున్నారనే మాత్రమే కాదు.... మీ ఎముకలను కూడా మరింత కఠినంగా, మన్నికగా మార్చుకుంటున్నారని గుర్తుంచుకోవాలి.



# ప్రభుత్వ యూనివర్సిటీల పరిరక్షణకు ఉద్యమిస్తాం

- ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల ఇన్‌చార్జి రెహమాన్
- కాకతీయ యూనివర్సిటీలో ఎఐఎస్‌ఎఫ్ 90వ వార్షికోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ




ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ : సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో హనుమకొండ జిల్లా కేంద్రంగా మూడు రోజులపాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఎఐఎస్‌ఎఫ్ 90వ వార్షికోత్సవ తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జ్ రెహమాన్ పిలుపునిచ్చారు. ఆదివారం కాకతీయ యూనివర్సిటీ ఎఐఎస్‌ఎఫ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఫస్ట్ గేట్ ఎదుట ఏఐఎస్‌ఎఫ్ 90వ వార్షికోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రెహమాన్‌తో పాటు ఏఐఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్, యూనివర్సిటీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యోద్యమ కాలంలో విద్యార్థులను, యువతను ఏకం చేసి బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడిన చారిత్రక నేపథ్యం ఎఐఎస్‌ఎఫ్‌కు ఉందన్నారు. విద్య అనేది కొద్దిమందికి మాత్రమే పరిమితమయ్యే వస్తువు కాదని, ప్రతి విద్యార్థికి సమానంగా నాణ్యమైన, శాస్త్రీయ విద్య అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో ఎఐఎస్‌ఎఫ్ నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు.

ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులపై ఆర్థికభారం పెరుగుతోందని, ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయడం ద్వారానే సామాన్య కుటుంబాల విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వ యూనివర్సిటీలకు అవసరమైన స్థాయిలో మౌలిక వసతులు, సిబ్బంది, అభివృద్ధి నిధులు అందకపోవడం ఆందోళనకరమని రెహమాన్ అన్నారు. రాష్ట్ర విద్యా విధానం 2026లో కూడా యూనివర్సిటీ స్థాయిలో ఫ్యాకల్టీ ఖాళీలను ప్రత్యేకంగా నమోదు చేసిన నేపథ్యంలో, ఖాళీల భర్తీపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీలకు ప్రత్యేక అభివృద్ధి నిధులు కేటాయించి, ఖాళీగా ఉన్న అన్ని టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యూనివర్సిటీలను కేవలం భవనాలు, తరగతి గదులుగా కాకుండా పరిశోధన, నూతన ఆవిష్కరణలు, సామాజిక చైతన్యానికి కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని కోరారు. అదేవిధంగా, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి, విద్యార్థుల హక్కులు, నాణ్యమైన విద్య, పరిశోధన అవకాశాలు, హాస్టల్ సౌకర్యాలు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాలపై ఎఐఎస్‌ఎఫ్ తన ఉద్యమాలను మరింత విస్తృతం చేస్తుందని రెహమాన్ స్పష్టం చేశారు. ఎఐఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ మాట్లాడుతూ, తెలంగాణలో ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలంటే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, విద్యాశాఖ పరిపాలనా పోస్టులను భర్తీ చేయడం అత్యవసరమన్నారు. ఎంఈఓ, డీఈవో వంటి కీలక పోస్టుల్లో ఖాళీలు లేదా అదనపు బాధ్యతల వ్యవస్థ కొనసాగితే విద్యా పరిపాలనపై ప్రభావం పడుతుందని, తెలంగాణ విద్యా విధానం 2026 కూడా పూర్తి స్థాయి ఎంఈఓ, డీఈవో పోస్టుల భర్తీ అవసరాన్ని ప్రస్తావిస్తోందని తెలిపారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, ప్రభుత్వ యూనివర్సిటీలను పరిరక్షించడం, విద్యార్థుల హక్కులను సాధించడం కోసం ఎఐఎస్‌ఎఫ్ నిరంతరం ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమిస్తుందని తెలిపారు. సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో హనుమకొండ జిల్లా కేంద్రంలో జరిగే ఏఐఎస్‌ఎఫ్ 90వ వార్షికోత్సవ తెలంగాణ రాష్ట్ర మహాసభలను విద్యార్థులు, యువత, విద్యావేత్తలు, ప్రజలు విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# పోరాటాలతోనే చట్టాలు..

# ప్రజా సమస్యలు పరిష్కారం





- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి

ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) : ప్రజా పోరాటాలతోనే చట్టాలు వస్తాయని, ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని, చట్టాల అమలుకు పోరాటాలు చేయవలసి వస్తుందని, మాజీ శాసనసభ్యులు, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుల ముత్యాలు, మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం ఆధ్వర్యంలో లో లెవెల్ బ్రిడ్జిలను హై లెవెల్ బ్రిడ్జిల నిర్మాణ సాధనకై చేపట్టిన రెండు రోజుల పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ నుండి నేటి వరకు ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేపట్టాయని, ప్రజా సమస్యలు, రైతాంగ సమస్యలు, వ్యవసాయ కూలీల సమస్యలు, సంఘటిత అసంఘటిత కార్మిక సమస్యలపై ఉద్యమాలు చేపడుతున్నాయని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలలో ఎప్పుడూ ముందుంటుందని, మండలంలోని లో లెవెల్ బ్రిడ్జిలు రాయిపల్లి కాలువపల్లి మధ్య, ఆత్మకూరు మొరిపిరాల గ్రామాల మధ్య, ఆత్మకూరు కొరటికల్ గ్రామాల మధ్య, రహీంఖాన్ పేట పోతిరెడ్డిపల్లి మధ్య, సారగండ్ల గూడెం పారుపల్లి,రాఘవాపురం కూరెళ్ళ గ్రామాల మధ్యలో, కూరెళ్ళ పల్లెర్ల మధ్యలో, లింగరాజుపల్లి వలిగొండ హైవే రోడ్డు మధ్యలో ఉన్న లో లెవెల్ బ్రిడ్జిలను హై లెవెల్ బ్రిడ్జిల నిర్మాణ సాధనకై మండల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించి సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేస్తారని అన్నారు. పాదయాత్ర ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొంటారని తెలిపారు. పాదయాత్రలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుల ముత్యాలు, మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం, ఎండి.నయీమ్, గుర్రం రాజమణి, జక్క దయాకర్ రెడ్డి, బొబ్బల లాల్ రెడ్డి, అంబోజు రాములు, జల్ది రాములు, మజ్జిగ నరసయ్య, కల్వల నరసయ్య, మారుపాక అంజయ్య, సోలిపురం లింగారెడ్డి, గాజుల సిద్ధులు, పాదయాత్రలో పాల్గొనగా జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఇమ్రాన్, చెక్క వెంకటేష్, కళ్లెం కృష్ణ, కుసుమని హరిచంద్ర, పేరబోయిన మహేందర్, బండి జంగమ్మ జిల్లా కౌన్సిల్ సభ్యులు బబ్బూరి శ్రీధర్, తెలంగాణ ప్రజా నాట్యమండలి కళాకారులు ఖుషి పాక నరసింహ, కలకొండ సంజీవ, గణేష్, కట్ల యాదగిరి, మోత్కూర్ మోట కొండూర్ కార్యదర్శులు అన్నెపు వెంకటేష్, గాదగాని మాణిక్యం పాదయాత్రకు సంఘీభావం తెలుపగా అన్ని గ్రామాల నుండి పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తే ఊరుకోం

- సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య



ప్రజాపక్షం/పెద్దపల్లి : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం ఆరు మాసాల తర్వాత ఎట్టకేలకు సెప్టెంబర్ 25న నిర్వహిస్తున్నట్టుగా ఎజెండా ప్రతులు రావడం జరిగిందని, ఇన్ని రోజుల తర్వాత సమావేశం నిర్వహిస్తున్నప్పటికీ ప్రజల పట్ల ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధి కంటే కూడా ప్రజాధనాన్ని ఎలా దోచుకోవాలి ఏ విధంగా కమీషన్లు రాబట్టుకోవాలి అనే విధంగా ఎజెండాను రూపొందించారు తప్ప ప్రత్యక్షంగా ప్రజలకు ఉపయోగపడే విధంగా లేదని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తే చూస్తూ ఊరుకోం అని సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఎజెండా అంశాలపై స్పందించిన సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశాల ఎజెండాను పరిశీలిస్తే కార్పొరేషన్ లోని 60 డివిజన్‌లో సద్దుల బతుకమ్మ సందర్భంగా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేసేందుకు గాను కిరాయి ప్రతిపాదికన రూ.22 లక్షల బిల్లును పెట్టడం జరిగిందని సుమారు ప్రతి డివిజన్లో 20 సెంటర్లలో బతుకమ్మ ఆడుకుంటారని భావించిన 60 డివిజన్లకు 1200 లైట్లు అవసరం పడ్డా కూడా ఒక్కో లైటుకు రూ.2000 వేసుకున్న రూ.24 లక్షలకు కొత్త లైట్లు సొంతంగా కార్పొరేషన్ కొనుగోలు చేయవచ్చనీ, ఇలాంటి పరిస్థితుల్లో ఎవరు జేబులు నింపడానికి రూ.22 లక్షలు వెచ్చించి కిరాయి ప్రతిపాదికన లైట్లు ఏర్పాటు చేద్దామని బిల్లులు పెట్టారో చెప్పాలని ప్రశ్నించారు. అంతే కాకుండా రామగుండం కార్పొరేషన్ కార్యాలయం రిపేర్ నిమిత్తం రూ.20 లక్షలు, కార్పొరేటర్లకు మొబైల్ ఫోన్ల కోసం రూ.30 లక్షలను కేటాయించడానికి ఎజెండా రూపొందించడం జరిగింది. ఈరోజు కార్పొరేషన్ అధికారులు పాలకపక్షాలు చేస్తున్న అవినీతిని మభ్యపెట్టడానికి కార్పొరేటర్లకు మొబైల్ ఫోన్‌లో పథకం పెట్టడం ప్రజాధనాన్ని దుర్వినియోగపరచడమేనని విమర్శించారు. సుమారు రూ.70–80 లక్షల నిధులు ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేని వాటి మీద పెట్టకుండా సద్వినియోగం చేయాలని కోరారు. మేయర్‌కి గెలిచిన మొదటి రోజే సీపీఐగా ఒక రూపాయి అంత్యక్రియ పథకాన్ని ప్రారంభించాలని విజ్ఞప్తి చేయడం జరిగిందని కానీ ఇప్పటివరకు కార్పొరేషన్ కార్యాలయ అధికారులకు, పాలకులకు సోయి లేదని ఇప్పటికైనా ఆ రూ.30 లక్షలతో ఒక్క రూపాయి అంత్యక్రియల పథకాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ ఈ పథకం ద్వారా కార్పొరేషన్ పరిధిలోని పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు వారి కష్ట సమయంలో కొంత ఊరటనిచ్చిన వాళ్ళమవుతామని పేర్కొన్నారు. నర్సరీలో ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నర్సరీ నుండి తొలగించి ఇతరత్రా పనులను వాళ్లను నియమించి, ఇప్పుడు వన మహోత్సవం పేరిట వర్షాకాలం పూర్తి కావాల్సి వస్తున్న సమయంలో రూ.64 లక్షలు కేటాయించడానికి కాంట్రాక్టర్ల జేబులు నింపడానికి తప్ప చిత్తశుద్ధితో కాదని దుయ్యబట్టారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలోని స్మశాన వాటిక అత్యంత దుర్భేద్యంగా చెట్లు పెరిగి చీకటిగా ఉందని పోరాటం చేసినప్పటికీ ఇప్పటివరకు కనీసం స్పెషల్ డ్రైవ్ కూడా నిర్వహించకపోవడం పాలకుల అసమర్థతకు నిదర్శనమని అన్నారు. రామగుండం కార్పొరేషన్‌కి 2024 లో కేటాయించిన నిధులు లాప్స్ అయినందున అప్పుడు జరిగిన పనులకు ఇప్పుడు 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి సుమారు రూ.50 లక్షలు చెల్లించడానికి ఎజెండా రూపొందించడం సరైన పద్ధతి కాదని మంజూరైన రూ.62 లక్షల నిధులు లాప్స్ కావడానికి గల కారణాలు అందు లో అధికారుల తప్పిదమా? కాంట్రాక్టర్ల తప్పిదమా? పూర్తిస్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రామగుండం కార్పొరేషన్ ప్రజలు చెల్లించే పన్నులకు సార్ధకత లభించేలా ప్రతి రూపాయికి విలువ పెరిగేలా పనులు కేటాయించాలి తప్ప పాలకులు, అధికారులు తమ జేబులు నింపుకునే విధంగా పనులు కేటాయించకండని ప్రజా సొమ్ము దుర్వినియోగం చేస్తే పోరాట రూపంలో పాలకులకు బుద్ధి చెప్తామని సూర్య హెచ్చరించారు.

# ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వెంకటేష్




ప్రజాపక్షం/బోడుప్పల్ (హైదరాబాద్) : ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో మీటరు చార్జి పెంచటంతో పాటు న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు, ఆటో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కామ్రెడ్ వెంకటేష్ డిమాండ్ చేసారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆటో యూనియన్ కార్యదర్శి బెజ్జల కృష్ణమూర్తి అధ్యక్షతన ఆదివారం ఉప్పల్ బస్‌డిపో వద్ద ఏర్పాటు చేసుకొన్న ఎఐటియుసి యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా నడుస్తున్న ఓలా, ర్యాపిడో, ఊబర్ క్యాబ్‌లను అరికట్టి ప్రభుత్వమే నేరుగా ఒక యాప్ తీసుకొని వచ్చి నడిపించాలన్నారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆటో కార్మి కులందరూ సంఘటితంగా సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి సిపిఐ మండల కార్యదర్శి రచ్చ కిషన్, దండు రమేష్, ఐలయ్య, మదార్, బాపిరాజు, ఆటో యూనియన్ నాయకులు బాబు తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ లబ్ధిదారులకు..

# నేటి నుంచి అలాట్‌మెంట్ లేఖలు

**రాయదుర్గంలో 480 ఫ్లాట్లకు శంకుస్థాపన**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇందిరమ్మ ఇళ్లు టవర్స్ ప్రాజెక్టులకు సంబంధించిన అలాట్‌మెంట్ లెటర్లను సోమవారం నుండి లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు (టిజిహెచ్‌బి) వెల్లడించింది. ఎంపికైన లబ్ధిదారుల రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్లకు ఎస్ఎంఎస్, వాట్సాప్ ద్వారా నేరుగా ఈ లెటర్లు పంపిస్తామని చెప్పింది. వీటితో పాటు టిజిహెచ్‌బి అధికారిక వెబ్‌సైట్‌లో కూడా అలాట్‌మెంట్ లెటర్లను అందుబాటులో ఉంచుతున్నారు. దరఖాస్తులు, లాటరీ ఎంపికల ఆన్‌లైన్ వివరాలను ఇప్పటికే వెబ్‌సైట్‌లో ఉంచినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని రాయదుర్గంలో ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ నిర్మాణానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. రాయదుర్గం మల్కం చెరువు వెనుక భాగంలో ఉన్న 2.85 ఎకరాల ప్రభుత్వ హౌసింగ్ బోర్డు భూమిలో 480 ఫ్లాట్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. ఒక్కో ఫ్లాట్ సుమారు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మించనున్నారు.

**విలువైన రాయదుర్గం..**

నాలెడ్జ్ సిటీ ప్రాంతంలో సాధారణ మార్కెట్‌లో ఇటువంటి ఫ్లాట్ విలువ సుమారు రూ.50లక్షలు ఉంటుంది. అయితే ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారునికి కేవలం రూ.6.00లక్షల వాటాతో ఈ ఇంటిని అందిస్తోంది. దీనికి తోడు ప్రభుత్వం రూ.5.00లక్షల సబ్సిడీని భరించడంతో పాటు, భూమి వ్యయాన్ని కూడా పూర్తి ఉచితంగా కల్పిస్తోంది. ఆగస్టు 2026లో జరిగిన టిజిఐఐసి ఈ వేలాల్లో సమీప భూములు ఎకరానికి రూ.264 కోట్ల నుండి రూ.269 కోట్ల వరకు పలికిన దృష్ట్యా, ఈ ప్రాజెక్టుకు కేటాయించిన 2.85 ఎకరాల స్థలం మార్కెట్ విలువ రూ.752 కోట్ల నుండి రూ.767 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఉపాధి కేంద్రాలు, నగర మౌలిక వసతులకు చేరువలో పేదలకు ఉచిత భూమి, సబ్సిడీతో గృహాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది.



రాయదుర్గంలో జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన అలాటీలు తమ కుటుంబ సభ్యులతో కలిసి మధ్యాహ్నం 3:30 గంటలకు కార్యక్రమ ప్రాంగణానికి చేరుకుని, ఈ శంకుస్థాపన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని వైస్ చైర్మన్, హౌసింగ్ కమిషనర్ కోరారు.

# రైల్వే నీటిపై ప్రత్యేక నిఘా

**ఏడు రోజుల్లో 1,873 నీటి నమూనాల పరీక్షలు**
**ఒక్కటీ కలుషితంగా తేలలేదు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రయాణికులు, రైల్వే ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు కీలకమైన తాగునీటి నాణ్యతపై దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక దృష్టి సారించింది. రైల్వే స్టేషన్లు, కాలనీలు, ఆసుపత్రుల్లో సరఫరా చేస్తున్న నీటిని నిరంతరం పరీక్షిస్తూ నాణ్యతను పర్యవేక్షిస్తోంది. ఈనెల 9 నుంచి 15 వరకు ఏడు రోజుల వ్యవధిలో మొత్తం 1,873 నీటి నమూనాలను పరీక్షించగా, ఇప్పటివరకు ఫలితాలు అందిన నమూనాల్లో ఒక్కటీ అన్‌ఫిట్‌గా నమోదు కాలేదు. నీటి నాణ్యతను మెడికల్ విభాగానికి చెందిన ఇన్‌స్పెక్టర్లు, పర్యవేక్షకులు క్రమం తప్పకుండా తనిఖీ చేస్తుండగా, సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇండియన్ రైల్వేస్ మెడికల్ మాన్యువల్‌లో నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం నీటిని మూడు దశల్లో పరీక్షిస్తున్నారు. నీటి శుద్ధి అనంతరం అందులో ఉండాల్సిన రెసిడ్యువల్ క్లోరిన్ స్థాయిని ప్రతిరోజూ నీటి వనరు, సరఫరా చివరి ప్రాంతాల్లో పరీక్షిస్తున్నారు. ఈనెల 9వ తేదీ నుంచి 15 వరకు 1,722 నమూనాలను పరీక్షించగా, మొత్తం 1,722 నమూనాలు ఫిట్‌గా తేలాయి. ఒక్క నమూనా కూడా అన్‌ఫిట్‌గా నమోదు కాలేదు. నీటిలో ఈకొలై, కోలిఫామ్ వంటి బ్యాక్టీరియా ఉన్నాయా అనే అంశాన్ని గుర్తించేందుకు బ్యాక్టీరియాలజికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రధాన స్టేషన్లు, కాలనీలు, ఆసుపత్రుల్లో నెలకు ఒకసారి, చిన్న స్టేషన్లు, కాలనీల్లో రెండు నెలలకు ఒకసారి నమూనాలను సేకరిస్తున్నారు. ఏడు రోజుల్లో 145 నమూనాలు సేకరించగా, 67 నమూనాల ఫలితాలు అందాయి. అందులో ఒక్కటీ అన్‌ఫిట్‌గా తేలలేదు. మరో 78 నమూనాల ఫలితాలు రావాల్సి ఉంది.

**ఆరు నెలలకు ఒకసారి రసాయన పరీక్ష..**

నీటి వనరుల నుంచి రసాయన విశ్లేషణ కోసం ఆరు నెలలకు ఒకసారి నమూనాలను సేకరిస్తున్నారు. కొత్త నీటి వనరు అందుబాటులోకి వచ్చినప్పుడు కూడా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఏడు రోజుల్లో 6 నమూనాలు సేకరించగా, వాటి ఫలితాలు రావాల్సి ఉంది. నీటి నమూనా అన్‌ఫిట్‌గా తేలిన సందర్భంలో వెంటనే సంబంధిత సీనియర్ సెక్షన్ ఇంజినీర్ (వాటర్ వర్క్స్)కు సమాచారం ఇచ్చి అవసరమైన చర్యలు చేపట్టేలా వ్యవస్థను ఏర్పాటు చేశారు. బ్యాక్టీరియాలజికల్ పరీక్షల్లో విఫలమైన నమూనాలు వస్తే గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్లు, నీటి ట్యాంకులను శుభ్రం చేయడంతో పాటు మళ్లీ నమూనాలు సేకరించి పరీక్షిస్తారు. అవసరమైతే ఇంజినీరింగ్ విభాగంతో సంయుక్త తనిఖీలు నిర్వహిస్తారు.

రైల్వే స్టేషన్లు, కాలనీలు, ఆసుపత్రుల్లో సరఫరా చేసే నీటి నాణ్యత విషయంలో అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఆదేశించారు. తరచూ తనిఖీలు నిర్వహిస్తూ నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

# కెసిఆర్, రేవంత్‌రెడ్డి నయా నిజాంలు

**మెదక్ బిజెపి ఎంపి రఘునందన్ రావు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిఎం రేవంత్ రెడ్డి, బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ ఇద్దరూ నయా నిజాంలుగా వ్యవహరిస్తున్నారని మెదక్ బిజెపి ఎంపి రఘునందన్ రావు విమర్శించారు. ప్రజలు ఈ నయా నిజాంలను తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో రఘునందన్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు రెండూ ఒకే తాను ముక్కలని వ్యాఖ్యానించారు. కెసిఆర్, రేవంత్ రెడ్డిలు ప్రజలను పీడించిన నిజాం పాలన తరహాలోనే వీరి పాలన సాగుతోందని ఆరోపించారు. అసెంబ్లీలో నిజాంను ప్రశంసించిన సందర్భాలకు



సంబంధించిన వీడియోలను మీడియా ముందు ప్రదర్శించారు. కెసిఆర్ ఎలాంటి లెక్కాపత్రాలు లేకుండా నిజాంను పొగిడారని మండిపడ్డారు. ఆదివాసీలు, బలహీన వర్గాలపై నిజాం పాలనలో జరిగిన అన్యాయాలను గుర్తుచేశారు.

నిజాం పాలనలో జరిగిన బైరాన్‌పల్లి ఘటనను ప్రస్తావిస్తూ అలాంటి చరిత్ర ఉన్న వ్యక్తిని ఎలా గొప్పవారిగా పేర్కొంటారని ప్రశ్నించారు. కెసిఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ ఎంఐఎంకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్నారు. భూముల రికార్డులన్నీ ప్రభుత్వం వద్ద ఉన్నప్పుడు వాటిని పరిశీలించేందుకు మళ్లీ వెళ్లాల్సిన అవసరం ఏముందన్నారు.

**దానం నాగేందర్‌కు ఉప ఎన్నికలు కలిసి రావు :** ఖైరతాబాద్ ఉప ఎన్నికలో బిజెపి విజయం సాధించడం ఖాయమని రఘునందన్ రావు ధీమా వ్యక్తం చేశారు. దానం నాగేందర్‌కు ఉప ఎన్నికలు ఎప్పుడూ కలిసి రావన్నారు. గతంలో కాంగ్రెస్ నుంచి తెలుగుదేశం పార్టీలోకి, తెలుగుదేశం పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి, కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్‌లోకి, బిఆర్ఎస్ నుంచి తిరిగి కాంగ్రెస్‌లోకి మారారన్నారు. గతంలో టిడిపి నుంచి కాంగ్రెస్‌లోకి మారిన సందర్భంలో ఆసిఫ్ నగర్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో దానం నాగేందర్ ఓటమి పాలయ్యారని, ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఎదురవుతుందన్నారు.

## ఉప ఎన్నిక వస్తే కాంగ్రెస్ అడ్రస్ గల్లంతే : దాసోజు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉప ఎన్నిక వస్తే కాంగ్రెస్ అడ్రస్ గల్లంతవుతుందని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజుశ్రవణ్ అన్నారు. ఉపఎన్నికలను ఎదుర్కొనలేకనే దానం నాగేందర్‌ను సిఎం రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టు మెట్లెక్కిస్తున్నారని ఆరోపించారు. ఈసారి ఖైరతాబాద్ ఉప ఎన్నికలో బిఆర్ఎస్ విజయం ఖాయమని, సాక్షాత్తూ రేవంత్ రెడ్డి పోటీచేసినా కాంగ్రెస్ పార్టీ ఓడిపోతుందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైకోర్టు మొట్టికాయలు వేయగానే పులిలా గర్జించిన దానం నాగేందర్ తెల్లారేసరికి పిల్లిలా మారి సుప్రీంకోర్టును ఆశ్రయించారని ఎద్దేవా చేశారు. తాను సుప్రీం కోర్టుకూ వెళ్ళబోనని, రాజీనామా చేసి మళ్లీ ఖైరతాబాద్ బరిలో నిలబడతానని వెల్లడించిన దానం నాగేందర్ రాత్రికి రాత్రే సుప్రీం కోర్టు లంచ్ మోషన్ దాఖలు చేశారన్నారు. సిఎం రేవంత్‌రెడ్డికి ప్రజాస్వామ్యం, కాంగ్రెస్ పాలనపైన నమ్మకముంటే ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికను ఎదుర్కోవాలని సూచించారు.

### కెసిఆర్ ఇంటి ముందు కాంగ్రెస్ ఎంపిలు

# డ్రామాలు చేస్తున్నారు

**బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం తీసుకొచ్చిన కెసిఆర్ ఇంటి ముందు కాంగ్రెస్ ఎంపిలు డ్రామాలు చేస్తున్నారని బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. ఎంపిలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ ప్రైవేటు వ్యక్తులకు చెందిన ఆస్తులపైన దాడి చేయడానికి వెళ్లారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పోలీసు బందోబస్తుతో హరీశ్‌రావు పొలాలపైకి కాంగ్రెస్ వాళ్ళను పంపించారని, సిఎం ప్రైవేటు ఆస్తుల వద్దకు వెళ్తే ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి భూ దందాలకు పాల్పడుతున్నారని, నాగోల్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కొడుకు తుమ్మల యుగంధర్ అనుచరుడు ఒక వ్యక్తిని మర్డర్ చేశారని, తుమ్మలూరులో రూ.300 కోట్ల విలువ చేసే భూమిని అధికార పార్టీ ఎమ్మెల్యే కబ్జా చేశారని ఆరోపించారు.



ట్రాన్స్‌జెండర్లకు, కాంగ్రెస్ వారికి తేడా లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమంలో మల్లురవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎక్కడ ఉన్నారని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాలు చేసే నైతిక అర్హత కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కి లేదన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు కల్వకుర్తి శ్రీనివాస్ యాదవ్, సాయితేజ, రాజు మహేశ్వరం బాధిత రైతు నరేష్ పాల్గొన్నారు.



నిమజ్జనానికి తరలిన పి అండ్ టి కాలనీ, దిల్‌సుఖ్‌నగర్‌లోని సప్తగిరి యూత్ వినాయకుడు

### ఘనంగా సెంట్రల్ గురుద్వారా సాహిబ్ గౌలిగూడ శతాబ్ది వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలోని చారిత్రాత్మక సెంట్రల్ గురుద్వారా సాహిబ్ గౌలిగూడ 100 సంవత్సరాల ఆధ్యాత్మిక పయనాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అత్యంత వైభవంగా నిర్వహించారు. విశ్వాసం, నిస్వార్థ సేవ, సమాజంలో సౌభ్రాతృత్వాన్ని చాటిచెప్పేలా సాగిన ఈ వేడుకలకు వేలాది మంది సిక్కు భక్తులతో పాటు వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై, గురు గ్రంథ్ సాహిబ్‌జీకి ప్రత్యేక ప్రార్థనలు సమర్పించారు. 1926లో స్థాపించిన గౌలిగూడ సెంట్రల్ గురుద్వారా నగర పరిణామక్రమానికి, ఇక్కడి సామాజిక సామరస్యతకు ప్రతీకగా నిలిచింది. ఈ చారిత్రాత్మక మైలురాయిని పురస్కరించుకుని గురుద్వారా ప్రబంధక్ కమిటీ, తెలంగాణలోని ఇతర గురుద్వారాల సహకారంతో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో భారీ 'విశాల్ దివాన్' (మతపరమైన మహాసభ)ను ఏర్పాటు చేసింది. ఈ వేడుకల్లో సిక్కు మత ప్రముఖులు పాల్గొని ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. నాందేడ్‌లోని పవిత్ర పంచ తఖ్తుల్లో ఒకటైన తఖ్త్ సచ్ఖండ్ హజూర్ అబ్చల్ నగర్ సాహిబ్ జాతేదార్ సింగ్ సాహిబ్ సంత్ బాబా కుల్వంత్ సింగ్ జీ, నందెడ్ లంగర్ సాహిబ్‌కు చెందిన సంత్ బాబా బల్విందర్ సింగ్ జీ, అలాగే ఢిల్లీ సిక్కు గురుద్వారా మేనేజ్‌మెంట్ కమిటీ (డిఎస్‌జిఎంసి) అధ్యక్షుడు హర్మీత్ సింగ్ కల్కా పాల్గొని శతాబ్ది శుభాకాంక్షలు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రముఖ రాగీ జాతాలు భాయ్ జగ్జీత్ సింగ్ బాబిహా (ఢిల్లీ), భాయ్ బాల్‌ప్రీత్ సింగ్ (లుధియానా), భాయ్ జగ్‌ప్రీత్ సింగ్ ఖన్నావాలే, భాయ్ రవీందర్ సింగ్ తదితరులు ఆలపించిన గుర్బానీ కీర్తనలు, ప్రవచనాలు సభలో భక్తిరసాన్ని నింపాయి. జాతీయ సమైక్యత, సమానత్వం, మానవ సేవ, శాంతియుత సహజీవనం గురించిన గురువుల బోధనలను భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా గౌలిగూడ సెంట్రల్ గురుద్వారా ప్రబంధక్ కమిటీ అధ్యక్షుడు సర్దార్ త్రిలోక్ సింగ్ మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాలు కేవలం వంద ఏళ్ల సమయాన్ని పూర్తిచేసుకోవడమే కాకుండా సిక్కు సమాజం తెలంగాణ సామాజిక, సాంస్కృతిక రంగానికి అందించిన సేవలకు నిదర్శనమన్నారు.

### స్వాతంత్ర్య సమరయోధుడు

# ఏటుకూరి కృష్ణమూర్తి కన్నుమూత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు ఏటుకూరి కృష్ణమూర్తి (104) అనారోగ్యంతో ఆదివారం రాత్రి 10:23 గంటలకు హైదరాబాద్ కేర్ బంజారా హాస్పిటల్‌లో మృతి చెందారు.

సోమవారం ఉదయం 9:30 గంటల నుండి 11 గంటల వరకు కృష్ణమూర్తి భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఉంచనున్నారు. మధ్యాహ్నం మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. (మహాప్రస్థానం పేరు తర్వాత తెలియజేయబడుతుంది).

కాగా, కృష్ణమూర్తి మృతి పట్ల సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు సంతాపం,



కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కృష్ణమూర్తితో, వారి కుటుంబ సభ్యులతో తనకు అత్యంత సన్నిహిత సంబంధం ఉందన్నారు. కృష్ణమూర్తి, వారి కుటుంబ సభ్యులు పార్టీ పట్ల అంకితభావంతో, విధేయత ఉండేవారని, వారు అనేక ప్రజోపయోగ కార్యక్రమాలకు తోడ్పడ్డారని తెలిపారు. కృష్ణమూర్తి తనయుడు ఏటుకూరి శ్రీనివాస్ మూర్తి తనకు మంచి మిత్రుడు, సహచరుడని, ప్రస్తుతం సిపిఐ శాసనసభాపక్ష కార్యాలయ కార్యదర్శిగా పనిచేస్తున్నారని తెలిపారు.

# పిడుగుపాటుకు విద్యార్థి మృతి

**ప్రజాపక్షం/నిజామాబాద్ రూరల్ :** వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్న విద్యార్థి పిడుగుపాటుకు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఆదివారం ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని 44వ నెంబర్ జాతీయ రహదారిలోని దేవిగాడ్ తండా పంచాయతీ పరిధిలో జరిగింది.

దేవిగాడ్ తండాకు చెందిన బాదావత్ చరణ్(18) వ్యవసాయ పొలం వద్ద ప్రాణాలు కోల్పోయాడని ఇందల్వాయి ఎస్ఐ భుక్య సుమలత తెలిపారు. స్థానికులు, ఎస్ఐ సుమలత తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. స్వంత వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిన చరణ్ ఆకస్మాత్తుగా కురిసిన వర్షానికి పిడుగులు తోడు కావటంతో విద్యార్థి చరణ్ వ్యవసాయ క్షేత్రంలోనే ప్రాణాలు కోల్పోయాడని తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న చరణ్‌ను హుటాహుటిన జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించే క్రమంలోనే మృతి చెందినట్లు తెలిసింది. మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టు మార్టం కోసం మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుమలత తెలిపారు.



### శాంతి, సామరస్యాల ఆచరణతోనే..

# మానవ జీవితానికి సార్థకత

**రోటేరియన్లు చక్రవర్తి, అజయ్‌కుమార్, ఝాన్సీ, జసింత, బాలకోటిరెడ్డి ఉద్బోధ**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాంతి, సామరస్యాలను ఆచరించినపుడే మన దైనందిన జీవితానికి అర్థం, పరమార్థం, సార్థకత ఏర్పడుతుందని ముఖ్యవక్తలు, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షులు రోటేరియన్ చక్రవర్తి, హైదరాబాద్ మావెరిక్స్ అధ్యక్షులు రోటేరియన్ అజయ్‌కుమార్, రోటేరియన్ ఝాన్సీ. రోటేరియన్, మీడియేటర్ జసింత ఏజి రోటేరియన్ బాల కోటిరెడ్డి ఉద్బోధించారు. ఆదివారం నాలుగు రోటరీ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో అర్థవంతమైన శాంతియుత పాదయాత్ర జరిగింది. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మావెరిక్స్ (ఆర్‌సిహెచ్‌ఎం), రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్, రోటరీ క్లబ్ ఆఫ్ కృషి రాజేంద్రనగర్, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్‌ల ఆధ్వర్యంలో జరిగిన అర్థవంతమైన శాంతియుత పాదయాత్ర కెబిఆర్ పార్క్ ప్రవేశ ద్వారం నుంచి ప్రారంభమైంది.ఈ పాదయాత్రలో రోటేరియన్లు రెగ్యులర్



వాకర్స్‌తో కలిసి పార్క్‌లో 2 కి.మీ. మేరకు నడిచారు. దైనందిన జీవితంలో శాంతి, సామరస్యం ప్రాముఖ్యత గురించి వక్తలు విపులీకరించారు. ఈ సందర్భంగా వక్తల ప్రసంగం అత్యంత స్ఫూర్తిదాయకంగా సాగింది. రోటేరియన్, మధ్యవర్తి జసింత మాట్లాడుతూ ఏవైనా వివాదాల పరిష్కారానికి హైకోర్టు ఆమోదం పొందిన మధ్యవర్తిత్త కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన శాంతియుత పాదయాత్రలో అందరూ కలిసి హైదరాబాద్ జింఖానా క్లబ్ వరకు నడిచారు.

# జూరాల వద్ద హైడ్రామా




**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల :** వనపర్తి జిల్లా పరిధిలో సాగునీరు అందక ఎండిపోతున్న పంటలను కాపాడుకోవడానికి స్వయంగా జూరాల ప్రాజెక్టు వద్దకు వెళ్లి ఎడమ కాలువ గేట్లు ఎత్తిన రైతుల చర్యతో అధికారులు, ప్రభుత్వం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అర్ధరాత్రి వేళ భారీ పోలీసు బలగాలను మోహరించి, ప్రాజెక్టు గేట్లను తిరిగి బంద్ చేయించింది. వనపర్తి జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో వేసిన పంటలకు సాగునీరు అందక రోజురోజుకూ ఎండిపోతున్నాయి. ప్రాజెక్టుల్లో నీరు ఉన్నప్పటికీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండాపోయింది. పంటలు చేతికి వచ్చే సమయంలో నీరు లేకపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందిన రైతులు శనివారం పెద్ద ఎత్తున జూరాల ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. అధికారులతో మాటామాటా పెరగడంతో, వేరే దారి లేక రైతులే స్వయంగా ముందుకొచ్చి, ప్రాజెక్టు ఎడమ కాలువ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. అర్ధరాత్రి పోలీసుల బందోబస్తు గేట్ల మూసివేత రైతులు స్వయంగా గేట్లు ఎత్తడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రభుత్వం, రాత్రికే రాత్రే ప్రాజెక్టు వద్ద పరిస్థితిని ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రణాళిక వేసింది. అర్ధరాత్రి దాటిన తర్వాత వందలాది మంది పోలీసులను జూరాల ప్రాజెక్టు వద్దకు పంపారు. రైతులు ఎత్తిన ఎడమ కాలువ గేట్లను అధికారులు రాత్రికి రాత్రే బలవంతంగా మూసివేశారు. రైతులు మళ్లీ ప్రాజెక్టు వైపు రాకుండా, గేట్ల దరిదాపుల్లోకి కూడా వెళ్లకుండా చుట్టూ ముళ్లకంచెలు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ప్రాజెక్టును తమ గుప్పెట్లోకి తీసుకున్నారు. దిక్కుతోచని స్థితిలో రైతన్నలు ప్రభుత్వ తీరుపై స్థానిక రైతాంగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ఉన్నప్పటికీ తమకు ఇవ్వకుండా గేట్లు మూసివేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ పంటలకు సాగునీరు విడుదల చేసే వరకు పోరాటాన్ని ఆపేది లేదని రైతులు స్పష్టం చేస్తుండటంతో, ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురువుతున్నారు.



## దైవచింతనే మానసిక ప్రశాంతతకు మార్గం

ఎంపి ఈటల రాజేందర్

**ప్రజాపక్ష/జవహర్ నగర్ :** విఘ్నాలను తొలగించే వినాయకుడిని భక్తి శ్రద్ధలతో పూజిస్తే సకల సుఖ సంతోషాలు కలుగుతాయని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జవహర్ నగర్ చంద్రపురి కాలనీలో కొలువుదీరిన గణనాథునికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మనిషికి మానసిక ప్రశాంతత ఎంతో అవసరమని, అది దైవచింతన ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి పనిలో ధర్మాన్ని, నీతిని, సేవాభావాన్ని పాటించడమే నిజమైన దైవచింతన అని తెలిపారు. వినాయకుడు తెలివికి, వివేకానికి, విజయానికి ప్రతీక అని ఆయనను ఆరాధించడం వల్ల అహంకారం తొలగి, వినయం, సహనం పెరుగుతాయని అన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు కేవలం మతపరమైన వేడుకలు మాత్రమే కాకుండా, కాలనీ వాసులందరినీ ఒకే చోట చేర్చి ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించే సామాజిక వేదికలని కొనియాడారు. చంద్రపురి కాలనీ వాసులు ఇంత ఘనంగా, భక్తి శ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విఘ్నేశ్వరుడి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నేతలు తెలుగు సుదర్శన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబు, గొడుగు వేణు, సంతోష్ గుప్తా, బిజెపి అధ్యక్షులు, నాయకులు, కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు,స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## జోనల్ టీంకి తరుణ్ ఎంపిక

**ప్రజాపక్షం / మర్పల్లి:** జోనల్ టీంకు ఎంపికైన పిల్లిగుండ్ల విద్యార్థి బొందలి తరుణ్, ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు. జోనల్ స్థాయిలో పాఠశాల విద్యార్థులకు అండర్ 17, అండర్ 14 వాళ్లకు వివిధ రకాలైన క్రీడాపోటీలు నిర్వహించారు. జోనల్ స్థాయిలో అండర్ 14లో ప్రాథమిక పాఠశాల విద్యార్థి (14) కబడ్డి మోమిన్‌పేట్ జోనల్ టీంకి ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయుడు ఎండి మోసిన్ మాట్లాడుతూ విద్యార్థులను అన్నిరంగాల్లో రాణించాలని వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయాలన్నారు. ఇలాంటి మట్టిలో మాణిక్యం లాంటి విద్యార్థుల ప్రతిభను వెలికి తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, గ్రామస్తులు విద్యార్థులను అభినందించారు.



## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

**ప్రజాపక్షం/పరిగి :** మండల పరిధిలోని యూసఫ్‌పూర్‌గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను పరిగి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ నర్సింలు, శశిధర్‌రెడ్డి, పరిగి మండల అధ్యక్షులు వెంకటరాములుతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రమేష్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**ధర్మశాల వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ**

పరిగి పట్టణంలోని ధర్మశాల వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమం అనంతరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించగా మున్సిపల్ వైస్‌చైర్మన్ రతన్, పిసిసి వైస్‌ప్రెసిడెంట్ పార్థసారధి, వైస్ చైర్మన్ రాజా పుల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు కేవలం పండగ మాత్రమే కాదు ప్రజలంతా ఐక్యతకు ప్రతీకగా సామాజికసేవా కార్యక్రమం అని అన్నారు. ప్రతి ఏటా ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంజనేయులు, నర్సింలు, మల్లేశం, కృష్ణ, జగన్,ఉమాశంకర్, తదితరులు పాల్గొన్నారు.



## గణేష్ మంటపాలను దర్శించిన బొంగునూరి కిషోర్ రెడ్డి

**ప్రజాపక్షం / దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ పరిధిలోని 294 డివిజన్ పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను బి.కె.ఆర్. ఫౌండేషన్ అధ్యక్షులు బొంగునూరి కిషోర్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవ నిర్వాహకులు, భక్తులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రజలందరిలో భక్తి, ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించుకోవాలని, యువత భక్తిశ్రద్ధలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయా కాలనీల్లోని గణేష్ మండపాల నిర్వాహకులు కిషోర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎ.ఆర్.సాదు యాదవ్, కుమార్ యాదవ్, పిట్ల శ్రీను, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జనానికి గణనాథులు



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మేడ్చల్ మల్కాజి గిరి జిల్లావ్యాప్తంగా మూడవ రోజు ప్రారంభమైన నిమజ్జనాలు ప్రతిరోజూ భక్తుల కోలాహలం, డప్పు వాయిద్యాలు, భక్తి గీతాలకు అనుగుణంగా మహిళలు, యువతీయువకుల నాట్యాలు, ఊరేగింపులతో గల్లీ గల్లీ హోరెత్తిపోతోంది. ఏ వీధి చూసినా ఉదయం నుండే గణనాథుడి నామస్మరణ, భక్తి పాటలు మైకుల్లో వినిపిస్తున్నాయి. వినాయక ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాలతో సహా అపార్ట్‌మెంట్లు, ఆయా ప్రాంత సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో కూడళ్లు, కమ్యూనిటీ హాళ్లు, ప్రధాన ప్రాంతాల్లో పోటాపోటీగా నిర్వాహకులు విద్యుత్ దీపాలు, పూల అలంకరణలతో ఆకర్షణీయంగా ఏర్పాటు చేసిన మండపాల్లో విభిన్న రూపాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్టించి హోమాలు, అన్నదానాలు, లడ్డు వేలాలు, భక్తి గీతాలు, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తుల పూజలు అందుకొంటుండటంతో అన్ని ప్రాంతాలు సందడిగా మారాయి. ప్రతి కాలనీకో ప్రతిమ ఏర్పాటై ఏ గల్లీ చూసినా భక్తి పాటలు, డిజె సాంగ్‌లు, పూజలతో గల్లీగల్లీ మార్మోగుతోంది. ప్రతి రోజూ అన్నదానాలు కొనసాగుతుండగా మండపాలను ఆయా ప్రాంతాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, రాజకీయ ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీ నేతలు మండపాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు. మూడవ రోజు నుండే ప్రారంభమైన నిమజ్జనాలు ప్రతి రోజూ ఊరేగింపులు, డప్పు వాయిద్యాలు, నాట్యాల నడుమ ఉత్సాహంగా సమీప ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, బేబీ పాండ్‌ల వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేస్తున్నారు.

**ఏర్పాట్లలో జిల్లా యంత్రాంగం తలమునకలు**

వినాయక చవితి రోజు మండపాల ఏర్పాటైన నాటి నుండి నిమజ్జనాలు పూర్తి అవటంలో ప్రశాంతంగా ముగించేందుకు జిల్లాలోని మున్సిపల్, పోలీస్, విద్యుత్, జలమండలి, వైద్యారోగ్య, ఆర్ అండ్‌బి, అగ్నిమాపక తదితర ప్రభుత్వ శాఖాధికారులు ప్రణాళికాయుక్తంగా ఏర్పాట్లు చేసారు. మండపాల నిర్వాహకులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో ఏఎంసి, సిఎంసి, మల్కాజిగిరి, సైబరాబాద్, జిల్లా రెవెన్యూ అధికారులు పలు సార్లు సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేసారు. పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని సున్నితమైన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా, సిసిటివి కెమెరాలు, అదనపు భద్రతా సిబ్బందితో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసారు. ఎంఎంసి కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతిలతో పాటు ఆయా ప్రాంత ఎంఎంసి సర్కిల్ కార్యాలయాల జెసి,డిసిలు నిమజ్జనాలు జరిగే చెరువులు, కుంటలు, బేబీ పాండ్‌ల వద్ద పరిశీలిస్తూ ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఏర్పాట్లు చేసారు. మల్కాజిగిరి పరిధిలో 15 వేలకు పైగా వినాయక మండపాలు ఏర్పాటయ్యాయి. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకోసం 1200 మంది ట్రాఫిక్ సిబ్బందిని నియమించారు. ఉప్పల్ క్రాస్ రోడ్, ఎల్బీనగర్, హబ్సిగూడ చౌరాస్తా, రాంపల్లి, కుషాయిగూడ, ఈసిఐఎల్ ఎక్స్ రోడ్, మల్కాజిగిరి, నేరేడ్‌మెట్ తదితర ప్రాంతాలను కీలకమైనవిగా గుర్తించి ట్రాఫిక్ చర్యలు చేపట్టా రు. కమిషనరేట్ పరిధిలో 27 నిమజ్జన ప్రాంతా ల్లో నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. శామీర్‌పేట లేక్, రాంపల్లి లేక్, ఉప్పల్ బేబీపాండ్, ఏదులాబాద్ ట్యాంక్, సఫిల్‌గూడ బేబీ పాండ్ తదితర నిమజ్జన ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసారు. 552 గణేష్ మండపాల్లో సుమారు 2200 మంది వాలంటీర్లను ఏర్పాటు చేసారు.

**ఎంఎంసి కమిషనర్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన**

నిమజ్జనాలు ఊపందుకొంటున్న క్రమంలో ఆదివారం మల్కాజిగిరి నగరపాలక సంస్థ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి రాంపల్లి చెరువు, శామీర్‌పేట చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించి దిశానిర్దేశం చేసారు. నిమజ్జన కేంద్రాల్లో సిబ్బంది నియామకం, షిఫ్టుల వారీగా విధుల కేటాయింపు, వివిధ ప్రభుత్వ శాఖలు, మండపాల నిర్వాహకులతో సమన్వయం తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. నిమజ్జన ప్రాంతాలతో పాటు మండపాల నుండి రాకపోకల మార్గాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన పూర్తి మౌలిక సదుపాయాలతో సిద్ధంగా ఉండాలన్నారు. పారిశుద్యం విషయంలో సిబ్బంది ఎప్పటికప్పుడు పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేస్తూ పూలు, ఆకులు, ఇతర పచ్చ వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించి, వేరుచేసి డీకంపోజ్ చేసి సహజ ఎరువుగా మార్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి

అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** విద్యార్థుల ప్రతిభను గుర్తించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించడం గొప్ప విషయమని దీంతో విద్యార్థుల్లో ఉత్సాహం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డిలు అన్నారు. ఆదివారం అలియాబాద్ మున్సిపాలిటి లాల్‌గడిమలక్‌పేటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి 2026 మండల స్థాయి పురస్కారాల ప్రధానోత్సవ సభను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవిఎస్ ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. దేవరయాంజాల్‌కు చెందిన డాక్టర్ బెజగం ఆనంద రావు, చింతల శ్రీనివాస్‌రెడ్డి, బర్రెంకబావి రవీందర్‌రెడ్డిలు తమ తల్లిదండ్రుల జ్ఞాపకాల పేరిట గత 16 సంవత్సరాలుగా ప్రతిభ కరబర్చిన విద్యార్థులను ప్రోత్సహిస్తు ఈ ప్రతిభా పురస్కారాల ను అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, ఎంఇఒ కమలాకర్, ప్రముఖులు ప్రహ్లాద్, లక్ష్మ ణ్, నర్సింహారెడ్డి, నాగేందర్, రమేష్, ప్రధానోపాధ్యాయులు బాలేష్, గోపాల్, మజీద్ ఆలీ, అవధాని అవుసుల భానుప్రకా ష్, లక్ష్మ ణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎన్ఆర్‌లో పట్టభద్రుల వేడుకలు




**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఇంజినీరింగ్, ఎంబిఎ, ఫార్మసీ విద్యార్థుల పట్టభద్రుల వేడుకను నల్ల నర్సింహారెడ్డి విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ముఖ్య అతిథి వర్చ్సా సంస్థ సీనియర్ డైరెక్టర్ మేకా వెంకటచలపతి కళాశాల ఉపాధ్యక్షుడు నల్ల ప్రశాంత్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. కళాశాల డైరెక్టర్ సి.వి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ విభాగాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించారు. అత్యుత్తమ ప్రతిభ కపబరిచిన విద్యార్థులకు బంగారు, వెండి పతకాలు అందజేసి అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని పట్టభద్రుల వేడుకను ఉత్సాహంగా తిలకించారు. కళాశాల డీన్లు వివిధ విభాగాల అధిపతులు, శిక్షణ, ఉద్యోగ నియామకాల అధికారి, అంతర్గత, నాణ్యత హామీ విభాగం సభ్యులు అధ్యాపకులు పాల్గొని పట్టభద్రులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## పైలెట్ రోహిత్‌రెడ్డి ఫాంహౌస్ ఆక్రమణలపై సమగ్ర విచారణ జరపాలి

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పేదలకు ఒక్క ఇల్లు కట్టించలేదు కాని వారు మాత్రం ఫాం హౌజ్‌లు నిర్మించుకున్నారని, అక్రమాలకు కేంద్ర బిందువుగా మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఫాం హౌజ్ మారిందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఆదివారం హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో గత బిఆర్ఎస్ పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని బిఆర్ఎస్ నాయకులు నిర్మించుకున్న ఫామ్ హౌజ్‌లు, ప్రభుత్వ భూములు ఆక్రమణకు సంబంధించిన అంశాలను కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులతో కలసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ కోసం ప్రజలు చేసిన పోరాట ఫలాలు సామాన్యులకు అందాల్సి ఉండగా గత పదేళ్ళ పాలనలో ఒక్క కెసిఆర్ కుటుంబానికి ప్రయోజనం చేకూరిందన్నారు. పేదోడికి కనీసం చిన్న ఇల్లు కూడా కట్టించి ఇవ్వలేదు కాను అధికారంలో ఉన్న సమయంలో కల్వకుంట్ల కుటుంబం, వారి పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఫామ్ హౌజ్‌లు నిర్మించుకున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ప్రభుత్వ భూములను ఆక్రమించడంతో అక్రమంగా ఫామ్‌హౌజ్‌ను నిర్మించుకున్నారని, ఇందుకు సంబంధించిన అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అలాగే ఫామ్ హౌజ్‌లను డ్రగ్స్ పార్టీలకు, ఎంఎల్ఎల కొనుగోలు వ్యవహారం వంటి వివాదాస్పద ఘటనలు సైతం ఈ ఫామ్ హౌజ్‌లోనే జరిగాయని ఆరోపించారు. డగ్స్ పార్టీలకు కేరాఫ్ మారిందని, ఇదేనా మీరు ఇచ్చేది యువతకు సందేశం మండి పడ్డారు.

యువతకు ఎలాంటి సందేశం ఇస్తున్నారో తాండూరు ప్రజలు, యువత గమనిస్తున్నారని అన్నారు. ఈ పర్యటనలో ఎంపిలు మల్లురవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంఎల్‌ఎసి అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్, ఎంఎల్‌ఎలు బీర్ల ఐలయ్య, ఈర్లపల్లి శంకర్, తదితర కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## చిన్న వర్షానికే చిత్తడిగా ప్రధాన రహదారులు



**ప్రజాపక్షం/వికారాబాద్ :** మున్సిపల్ పరిధిలోని రహదారుల పరిస్థితి రోజు రోజుకు అధ్వానాంగా మారుతోంది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులు చిత్తడిగా మారుతున్నాయి. దీంతో వాహనాదరులు ,పాదచారులు నిత్యం అవస్థలు పడాల్సి వస్తోంది. పట్టణంలోని పలు కాలనీలు ,ప్రధాన రహదారులు ,అంతర్గత వీధుల్లో పెద్ద ఎత్తున గుంతలుఉ ఏర్పాడ్డాయి ,చిన్న వర్షం కురిసినప్పుడు గుంత్లో నీరు నిలిచిపోవడంతో రోడ్డుపై గుంతలు ఎక్కడున్నాయో గుర్తించడం కష్టంగా మారుతుంది. ద్విచక్ర వాహనాదారులు ప్రధామాలకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పలు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపునీరు రోడ్డుపైకి చేరుతుంది. మురుగు కాలువలు పొంగిపొర్లడంతో రోడ్లపై బురద ,మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతునట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో ప్రజలు రోడ్లపై నడవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన మున్సిపల్ చైర్‌పర్సన్ కమిషనర్ స్పందించి పట్టణంలోని గుంతల రోడ్లను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వర్షపునీరు రోడ్లపై నిల్వ ఉండకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఘనంగా అన్నదానం

**ప్రజాపక్షం/చర్లపల్లి :** కుషాయిగుడ డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీ ఫెజ్1 లోని గణేష్ మంటపంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ క్రైమ్ ఇన్స్‌పెక్టర్ జి వెంకటేశ్వర్లు, ఎస్ఐలు సుధాకర్‌రెడ్డి, సాయిలు, పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కమిటి సభ్యులు అతిదులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు రవీందర్‌రావు, కృష్ణారెడ్డి, మహేందర్ గౌడ్, తారకేష్, యాదగిరి, విద్యాసాగర్‌రెడ్డి, వాసు, తదితరులు పాల్గొన్నారు.





## మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి

శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ నర్సింహారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మహిళల భద్రతపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తుందని, మహిళలకు అనేక చట్టాలు ఉన్నాయని వాటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ కొండ నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మూడుచింతలపల్లి మున్సిపల్ సంపన్‌బోల్‌లో నాభిశిల యూత్ ఆధ్వర్యంలో వినాయకుడి వద్ద చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ కొండ నర్సింహారెడ్డి చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలను తిలకించారు. చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలకు చట్టపరమైన సమస్యలు ఎదురైతే తప్పకుండా పోలీసులను ఆశ్రయించాలని చెప్పారు. నాభిశిల యూత్ యువకులు ముందుకు వచ్చి ఇలాంటి ట్రేడిషనల్ కళలను ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సాయికృష్ణ, డాన్స్ టీచర్ తులసిరెడ్డి, కౌన్సిలర్‌లు, యువకులు పాల్గొన్నా రు.



## కాంగ్రెస్ అసమర్థ పాలన నుండి విముక్తి కలిగించు మహాదేవ..

బిఆర్ఎస్ నేతల వేడుకోలు

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన, అక్రమాలు, అన్యాయాలు, అవకతవకల నుండి తెలంగాణకు విముక్తి కల్పించాలని కోరుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ నేతలు విఘ్నేశ్వరునికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మహా గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణనాథుడికి బిఆర్ఎస్ నేత బాసుపల్లి వ్యాస్ గౌడ్ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వ్యాస్ గౌడ్ మాట్లాడుతూ అయ్యా మహాగణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భూలోకానికి విచ్చేసిన మీరు కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను సవివరంగా తెలిపారు. కెసిఆర్ పరిపాలన మళ్లీ రావాలని కోరుకున్నారు. మహాగణపతి ప్రజా మొరను ఆలకించి తెలంగాణకు కాంగ్రెస్ పాలన నుండి విమక్తి చేయాలని, శాంతి, న్యాయం, సుభిక్షం ప్రసాదించాలని విన్నవించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఆటో బలరాం, నార్లకంటి శ్యాం, కుంట వేణు, నదీమ్ రాయ్, పద్మక్క, తదితరులు పాల్గొన్నారు.

## రూ.2.81లక్షలు పలికిన గణనాథుడి లడ్డూ



**ప్రజాపక్షం/దుండిగల్:** బెవర్లీ పామ్స్‌లో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన గణనాథుడి లడ్డూ వేలం పాట ఘనంగా నిర్వహించారు.ఈ వేలం లో విల్లా నంబర్ 28కి చెందిన మోచర్ల కుటుంబం రూ.2,81,000లకు లడ్డూను కైవసం చేసుకుంది. మోచర్ల రామచంద్రరావు, మోచర్ల ఆదిలక్ష్మి దంపతుల పేరిట ఈ లడ్డూను సొంతం చేసుకున్నట్లు నిర్వాహకు లు తెలిపారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ వేలం పాటలో బెవర్లీ పామ్స్ నివాసులు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై లైంగిక దాడి

### తల్లితో సహా ముగ్గురిపై పోక్సో కేసు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి/ఉప్పల్ :** తల్లితో అక్రమ సంబంధం కొనసాగిస్తున్న వ్యక్తి తనపై పలుసార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడని, దీనికి తన తల్లితో పాటు మరో వ్యక్తి సహకరించాడంటూ ఓ బాలిక ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు ముగ్గురిపై పోక్సో కేసు నమోదు చేసారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత కొంత కాలంగా తన తల్లితో అక్రమ సంబంధం కొనసాగిస్తున్న ఓ వ్యక్తి సుమారు ఎనిమిది మాసాల నుండి తల్లి సమక్షంలోనే లైంగిక దాడికి పాల్పడుతూ వచ్చాడని, దీనికి మరో వ్యక్తి సైతం సహకారం ఉందని, ఈ క్రమంలోనే గర్భస్రావం కావటంతో మేడిపల్లిలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లటంతో ఎనిమిది రోజులు ఆస్పత్రిలోనే ఉన్నానని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. వారం రోజుల క్రితం తాను అక్క ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని తెలియ చేయటంతో ఎట్టకేలకు అక్క సహకారంతో జరిగిన విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగలిగానని ఫిర్యాదులో తెలిపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్న పోలీసులు దర్యాప్తు చేసుకొన్నారు.

## ఎల్లారెడ్డిగూడలో ఘోర రోడ్డు ప్రమాదం

మట్టి దిబ్బను తప్పించబోయి టిప్పర్ కిందపడి యువతి, బాలుడు దుర్మరణం






**ప్రజాపక్షం/జవహర్‌నగర్:** జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడలోని రాయల్ ఇరానీ కేఫ్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన బంధువులైన యువతి, బాలుడు అక్కడికక్కడే మృతి చెందారు. గణేష్ పూజ సమయంలో అన్నదాన కార్యక్రమానికి వెళ్లి వస్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ సైదులు తెలిపిన వివరాల ప్రకారం... కాప్రా ప్రాంతానికి చెందిన ఆర్‌టిసి కానిస్టేబుల్ మార్తల సూర్య నారాయణ రెడ్డి ఇంట శనివారం రాత్రి కుటుంబ సభ్యులు గణేష్ పూజ నిర్వహిస్తున్నారు.రాత్రి 9:00 గంటల సమయంలో కుటుంబ మిత్రుడైన గంధం వినయ్ కుమారుడు గంధం అమర్త్య (15) వచ్చి ఎల్లారెడ్డిగూడలోని తమ గణేష్ మంటపం వద్ద అన్నదానం జరుగుతోందని తెలిపాడు. దీంతో సూర్య నారాయణ రెడ్డి కుమార్తె మార్తల వెంకట దీప్తిక రెడ్డి (21), అమర్త్య ఇద్దరూ కలిసి ఆక్టివా స్కూటీ (టీ ఎస్ 08ఈ ఆర్ 9766) పై శాలివాహన ఎన్‌క్లేవ్ వైపు బయలుదేరారు. రాత్రి 9:30 గంటల ప్రాంతంలో రాయల్ ఇరానీ కేఫ్ వద్దకు చేరుకోగానే, రోడ్డుపై ఉన్న మట్టి దిబ్బను తప్పించే క్రమంలో స్కూటీ స్కిడ్ అయి కిందపడిపోయింది. అదే సమయంలో కాప్రా నుండి ఎల్లారెడ్డిగూడ వైపు మట్టి తో వెళ్తున్న టిప్పర్ లారీ (టీజీ 12టీ 3335) వెనుక టైర్లు దీప్తిక పైనుంచి వెళ్లగా ఇద్దరూ సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. మృతురాలి తండ్రి సూర్య నారాయణ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్, బాలాజీనగర్‌కు చెందిన గుంజ నరసింహ (28)పై బి.ఎన్.ఎస్ (బీఎన్ఎస్) సెక్షన్ 106 (1) కింద క్రైమ్ నంబర్ 1330/2026గా ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసినట్లు తనిఖీ అధికారి (ఎస్.ఐ.) ఆర్. రామకృష్ణ తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు వేగవంతం చేశారు.

వెంకీ కుదుముల నిర్మాతగా వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్న చిత్రం 'ఇట్లు అర్జున'. ఈ సినిమాతో అనీష్ హీరోగా పరిచయం అవుతుండగా, డెబ్యూ దర్శకుడు మహేష్ ఉప్పల దర్శకత్వం వహిస్తున్నారు.

రీల్



## 'చకోర'లో 'నా ప్రేమ దేవత..' పాట విడుదల

మాస్ పోయెట్రీతో మ్యూజికల్ లవ్ స్టోరీగా తెరకెక్కిన 'చకోర' చిత్రంలోని థర్డ్ సాంగ్ 'నా ప్రేమ దేవత' లిరికల్ వీడియోను మెలోడీ బ్రహ్మ మణి శర్మ ఆవిష్కరించారు.హాయ్ జాయ్ కమర్షియల్స్ బ్యాన్న డా. చింతాడ హేమారావు నిర్మాతగా, వింటేజ్ ఐకానిక్ పిక్చర్స్ నిర్మాణ సారథ్యంలో ఈ చిత్రం రూపొందింది. ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ దగ్గర ఫస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన మంగా శ్రీనివాస్ ఈ చిత్రంతో నూతన దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. శ్రవణ్, మలైకా టి. వాసుపల్ ను సరికొత్త ప్రేమ జంటగా పరిచయం చేస్తూ ఈ సినిమా తెరకెక్కింది. 'చకోర' చిత్రం ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 9న థియేటర్లలో విడుదల కానుంది.ఆణిముత్యాల్లాంటి పాటలతో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రిన్స్ హెన్రీ సంగీతం అందిస్తున్నారు. రామజోగయ్య శాస్త్రి ఈ సాంగ్ కు సాహిత్యం అందించారు.ఈ సందర్భంగా మెలోడీ బ్రహ్మ ప్రముఖ సంగీత దర్శకులు మణిశర్మ చకోర మూవీ టీమ్ ని ప్రశంసించి తన ఆశీస్సులు అందజేశారు .'నా ప్రేమ దేవత..' పాట ఎలా ఉందో చూస్తే నా ప్రేమ దేవతల్లే నిన్నే చూస్తున్నా, గుండెల్లో కోవెల కట్టి ఆరాధిస్తున్నా, అచ్చంగా ఆకాశం నినుపంపిందే, అందాల చెలి జాబిలి, నా పూల మధు మాసం నీతోనే ముడిపడి ఉందే..అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట. శ్రవణ్, మలైకా టి వాసుపల్, అనుష్క లూహార్, యామిని, ఎల్ బి శ్రీరామ్, సుమన్, బ్రహ్మాజీ, ఇంద్రజ, మణి చందన, నెల్లూరు సుదర్శన్, ప్రభావతి, మాధవి ప్రసాద్, జనార్దన్, ఆకెళ్ళ గోపాల కృష్ణ, వంగ పండు,వంశీ, సుమంత్, భాను, సూర్య మాకి రెడ్డి, నటిస్తున్నారు.

## నా కెరీర్ ప్రారంభం రోజులు గుర్తొచ్చాయి



### 'సమవర్తి' టీజర్ లాంచ్ ఈవెంట్‌లో శ్రీకాంత్

హీరో సత్యదేవ్ తాజాగా నటించిన చిత్రం 'సమవర్తి'. సత్యదేవ్ హీరోగా నటిస్తున్న 16వ చిత్రమిది. 'సమవర్తి' సినిమాను రుద్ర పిక్చర్స్ బ్యానర్ అండ్ పంచభూత ప్రొడక్షన్స్, స్ పై శివచరణ్ రెడ్డి జక్కిడి, శశిధర్ రెడ్డి పడమటి నిర్మిస్తున్నారు. అజయ్ నాగ్. వి దర్శకత్వం వహిస్తున్నారు. ఎకోలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలోనే తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళంలో థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ చిత్ర టీజర్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటుడు శ్రీకాంత్ మాట్లాడుతూ డైరెక్టర్ అజయ్ మా ఇంటికి వచ్చి కథ చెప్పాను. కథ బాగా నచ్చింది. ఈ సినిమా నేను ఒప్పుకోవడానికి మెయిన్ రీజన్ నా సోదరుడి లాంటి సత్యదేవ్. ఈ చిత్రంలో నాది డిఫరెంట్ క్యారెక్టర్. స్పెషల్ గా ఉంటుంది. హీరో చేయాల్సిన క్యారెక్టర్ ఇది. ఇవన్నీ కాల్యుకులేట్ చేసుకుని ఈ సినిమాలో నటించాను. నా క్యారెక్టర్ గురించి ఎక్కువగా చెబితే రివీల్ అవుతుంది. కర్ణాటకలో ఈ సినిమా షూటింగ్ చేశాం. ఉదయం మొదలుపెడితే మళ్లీ తెల్లవారుఝాము వరకు షూటింగ్ చేశారు. కానీ వీళ్ల ఐదారు రోజుల్లో చేశారంటే ఆశ్చర్యపోయాను అని అన్నారు.నేను డ్రీమ్ గా భావించిన షాట్స్, సీన్స్ నాతో అజయ్ ఈ చిత్రంలో చేయించాడు. టీజర్ రిలీజ్ కే సినిమా రిలీజ్ అన్నంత టెన్షన్ పడ్డాం. సమవర్తి సినిమాకు ఒక వండర్ ఫుల్ టీమ్ పనిచేసింది. ఈ టీమ్ మెంబర్స్ ఫ్రెండ్షిప్ కోసం ఈ సినిమా హిట్ అవ్వాలి. థియేటర్స్ లో మీకూ అదే ఫీల్ కలిగిస్తుంది. మా మూవీలో నటించిన శ్రీకాంత్ అన్నకు స్పెషల్ థ్యాంక్స్ అన్నారు.ఎడిటర్ ఆదిత్య ,డిఒపి హర్ష మల్లికార్జున , డిఒపి దేవ్ దీప్ క్రియేటివ్ ప్రొడ్యూసర్ వినయ్ రెడ్డి , ప్రొడ్యూసర్ శివచరణ్ రెడ్డి జక్కిడి , హీరోయిన్ గానవి లక్ష్మణ్ , నటుడు మోహన్ భగత్ , మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి ,డైరెక్టర్ అజయ్ నాగ్.వి. పాల్గొన్నారు.



## 'కదిరి కాళిదాస్'గా చిరంజీవి

మెగాస్టార్ నటిస్తున్న తాజా చిత్రం 'కాకా'. బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కదిరి కాళిదాస్ అనే పాత్రను పోషిస్తున్నాను అని స్వయంగా చిరంజీవి ఒక ఈవె ంట్‌లో వెల్లడించారు. ఆ ఈవెంట్ హోస్ట్‌గా యాంకర్ స్రవంతిని చూసి ఈ అమ్మాయి ఊరి క్యారెక్టర్ నేను చేస్తున్నాను 'కదిరి కాళిదాస్' గా చేస్తున్నాను అని చిరంజీవి పేర్కొన్నారు. చిరంజీవి , బాబీ కొల్లి కాంబినేషన్ లో వస్తున్న 'కాకా'సినిమా రాయలసీమ బ్యాక్ డ్రాప్ లో వస్తున్నట్లు చిరంజీవి వ్యాఖ్యలను బట్టి అర్థమవుతోంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కే నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. భారీ స్థాయిలో ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ చేస్తున్నారు. ఆంటోనీ ఎల్ రూబెన్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. కోన వెంకట్, కే చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందించగా, హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి రైటర్స్‌గా చేస్తున్నారు. భాను నందు డైలాగ్స్ రాస్తున్నారు.'కాకా' 2027 జనవరి 13న సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రాండ్గా థియేటర్లలో విడుదల కానుంది.

## అక్టోబర్ 30న 'కల్ట్'



మాస్ కా దాస్ విశ్వక్సేన్ తన ప్రతిష్టాత్మక చిత్రం 'కల్ట్'తో రాబోతున్నారు. విభిన్నమైన కథాంశాలతో ప్రయోగాలు చేసే విశ్వక్ ఈ చిత్రంలో నటించడంతో పాటు దర్శకత్వం, కథ, స్క్రీన్‌ప్లే కూడా రాస్తూ పూర్తి బాధ్యతలను తీసుకున్నారు. తారక్ సినిమాస్ బ్యాన్న సందీప్ కాకర్ల నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఇండియాస్ ఫస్ట్ అథెంటిక్ స్లాషర్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నారు.నిజ జీవితంలో జరిగిన కొన్ని కలవరపరిచే సంఘటనల నుంచి స్ఫూర్తి పొంది ఈ సినిమాను రూపొందిస్తున్నారు. డార్క్, ఇంటెన్స్, ఎడ్జ్ ఆఫ్ ది సీట్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ సినిమాకు సంబంధించిన ఆసక్తికరమైన ప్రపంచాన్ని, కథా నేపథ్యాన్ని పరిచయం చేస్తూ క్యూరియాసిటీ పెంచింది. అలాగే స్నేహాన్ని పరిచయం చేస్తూ విడుదలైన ఫస్ట్ సింగిల్కు కూడా మంచి స్పందన లభించింది. అక్టోబర్ 30 నుంచి ఈ సినిమా థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రంలో గాయత్రి భరద్వాజ్, తారక్ పొన్నప్ప, మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, కార్తికేయ, అనిరుధ్ భాస్కర్, యజ్ఞ తుర్లపాటి, కబీర్ భారతీయ, విశాఖ్ నాయర్, చెపూరి వివేక్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.అరవింద్ విశ్వనాథన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తుండగా.. రవితేజ గిరిజాల ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్ అరవింద్ మూలే మ్యాసీవ్ సెట్స్‌తో సినిమాకు ప్రత్యేకమైన విజువల్ వరల్డ్‌ను క్రియేట్ చేస్తున్నారు. ఈ సినిమాను తెలుగు, హిందీ, ఇంగ్లిష్, జపనీస్, స్పానిష్ భాషల్లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## మూగ కుర్రాడి ప్రేమ కథ 'ఇట్లు అర్జున'



వెంకీ కుదుముల నిర్మాతగా వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్న చిత్రం 'ఇట్లు అర్జున'. ఈ సినిమాతో అనీష్ హీరోగా పరిచయం అవుతుండగా, డెబ్యూ దర్శకుడు మహేష్ ఉప్పల దర్శకత్వం వహిస్తున్నారు. అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్నారు. టైటిల్ గ్లింప్స్, రెండు పాటలు, ఇతర ఆసక్తికరమైన ప్రమోషనల్ కంటెంట్‌తో సినిమా ఇప్పటికే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచింది. ఈ సినిమా అక్టోబర్ 30న థియేటర్లలో విడుదల కానుంది. మేకర్స్ టీజర్ రిలీజ్ లాంచ్ చేశారు. మూగ కుర్రాడైన అనీష్.. తన ప్రేమించిన కీర్తి(అనస్వర) తో మాట్లాడాలని, ఆమెను దగ్గరగా చూడాలని కోరుకుంటాడు. అతడిని పోలీసులు, గూండాలు వెతుకుతుండటంతో కథపై ఆసక్తి పెరుగుతుంది. తొలి సినిమాతోనే ఛాలెంజింగ్ పాత్రలో అనీష్ ఆకట్టుకున్నాడు. హ్యూమర్, ఎమోషన్, యాక్షన్‌తో పాత్రను ఎనర్జిటిక్‌గా ప్రజెంట్ చేశాడు. అనస్వర రాజన్ చార్మింగ్‌గా కనిపించింది. ఇద్దరి కెమిస్ట్రీ బాగుంది. దర్శకుడు మహేష్ ఉప్పల హ్యూమర్, ఎమోషన్, థ్రిల్స్ బ్యాలెన్స్ చేస్తూ టీజర్‌ను ఆసక్తికరంగా తీర్చిదిద్దారు. టీజర్ సినిమాపై అంచనాలని మరింత పెంచింది.నిర్మాత వెంకీ కుదుముల మాట్లాడుతూ మహేష్ ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీస్ చేశాడు. తన ప్యాషన్ నాకు చాలా నచ్చింది. తను చాలా టాలెంటెడ్. తన టాలెంట్‌ను నమ్మాను. తను చెప్పిన కథను స్క్రీన్ మీద చూసినప్పుడు చాలా సాటిస్ఫాక్షన్ వచ్చింది. అలాగే రాజాను డిఒపిగా లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. చాలా మంచి విజువల్స్ ఇచ్చాడు. నాగార్జున 100వ సినిమాకి ఈయనే డిఒపిగా పనిచేస్తున్నారు. ప్రతి డైరెక్టర్ ఒక సినిమాని నిర్మిస్తే అన్ని క్రాఫట్స్ మీద కమాండ్ వస్తుందని నేను ఫీల్ అవుతున్నాను. నిర్మాతగా నేను, దర్శకుడు, హీరో.. అందరం కొత్త వాళ్లం. అక్టోబర్ 30న తప్పకుండా అందరూ సినిమాని థియేటర్‌లో చూస్తారని కోరుకుంటున్నాను అని చెప్పారు. హీరో అనీష్, అనస్వర రాజన్, దరాకుడు మహేష్ ఉప్పల, మానస శర్మ పాల్గొన్నారు.



## క్రేజీ గ్యాంగ్‌కు లీడ్‌గా వెన్నెల కిశోర్

ప్రముఖ కమెడియన్, నటుడు వెన్నెల కిశోర్ నటిస్తున్న 'గుడ్ బాయ్స్' సినిమాలోని మోషన్ పోస్టర్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. రాఘవ్ కథను అందిస్తూ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాను సూర్య గుణ్ణం, వివేక్ ఇనంపూడి, నవ్య శశాంక్ కనకమేడల నిర్మిస్తున్నారు. ఫస్ట్ లుక్ చూస్తుంటే 'గుడ్ బాయ్స్' సినిమా ఫుల్ కామెడీ, కడుపుబ్బా నవ్వించే సన్నివేశాలు, ఊహించని అడ్వెంచర్లతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో వెన్నెల కిశోర్ ఓ క్రేజీ గ్యాంగ్‌ను లీడ్ చేస్తూ తనదైన కామెడీతో అలరించనున్నారు. ఇటీవల ఈ చిత్రం నుంచి విడుదలైన 'కజిన్స్ ఆర్ కమింగ్' ప్రమోషనల్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. సినిమాలోని ప్రధాన నటీనటులతో రూపొందించిన ఈ వీడియోలోని ఫన్నీ సన్నివేశాలు, విభిన్నమైన క్యారెక్టర్లు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇప్పుడు విడుదలైన మోషన్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఇందులో మొత్తం గ్యాంగ్‌ను స్టైలిషగా, ఫుల్ గందరగోళంగా ఉన్న సెటప్లో పరిచయం చేశారు. 'వీళ్లు హీరోలు కాదు.. అసలు హీరోలకు దగ్గరగా కూడా రారు. కానీ విలన్లను ఎదుర్కొనేంత పిచ్చి ఉన్నవాళ్లు మాత్రం వీళ్లే' అనే ట్యాగ్లైన్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ ఒక్క లైన్తోనే సినిమా ఎంత ఫన్ఫుల్‌గా, వెరైటీగా ఉండబోతుందో అర్థమవుతోంది.ఈ సినిమాలో వెన్నెల కిశోర్, శృతి సోధి, రవి రాజా, వివా హర్ష, వామ్సీ గౌడ్, గుండు సుదర్శన్, జోషి జోష్ క్రియేషన్స్, హైపర్ ఆది, రఘుబాబు, కిరణ్ మాచా, ఢీ పండు, రమణ భార్గవ్, అశ్విని అయ్యలూరు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు గౌతమ్ గోవిందరాజన్ సినిమాటోగ్రాఫర్‌గా, శ్రీచరణ్ పాకాల సంగీత దర్శకుడిగా, సీనియర్ ఎడిటర్ మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటర్గా పనిచేస్తున్నారు. ఈ సినిమాకు అర్జున్ రాజా దాసరాజు సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

# బడా గణేశ్ దర్శనానికి జనం బారులు



### రద్దీగా ఖైరతాబాద్‌సహా ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాలు

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ (హైదరాబాద్) :** గణేశ్ నవరాత్రి ఉత్సవాలు హైదరాబాద్‌లో వైభవంగా కొనసాగుతున్నాయి. ఖైరతాబాద్‌లోని పంచముఖ సంకటహర మహా గణపతిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. బడా గణేష్ దర్శనానికి రెండు కిలోమీటర్ల మేర భక్తులు క్యూ కట్టారు. మహాగణపతి దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. ఆదివారం సెలవు దినం కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు లక్షన్నరకు పైగా భక్తులు బడా గణేష్‌ను దర్శించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎండ తీవ్రత కారణంగా భక్తులు ఇబ్బందులపాలయ్యారు. భారీ సంఖ్యలో తరలివస్తున్న భక్తులకు తోడుగా వీవీఐపీలు క్యూ కట్టడంతో ఖైరతాబాద్, సైఫాబాద్, లక్డీకాపూల్, సచివాలయం, అసెంబ్లీ పరిసరాలు, ఎర్రమంజిల్ పరిసర తదితర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీబందోస్తు నిర్వహించారు. మరోవైపు జలమంటలి అధ్వర్యంలో భక్తులకు మంచినీరు అందించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తోపాటు, హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ ఎమ్మెల్యేలు ప్రేంసింగ్ రాథోడ్, చింతల రాంచంద్రారెడ్డి, సినీ, రాజకీయ ప్రముఖులు, వివిఐపిలు భారీగా తరలివచ్చి ఉండ్రాలయ్యను దర్శించుకుని ముడుపులు సమర్పించుకున్నారు. రోజురోజుకూ భక్తుల సంఖ్య పెరుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకరం తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా భక్తుల రద్దీకి తగ్గట్లు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు పొన్నం వెల్లడించారు. భగవంతుడి కృపతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరినట్లు తెలిపారు. తెలంగాణలో వర్షాలు కురవాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఇక్కడికి వచ్చే భక్తులు కోరుకోవాలని పొన్నం విజ్ఞప్తి చేశారు. మహాగణపయ్యకు ఇప్పటి వరకు రూ.3.18 కోట్లు ఆదాయం సమకూరినట్లు సమాచారం. వేలాదిగా తరలివస్తున్న భక్తుల సౌకర్యార్థం మెట్రో, ఎంఎంటిఎస్, ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భక్తుల కోసం జలమండలి ఆధ్వర్యంలో తాగునీటి ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో ఖైరతాబాద్ మెట్రోస్టేషన్ నుంచి మండపం వచ్చే దారిలో రద్దీ బాగా పెరిగింది. ఆలయ ప్రాంగణమంతా సీసీ కెమెరాల నిఘా ఉంచడంతో పాటు, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా భారీ ఎత్తున పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఖైరతాబాద్‌లో 69 అడుగుల ఎత్తులో పంచముఖ సంకటహర మహా గణపతి దర్శనమిస్తుండగా.. కాళికామాత, సోమనాథ్ జ్యోతిర్లింగం, విశ్వకర్మ, విష్ణుమూర్తి రూపాలు ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



## 'పాలిటెక్నిక్ విధానానికి' హై లెవల్ కమిటీ సానుకూలం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ప్రస్తుతం అమలులో ఉన్న రెగ్యులర్ అకాడమీ విధానాన్ని యథావిధిగానే కొనసాగించేందుకు హై లెవల్ కమిటీ సుముఖత వ్యక్తం చేసినట్టు తెలంగాణ పాలిటెక్నిక్ జాయింట్ యాక్షన్ కమిటీ (టిపిజెఎసి) తెలిపింది. ఈ మేరకు హై లెవల్ కమిటీలో చర్చ జరిగినట్టు జెఎసి చైర్మన్ నాగరాజు, కోచైర్మన్ అభినవ్,కన్వీనర్ సురేష్, సెక్రెటరీ జనరల్ శ్రవణ్ కుమార్, శ్రీరామ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెగ్యులర్ తరగతులు,ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు, ప్రస్తుత పరీక్ష విధానాన్ని కొనసాగించాలని, విద్యార్థుల విద్యా కార్యకలాపాలకు ఎటువంటి అంతరాయం కలగకుండా సాధారణ విద్యా ప్రక్రియను కొనసాగిస్తామని హైలెవెల్ కమిటీ స్పష్టత ఇచ్చినట్టు వారు తెలిపారు. పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థకు సంబంధించిన అంశాలను సమగ్రంగా పరిశీలించి, సంబంధిత భాగస్వాముల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న డిప్లొమా కోర్సులను ఎఐసిటిఇ సంబంధిత అంశాలు, ప్రభుత్వ,ప్రైవేటు పాలిటెక్నిక్స్, పరీక్ష విధానం, తదితర వ్యవస్థలు యధావిధిగానే కొనసాగుతాయని చర్చలో స్పష్టత వచ్చిందన్నారు. భవిష్యత్తులో స్కిల్ డెవలప్‌మెంట్ లేదా ఆ ఇండస్ట్రీకి సంబంధించిన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఏర్పడితే, సంబంధిత భాగస్వాములతో సంప్రదింపులు జరిపిన తర్వాతనే తగిన చర్యలు తీసుకునే అంశం హై లెవల్ కమిటీ చర్చలో ప్రస్తావనకు వచ్చిందని వారు తెలిపారు. కూడా చర్చలో ప్రస్తావించబడింది.

## బలపడుతున్న అల్పపీడనం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. అనంతరం ఈనెల 23 నాటికి దక్షిణ ఒడిశా, ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరాలకు సమీపంలోని పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతానికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో ఈనెల 20 నుంచి వారం రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని 24 జిల్లాలకు అధికారులు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయన్నారు. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. సోమవారం మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఆ తర్వాత బుధ, గురు, శుక్రవారాల్లో వర్ష తీవ్రత మరింత పెరిగి, పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించారు....

## రష్యాపై భీకర దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక సహాయారం అందించే వనరుగా ఉన్న ఈ ప్రాంతంలోని లాజిస్టిక్ సైట్‌పై దాడులు చేసినట్లు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఒక ప్రకటనలో తెలియజేశారు. అదేవిధంగా శనివారం కీవ్ సమీపంలో జరిగిన క్షిపణి దాడుల్లో ముగ్గురు పిల్లలు సహా ఎనిమిది మంది మరణించారని కూడా ఆయన చెప్పారు.

**యూరప్‌–రష్యా మధ్య యుద్ధ ఊహాగానాలు**

యూరప్ దేశాలు–రష్యా మధ్య యుద్ధం జరుగుతుందని యూరోపియన్ యూనియన్‌లో ఊహాగానాలు సాగుతున్నాయి. అందుకు తగ్గట్టుగానే ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ కూడా స్పందించారు. రష్యా దురాక్రమణ నుండి ఎవ్వరూ తప్పించుకోలేరని,సర్వసన్నద్ధత అవసరమని వ్యాఖ్యానించారు. పోలెండ్ ప్రభుత్వం కూడా స్పందిస్తూ, ఉక్రేన్‌కు యుద్ధంలో మద్దతు కొనసాగించాలని స్పష్టం చేసింది. జర్మనీ,లిథుయేనియా దేశాలు కూడా రష్యా దురాక్రమణ చేస్తుందంటూ ఆందోళనలు వ్యక్తం చేశాయి. ఈ దశలో యూరప్‌దేశాలు రష్యాకు వ్యతిరేకంగా పౌర,సైనిక సన్నాహాలు ముమ్మరం చేస్తున్నాయని టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ ప్రకటించింది. ఉక్రేన్‌కు మద్దతు ఇస్తున్న నాటో కూటమి దేశాలపై రాబోయే నెలల్లో యుద్ధం జరుగుతుందని ఊహాగానాలు సాగుతున్నాయి.ఉక్రేన్‌కు మద్దతు ఇస్తున్న యూరప్ దేశాలపై రష్యా రాబోయేకాలంలో క్షిపణి,డ్రోన్,సైబర్ దాడులను ఉద్ధృతం చేస్తుందని హెచ్చరికలు వెలువడుతున్నాయి.పౌరులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు వెళుతున్నాయి.ఈ పెరిగిన ఆందోళన కారణంగా యూరప్‌వ్యాప్తంగా సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఫ్రాన్స్‌లోని కీలక మౌలిక సదుపాయాలను, జర్మనీలో ఆసుపత్రుల సంరక్షణ ప్రణాళిక,లిథుయేనియాలో కూడా తరలింపు ప్రణాళిక,పోలెండ్‌లో వాయురక్షణ చర్యలు వరకూ అనేక సన్నాహాలు జరుగుతున్నాయి. 2022లో ఉక్రేన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించి కొనసాగిస్తుండగా, ఇతర యూరప్ దేశాలు మాత్రం నేరుగా రంగంలోకి దిగకుండా తెరవెనుక నుండి పూర్తి సైనిక,రక్షణ సామాగ్రి సమకూరుస్తూ సహాయం చేస్తున్నాయి. ఫ్రెంచ్ అధ్యక్షుడు మేక్రాన్ కూడా గడచిన శుక్రవారం ఎలీసీ ప్యాలెస్‌లో ప్రతిపక్షాలు,అధ్యక్ష అభ్యర్థులతో కలిసి కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు.

## సంపూర్ణ రక్షణ

(మొదటి పేజీ తరువాయి)

తాను స్పష్టమైన హామీ ఇస్తున్నానని, వారి అంగుళం భూమి కూడా ప్రభుత్వం తీసుకోదని పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. భూములను స్వాధీనం చేసుకునే ఆలోచన ప్రభుత్వానికి లేదని, తమ భూముల విషయంలో ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని చెప్పారు. ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. భూములకు సంబంధించిన రికార్డుల పరిశీలన, రీసర్వేలు, భూ సమస్యల పరిష్కారం వంటి చర్యలను ప్రజల భూములను లాక్కోవడానికి చేస్తున్న ప్రయత్నాలుగా చూడటం సరికాదన్నారు. భూములపై ప్రజలకు ఉన్న హక్కులను స్పష్టంగా నమోదు చేయడం, భూ వివాదాలకు పరిష్కారం చూపడం, భూ హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దళితుల భూముల విషయంలో కొందరు కావాలనే భయాందోళనలు సృష్టిస్తూ విష్రచారం చేస్తున్నారని, తమ రాజకీయ ప్రయోజనాల కోసం దళితులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. వాస్తవాలను తెలుసుకోకుండా అలాంటి ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్య చట్టబద్ధంగా, పారదర్శకంగా ఉంటుందని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా భూములపై హక్కులు లేక ప్రభుత్వ ప్రయోజనాలకు దూరమైన దళితులు, గిరిజనులకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి తెలిపారు. రీసర్వే ద్వారా భూముల వాస్తవ పరిస్థితులను గుర్తించి వారికి హక్కులు కల్పిస్తున్నామని చెప్పారు. సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల ప్రాంతాల్లోని 15 రెవెన్యూ గ్రామాలతో పాటు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో దశాబ్దాలుగా ఉన్న భూ సమస్యలకు పరిష్కారం చూపించామన్నారు. భూమిపై హక్కులు కల్పించడం ద్వారా ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, దళితులు, గిరిజనుల భూ హక్కులను మరింత పటిష్టం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు.

## పనులు వేగవంతం

(మొదటి పేజీ తరువాయి)

విమానాల నిర్వహణ, సందర్శక విమానాల పార్కింగ్ డిస్పర్సల్స్, వెదర్ షెల్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాంగర్లు, ఆపరేషనల్ కాంప్లెక్స్, శిక్షణ కేంద్రాలు, మెయింటెనెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి ప్రతిష్టాత్మక నిర్మాణాలను చేపట్టనున్నారు. పౌర విమానయాన అవసరాల కోసం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) ఆధ్వర్యంలో ఒక ఆధునిక సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ అండ్ రిపేర్ ఆపరేషన్స్ (ఎంఆర్ఓ) సదుపాయాన్ని ఏర్పాటు చేయనున్నారు. దీనికి అదనంగా, వైమానిక దళ సిబ్బంది నివాసం కోసం సింగిల్ లివింగ్ క్వార్టర్లు, వివాహిత సిబ్బంది క్వార్టర్లు, క్రీడా, వినోద కేంద్రాలు, అత్యవసర వసతులతో కూడిన ప్రత్యేక డొమెస్టిక్ సెటప్‌ను నిర్మించనున్నారు. అలాగే, నీటి సరఫరా, పారిశుద్ధ్యం వంటి అత్యవసర ఇంజనీరింగ్ ప్రాజెక్టులను కూడా అభివృద్ధి చేయాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు పనులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అన్ని భాగస్వామ్య వర్గాల మధ్య వేగవంతమైన సమన్వయం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే ఒక నోడల్ అధికారిని నియమించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com